www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 27-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 89 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: షష్ఠి సా. 6.40 తదుపరి సప్తమి; నక్షత్రం: శతభిషం ఉ. 11.37 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా. 5.38-7.08; దుర్ముహూర్తం: ఉ. 10.07-11.00, మ. 3.20-4.12; అమృతఘడియలు: శేషం ఉ. 6.12 వరకు, రా. 2.39-4.09; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# లెక్క సరిచేస్తారా!

## జోరుమీదున్న రోహిత్ సేన

రాత్రి 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో

కీలకంగా బుమ్రా, కుల్దీప్

### రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ నేడు




జార్జ్‌టౌన్ (గయానా): ఆలస్యంగా జోరందుకొన్న భారత్.. నాకౌట్ తడబాటుకు చెక్ చెప్పాలన్న కసితో ఉంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్‌తో టీమిండియా తలపడనుంది. చివరిసారి ఈ రెండు జట్లు 2022 పొట్టికప్ సెమీస్‌లో తలపడగా.. రోహిత్ సేన 10 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. ఆ ఓటమికి ఈసారి ఎలాగైనా బదులు తీర్చుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మనోళ్ల సంప్రదాయ ఆటతీరు అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. దీంతో ఆటతీరు మార్చుకొన్న భారత్.. టీ20లకు అవసరమైన దూకుడును అలవర్చుకొంది. పేపర్‌పై చూస్తే భారత జట్టు ఎంతో బలంగా కనిపిస్తోంది. అజేయంగా సెమీస్‌కు చేరినా.. టాపార్డర్‌లో కోహ్లీ ఫామ్ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. కానీ, రోహిత్ ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియాపై చెలరేగిన తీరు.. అతడి ఆటపై నెలకొన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేసింది. మిడిలార్డర్‌లో శివమ్ దూబే కూడా ఆశించిన స్థాయిలో ఆడలేక పోవడం విమర్శలకు దారితీస్తున్నా.. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చడానికి మేనేజ్‌మెంట్ ఇష్టపడడం లేదు. స్పిన్ బాధ్యతలను జడేజా, అక్షర్, కుల్దీప్ చేపట్టనున్నారు. ఇక, పేసర్ బుమ్రా నిలకడగా రాణిస్తుండడం భారత్‌కు సానుకూలం. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా మెరుగ్గా రాణిస్తున్న నేపథ్యంలో.. జట్టు మరోసారి అతడి నుంచి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది.

**ప్రమాదకరంగా బట్లర్..:** కిందామీదా పడుతూ సెమీస్ చేరిన ఇంగ్లండ్.. ప్రమాదకరంగా కనిపిస్తోంది. అమెరికా మ్యాచ్‌తో కెప్టెన్ బట్లర్ ఫామ్‌లోకి రావడం ఆ జట్టుకు ఊరటనిచ్చే అంశం. ఓపెనర్ ఫిల్‌సాల్ట్, బెయిర్‌స్టో, బ్రూక్ కూడా ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల సమర్థులు. మొయిన్ అలీ, ఆదిల్ రషీద్, లివింగ్‌స్టోన్ స్పిన్ భారాన్ని మోస్తున్నారు. పేసర్లలో ఆర్చర్‌కు జోడీగా జోర్డాన్, మార్క్ ఉడ్‌లలో ఎవరికి తుదిజట్టులో చోటు కల్పించాలనే డైలమాలో బట్లర్ ఉన్నాడు. మొత్తంగా ఈ సమవుజ్జీల సమరం ఆసక్తిగా సాగే అవకాశం ఉంది.

### జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, బుమ్రా, కుల్దీప్.

**ఇంగ్లండ్:** సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్, కర్రాన్, జోర్డాన్/మార్క్ ఉడ్, ఆర్చర్, టోప్లే, రషీద్.

### పిచ్/వాతావరణం

వికెట్ స్పిన్నర్లకు అనుకూలం కావడంతో.. ఓ మాదిరి స్కోర్లు నమోదయ్యే అవకాశాలున్నాయి. బౌన్స్ తక్కువగా ఉండడంతో పాటు బంతి వేగంగా టర్న్ తీసుకొనే చాన్సులున్నాయి. కాగా, భారత్‌కు ఈ వికెట్‌పై ఆడిన అనుభవం కలిసిరానుంది. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వరల్డ్‌కప్‌లో ఈ వికెట్‌పై ఆడిన గత ఐదు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు మూడు గెలిచింది.

### రిజర్వు డే లేదు..

భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు రిజర్వు డే లేదని ఎంతో ముందుగానే నిర్ణయించారు. రిజర్వ్‌డే ఉంటే ఫైనల్ మ్యాచ్ ఆడేందుకు గెలిచిన జట్టు.. మరి కొన్ని గంటల్లోనే సిద్ధం కావాల్సి వస్తుంది. కానీ, 250 నిమిషాల అదనపు సమయం మాత్రం కేటాయించారు. సెమీస్‌లో విజేతను తేల్చాలంటే కనీసం 10 ఓవర్ల మ్యాచ్ జరగాలి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే సూపర్-8 టాపర్ భారత్.. ఫైనల్‌కు చేరుకొంటుంది.

## నాకౌట్‌కు ఇంగ్లండ్

కొలోన్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్స్‌లో ఇంగ్లండ్ నాకౌట్‌కు చేరింది. గ్రూప్-సిలో ఇంగ్లండ్-స్లొవేనియా మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది. ఇంగ్లండ్ గ్రూప్ విన్నర్‌గా రౌండ్-16కు చేరగా.. స్లొవేనియా కూడా నాకౌట్ బెర్త్ పట్టేసింది. ఇదే గ్రూప్‌లో డెన్మార్క్, సెర్బియా మధ్య మ్యాచ్ కూడా 0-0తో డ్రా అయింది. డెన్మార్క్ కూడా ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. గ్రూప్-ఈలో రొమేనియా, స్లొవేకియా మ్యాచ్ 1-1తో, ఉక్రెయిన్-బెల్జియం మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిశాయి. దీంతో రొమేనియా, బెల్జియం, స్లొవేకియా రౌండ్-16కు చేరుకొన్నాయి.

## అర్ష్‌దీప్ టాంపరింగ్ చేస్తున్నాడు



న్యూఢిల్లీ: పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ భారత పేసర్ అర్ష్‌దీప్‌పై తీవ్ర విమర్శ చేశాడు. అర్ష్‌దీప్ బంతిని టాంపర్ చేస్తున్నాడని అన్నాడు. '15వ ఓవర్లో రివర్స్ స్వింగ్ రాబట్టడమేవిటి. అంటే 11, 12 ఓవర్లలోనే బంతిని టాంపర్ చేసి ఉండొచ్చు' అని అన్నాడు. అయితే ఇంజీ విమర్శల్ని భారత సారథి రోహిత్ శర్మ కొట్టిపారేశాడు. ఇక్కడి పిచ్‌లపై అన్ని జట్లకూ రివర్స్ స్వింగ్ లభిస్తోందని అన్నాడు.

## రషీద్‌ఖాన్‌కు మందలింపు

టరోబా (ట్రినిడాడ్) : అఫ్ఘానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్‌ను ఐసీసీ మందలించింది. బంగ్లాదేశ్‌తో సూపర్-8 మ్యాచ్‌లో రెండో పరుగు తీసేందుకు నిరాకరించిన సహచరుడు జనత్‌పై ఆగ్రహం వ్యక్తంచేసిన రషీద్..బ్యాట్‌ను విసిరి కొట్టాడు. ఇది ఐసీసీ నియమావళికి విరుద్ధమంటూ అతడిని మందలించింది.

## నితీశ్‌కు గాయం

జింబాబ్వే టూర్ నుంచి అవుట్
దూబేతో భర్తీ



న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో జింబాబ్వే టూర్ నుంచి అవుటయ్యాడు. అతడి స్థానంలో శివమ్ దూబేను ఎంపిక చేసినట్టు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ నితీశ్ పరిస్థితిని మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోందని తెలిపింది. అయితే హెర్నియాతో బాధపడుతున్నట్టు సమాచారం. వచ్చే నెల 6 నుంచి జింబాబ్వేతో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఇందుకోసం శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత జట్టును సెలెక్టర్లు సోమవారం ప్రకటించారు. ఐపీఎల్‌లో అదరగొట్టిన రియాన్ పరాగ్, నితీశ్, అభిషేక్ శర్మలకు తొలిసారి చోటు కల్పించారు.

## జర్మనీలో నిఖత్ శిక్షణ


న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఆరుగురిలో ఒక్కరు మినహా విగిలిన ఐదుగురు భారత బాక్సర్లు ప్రత్యేక శిక్షణ కోసం జర్మనీ వెళ్లనున్నారు. వీరిలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ కూడా ఉంది. ఈనెల 28న జర్మనీ బయలుదేరుతున్న ఈ ఐదుగురు నెల రోజుల పాటు అక్కడ శిక్షణ తీసుకోనున్నారు. వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ (50 కిలోలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కి.), నిషాంత్ దేవ్ (71 కి.), ప్రీతి పవార్ (54 కి.), జాస్మిన్ లాంబోరియా (57 కి.) ఐర్లాండ్, అమెరికా, మంగోలియా, జర్మనీ, డెన్మార్క్ దేశాల బాక్సర్లతో కలిసి వీరు ప్రాక్టీస్‌లో పాల్గొంటారు. జర్మనీ వాతావరణం పారిస్‌కు దగ్గరగా ఉండడంతో అక్కడి పరిస్థితులకు కూడా భారత బాక్సర్లు అలవాటు పడతారని జాతీయ బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. కామన్వెల్త్ స్వర్ణ పతక విజేత అమిత్ పంఘల్ (51 కి.) మాత్రం శిలారూలోని సాయ్ సెంటర్‌లోనే శిక్షణ కొనసాగించనున్నాడు. భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌లో ఈసారి ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగనున్నారు.


## హర్మన్‌కు 'పారిస్' పగ్గాలు



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టును జాతీయ హాకీ సమాఖ్య బుధవారం ప్రకటించింది. 16 మంది సభ్యుల ఈ బృందానికి ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వం వహించనున్నాడు. ఒలింపిక్స్‌లో ఆడే బృందంలో ఈసారి ఐదుగురు కొత్త కుర్రాళ్లకు అవకాశమివ్వడం విశేషం. గత ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత్ ఈ ఒలింపిక్స్‌లో పూల్-బిలో బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌తో తలపడనుంది. భారత జట్టు ప్రస్తుతం బెంగళూరులోని సాయ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటోంది. గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్‌కు ఇది నాలుగో ఒలింపిక్స్ కాగా, హర్మన్‌కు మూడోది. వచ్చే నెల 27న న్యూజిలాండ్ మ్యాచ్‌తో భారత్ ఒలింపిక్స్ వేట ఆరంభమనుంది.

## అఫ్ఘాన్‌కు అద్భుత అవకాశం




ఉదయం 6 గం. నుంచి

దక్షిణాఫ్రికాతో సెమీస్ నేడు

టరోబా (ట్రినిడాడ్) : తుది దశకు చేరిన టీ20 వరల్డ్ కప్‌లో మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం జరిగే తొలి సెమీఫైనల్లో సంచలన అఫ్ఘానిస్థాన్-తొలిసారి ఐసీసీ టోర్నీ టైటిల్ గెలవాలని పట్టుదలగా ఉన్న సౌతాఫ్రికా తలపడనున్నాయి. వర్ణ వివక్ష నిషేధం నుంచి బయటపడి 1991లో తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన సఫారీలు..నాటినుంచి ఇప్పటివరకు టీ20, వన్డే వరల్డ్ కప్‌లలో టైటిల్ ఫైట్‌కు చేరలేదు. పైగా..ప్రతి మేజర్ టోర్నీలలో కీలక మ్యాచ్‌ల్లో తడబాటుకు లోనవుతూ 'చోకర్సు'గా పేరు పొందింది దక్షిణాఫ్రికా జట్టు. ఈసారి అందుకు భిన్నంగా ఉత్కంఠ భరిత మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి సెమీస్ వరకు వచ్చింది. నేపాల్‌పై ఒక్క పరుగుతో, బంగ్లాదేశ్‌పై నాలుగు రన్స్‌తో, వెస్టిండీస్‌పై మూడు వికెట్లతో నెగ్గడం విశేషం. అపజయమే లేకుండా సెమీస్ వరకూ దూసుకొచ్చిన సౌతాఫ్రికా ఆ జోరు కొనసాగిస్తుందా అనేది చూడాలి. ఓపెనర్ డికాక్ అద్భుతంగా ఆడుతున్నాడు. మార్‌క్రమ్, స్టబ్స్, క్లాసెన్‌తో మిడిలార్డర్ డైనమిక్‌గా ఉంది. ఇక హార్డ్‌హిట్టర్ మిల్లర్ సంగతి చెప్పాల్సిన పనిలేదు. స్పిన్నర్లు కేశవ్, షంసీ ప్రత్యర్థి బ్యాటర్ల పనిపట్టగలరు. మరోవైపు..20 ఏళ్ల కిందట..2004లో ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ట్రోఫీలో అఫ్ఘానిస్థాన్ తమ మొదటి అంతర్జాతీయ పోటీ ఆడింది. ఆపై రెండు దశాబ్దాల్లోనే ఏకంగా టీ20 వరల్డ్ కప్ సెమీస్‌కు చేరడం ఆ జట్టు అనూహ్య పురోగతికి అద్దం పడుతుంది. కెప్టెన్ రషీద్ ఆటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లో ముందుండి జట్టును అమోఘంగా నడిపిస్తున్నాడు. ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ పవర్ ప్లేలో ప్రత్యర్థులకు గుబులు పుట్టిస్తున్నాడు. పేసర్లు ఫరూఖీ, నవీనుల్ ప్రత్యర్థి బ్యాటర్లను గడగడలాడిస్తున్నారు.

### జట్లు (అంచనా)

**సౌతాఫ్రికా :** మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, మిల్లర్, క్లాసెన్, స్టబ్స్, యాన్సెన్, కేశవ్, రబాడ, నోకియా, షంసీ.

**అఫ్ఘానిస్థాన్ :** రషీద్ (కెప్టెన్), ఇబ్రహీమ్ జద్రాన్, రహ్మనుల్లా గుర్బాజ్/హజ్రతుల్లా జజాయ్, అజ్మతుల్లా, నైబ్, నబీ, జానత్/ఇషాఖ్ (కీపర్), ఖరోటె, నవీనుల్, నూర్, ఫరూఖీ.

### పిచ్/వాతావరణం

వికెట్ బ్యాటింగ్, బౌలింగ్‌కు సహకరిస్తుంది. తొలి ఓవర్లు బ్యాటర్లకు అనుకూలిస్తాయి. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్లదే హవా. టోర్నీలో ఈ పిచ్‌పై జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో..రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్లు మూడుసార్లు నెగ్గాయి. వర్షానికి ఐదు శాతమే అవకాశం.

**మ్యాచ్‌కు శుక్రవారం రిజర్వ్ డే**

# బిజినెస్

## స్టాండర్డ్ డిడక్షన్ రూ.లక్షకు పెంచాలి

### ఆర్థిక మంత్రికి ఈవై సూచన

న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని పన్ను సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ ఈవై కోరింది. ముఖ్యంగా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని ప్రస్తుత రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచాలని కోరింది. ఇది వీలుకాని పక్షంలో ఆదాయ పన్ను (ఐటీ) పరిధిలోకి వచ్చే వ్యక్తిగత వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచాలని సూచించింది. ఇలా చేస్తే కొత్త ఐటీ విధానాన్ని వీలైనంత ఎక్కువ మంది ఎంచుకునే అవకాశం ఉందని తెలిపింది. వీటికి తోడు పన్ను శ్లాబులను మరింత స్ట్రీమ్‌లైన్ చేసి ఆర్థిక వృద్ధికి దోహదపడేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరింది. ఇలా చేయడం ద్వారా పెట్టుబడులను, అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించవచ్చని ఈవై కేంద్ర ఆర్థికమంత్రికి సూచించింది.

## ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎల్‌టీటీఎస్ పదవులకు నాయక్ గుడ్‌బై

**కొత్త చైర్మన్‌గా ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్**

న్యూఢిల్లీ: ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) చైర్మన్ పదవుల నుంచి ఏఎం నాయక్ తప్పుకున్నారు. నాయక్ స్థానంలో కొత్త చైర్మన్‌గా ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఈనెల 27 నుంచి బాధ్యతలు చేపడతారని రెండు సంస్థలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి.

## డాక్టర్ రెడ్డీస్ చేతికి నికోటినెల్ బ్రాండ్




### బ్రిటన్ కంపెనీతో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం
### డీల్ విలువ రూ.5250 కోట్లు

హైదరాబాద్: లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రపంచంలోనే అతి పెద్ద కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ హేలియాన్ పీఎల్‌సీకి చెందిన నికోటినెల్ బ్రాండ్ డాక్టర్ రెడ్డీస్ చేతికి వచ్చింది. నికోటినెల్ బ్రాండ్‌తో పాటు ఇతర స్థానిక మార్కెట్లలో దాని అనుబంధ బ్రాండ్లు నికాబెట్ (ఆస్ట్రేలియా), హాబిట్రాల్ (న్యూజిలాండ్, కెనడా), థ్రైవ్ (కెనడా) హక్కులు కూడా డాక్టర్ రెడ్డీస్ చేతికి వస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసులకు లోబడి నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) కింద ఈ ఔషధాలు వినియోగంలో ఉన్నాయి. ఈ బ్రాండ్లు చేజిక్కించుకునే ప్రక్రియలో భాగంగా హేలియాన్ గ్రూప్ కంపెనీ అయిన నార్త్ స్విట్జర్లాండ్ ఎస్ఏఆర్ఎల్ వాటాలను కొనుగోలు చేసేందుకు తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ డీల్ విలువ 50 కోట్ల పౌండ్లు (రూ.5250 కోట్లు). ఇందులో 45.8 కోట్ల పౌండ్లు రెండు సంవత్సరాల్లో (2025, 2026) నగదుగా చెల్లిస్తారు. రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ఈ డీల్ ఉంటుందని డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. ఈ ఏడాది నాలుగో త్రైమాసికానికి ఈ డీల్ ముగియవచ్చునని పేర్కొంది.

లావాదేవీ ముగియగానే అమెరికా వెలుపల జపాన్, లాటిన్ అమెరికా సహా సుమారు 30 మార్కెట్లలో ఆ ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ మార్కెటింగ్ చేయగలుగుతుంది. ఎన్ఆర్‌టీ విభాగంలో ప్రపంచంలోనే (అమెరికా మినహా) అతి పెద్ద బ్రాండ్ నికోటినెల్ అని తెలిపింది. అలాగే యూరప్‌లోని (రష్యా, ఇటలీ మినహా) 15 అతి పెద్ద ఓటీసీ బ్రాండ్లలో ఇదొకటి, ప్రపంచంలోని ఓటీసీ బ్రాండ్లలో 32వ స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కన్స్యూమర్ హెల్త్‌కేర్ రంగంలో డాక్టర్ రెడ్డీస్ ఇటీవల పరిధిని విస్తరించుకుంటూ వస్తోంది. నికోటినెల్ వ్యూహాత్మక కొనుగోలు ఆ విభాగంలో తమ స్థానాన్ని పటిష్ఠం చేస్తుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెల్ అన్నారు. అయితే వ్యాపార అనుసంధానత విజయవంతంగా పూర్తి చేయడానికి వీలుగా దశలవారీ విధానం అనుసరించనున్నట్టు కంపెనీ తెలిపింది. కొవిడ్-19 సమయంలో పొగాకు వినియోగదారులు ఆ అలవాటు నుంచి బయటపడడం ద్వారా మహమ్మారి తీవ్రతను తగ్గించుకునేందుకు ఎన్ఆర్‌టీ ఔషధాలను వినియోగించారు. పొగాకు కారణంగా ఏటా 80 లక్షల మంది వివిధ ప్రాణాంతక వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 130 కోట్ల మంది పొగాకు వినియోగదారులున్నారని అంచనా. వారిలో 60 శాతం మంది ఆ అలవాటు నుంచి బయటపడాలని కోరుకుంటున్నప్పటికీ 30 మందికి మాత్రమే నివారణా మార్గాలు అందుబాటులో ఉంటున్నాయి. సరైన వైద్య చికిత్సలు అందించగలిగినట్టయితే వారు కూడా ఈ అలవాటు నుంచి బయటపడగలుగుతారన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ అభిప్రాయం.

## కైగా ప్రాజెక్టు మేఘాకే...

### అణు ఇంధన రంగంలోకి ప్రవేశం

meil

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) కర్ణాటకలోని కైగా అణు విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టును చేజిక్కించుకుంది. అణు ఇంధన శాఖకు అనుబంధంగా పని చేస్తున్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐఎల్) నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో తమ కంపెనీ అతి తక్కువ బిడ్డర్‌గా ఎంపికయిందని ఎంఈఐఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్‌పీసీఐఎల్ ఇంతవరకు నిర్వహించిన బిడ్లలో భారీ విలువ గల బిడ్ ఇదే. కర్ణాటకలోని కైగా వద్ద 700 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణానికి ఈపీసీ విధానంలో ఎన్‌పీసీఐఎల్ బిడ్డింగ్ నిర్వహించింది. టెండరింగ్ ప్రక్రియ గత ఏడాది మే నెలలో ప్రారంభం కాగా అక్టోబరులో టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. ఎల్ అండ్ టీ, భెల్ వంటి దిగ్గజాలు పాల్గొన్న తీవ్ర పోటీ వాతావరణంలో అతి తక్కువ మొత్తానికి బిడ్ వేసిన కంపెనీగా ఎంఈఐఎల్‌ను ప్రకటించారు. రూ.12,799.92 కోట్లకు ఎంఈఐఎల్ బిడ్ దాఖలు చేసింది. ఇది ఎంఈఐఎల్ చరిత్రలో అత్యంత విశిష్టమైన ఘట్టమని, అణు ఇంధన రంగంలోకి తమ వ్యూహాత్మక ప్రవేశానికి ఇది వీలు కల్పిస్తుందని కంపెనీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు.

### విజయ డయాగ్నోస్టిక్స్‌లో మెడినోవా విలీనం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వైద్య సేవల రంగంలో మరో విలీనం చోటు చేసుకుంటోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెడినోవా డయాగ్నోస్టిక్స్ సర్వీసెస్ (ఎండీఎస్ఎల్) తన మాతృ సంస్థ విజయ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో (వీడీసీఎల్) విలీనం అవుతోంది. బుధవారం జరిగిన సమావేశంలో రెండు కంపెనీల డైరెక్టర్ల బోర్డులు ఇందుకు ఆమోదం తెలిపాయి. రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారుల ఆమోదం లభించి ఈ విలీనం పూర్తయ్యేందుకు ఏడాది వరకు సమయం పట్టే అవకాశం ఉందని విజయ డయాగ్నోస్టిక్స్ తెలిపింది. ఈ విలీనం ద్వారా రూ.10 ముఖ విలువ ఉన్న ప్రతి 22 మెడినోవా డయాగ్నోస్టిక్స్ షేర్లకు, రూపాయి ముఖ విలువ ఉండే ఒక విజయ డయాగ్నోస్టిక్స్ షేరు జారీ చేస్తారు.

## ఆగని రికార్డుల హోరు

**మూడో రోజూ లాభపడిన మార్కెట్**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో వరుసగా మూడో రోజూసరికొత్త రికార్డులు నమోదయ్యాయి. సెన్సెక్స్ 620.73 పాయింట్ల లాభంతో 78,674.25 వద్ద, నిఫ్టీ 147.5 పాయింట్ల లాభంతో 23,868.80 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రా డేలోనూ సూచీలు జీవిత కాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. గత మూడు రోజుల ర్యాలీతో మదుపరుల సంపద రూ.2.53 లక్షల కోట్లు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి లార్జ్ క్యాప్ షేర్లలో ర్యాలీ, ఆసియా మార్కెట్ల లాభాలతో మదుపరులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దిగడం, ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు ఎనిమిది శాతానికి చేరువలో ఉంటుందనే అంచనాలు, తగ్గుతున్న ద్రవ్యోల్బణంతో త్వరలోనే వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు బుధవారం నాటి ర్యాలీకి దోహదం చేశాయి.

**'రిలయన్స్' షేర్ల జోరు :** బుధవారం నాటి ర్యాలీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో ర్యాలీ బాగా దోహదం చేసింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 4.09 శాతం లాభంతో రూ.3,027.40 వద్ద ముగిశాయి. దీంతో బుధవారం ఒక్కరోజే రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల మార్కెట్ క్యాప్ రూ.80359.48 కోట్లు పెరిగి రూ.20,48,282.28 కోట్లకు చేరింది.

## బాండ్ల ద్వారా ఎస్‌బీఐ రూ.10,000 కోట్లు సమీకరణ

న్యూఢిల్లీ: రుణ పత్రాల (బాండ్స్) జారీ ద్వారా ఎస్‌బీఐ బుధవారం రూ.10,000 కోట్లు సమీకరించింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అందుబాటు ధరల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు ఈ నిధులను ఉపయోగించనుంది. నిజానికి ఈ బాండ్స్ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించాలని భావించింది. అయితే ప్రావిడెండ్ ఫండ్ సంస్థలు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఎగబడి సబ్‌స్క్రైబ్ చేయడంతో రూ.19,884 కోట్లకు బిడ్స్ వచ్చాయి. దీంతో రూ.10,000 కోట్లు మాత్రమే స్వీకరించాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. ఈ బాండ్స్‌పై ఎస్‌బీఐ 7.36 శాతం వడ్డీ చెల్లించనుంది.

## 'సీఎఫ్‌ఓ'లది కీలక పాత్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి, కంపెనీల ఆర్థిక నిర్ణయాల్లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లది (సీఎఫ్ఓ) కీలక పాత్ర అని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన 'సీఎఫ్ఓ కాన్‌క్లేవ్'లో ఆయన ఈ విషయం చెప్పారు. కంపెనీల వ్యాపార విస్తరణలో రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు కీలకమే అయినా, వ్యాపారాన్ని బట్టి ఆర్థికేతర అంశాలూ కీలకంగా మారతాయనే విషయాన్ని సీఎఫ్ఓలు గుర్తుంచుకోవాలని కోరారు.

## స్పెక్ట్రమ్ వేలం తుస్..

### పెద్దగా ఆసక్తి చూపని టెలికాం కంపెనీలు.. రెండో రోజే ముగిసిన ప్రక్రియ

### రూ.96,238 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌లో టెల్కోలు కొనుగోలు చేసింది రూ.11,340 కోట్లే..




న్యూఢిల్లీ: ఈ సారి టెలికాం స్పెక్ట్రమ్ వేలానికి కంపెనీల నుంచి స్పందన కరువైంది. స్పెక్ట్రమ్ కొనుగోలుకు టెలికాం కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం తో రెండో రోజే, కేవలం ఏడు రౌండ్లలోనే వేలం ప్రక్రియ ముగిసింది. రూ.96,238 కోట్ల కనీస విలువ చేసే 10 గిగాహెట్జ్‌ల స్పెక్ట్రాన్ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టగా.. అందులో 12 శాతానికి సమానమైన రూ.11,340.78 కోట్ల విలువైన 141.4 మెగాహెట్జ్‌ల రేడియో తరంగాలను మాత్ర మే టెల్కోలు కొనుగోలు చేశాయి. ఈ వేలంలో భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా రూ.6,856.76 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను దక్కించుకోగా.. వొడాఫోన్ ఐడియా (వీఐ) రూ.3,510.4 కోట్ల తరంగాలను కొనుగోలు చేసింది. కాగా, ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కేవలం రూ.973.62 కోట్ల స్పెక్ట్రాన్ని తీసుకుంది. 2022లో నిర్వహించిన వేలం ఏడు రోజులు కొనసాగగా.. కంపెనీలు రూ.1.5 లక్షల కోట్ల విలువైన 5జీ స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేశాయి. రిలయన్స్ జియో అత్యధికంగా రూ.88,078 కోట్ల విలువైన రేడియో తరంగాలను దక్కించుకుంది. అమ్మకానికి పెట్టిన స్పెక్ట్రమ్‌లో దాదాపు సగం జియోనే కొనుగోలు చేసింది. కాగా, ఎయిర్‌టెల్ రూ.43,084 కోట్లు, వీఐ రూ.18,799 కోట్ల స్పెక్ట్రాన్ని కొనుగోలు చేశాయి. దాదాపు రెండేళ్ల తర్వాత మళ్లీ స్పెక్ట్రమ్ వేలాన్ని నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం.. ఈసారి 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెట్జ్‌ల తోపాటు 26 గిగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ రేడియో తరంగాలను అమ్మకానికి పెట్టింది. ఈసారి వేలానికి టెల్కోల నుంచి పెద్దగా స్పందన ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు ముందుగానే అంచనా వేశాయి. ఆ అంచనాలకు తగినట్లుగానే కంపెనీలు అతి స్వల్ప వనరుల కొనుగోలుతో సరిపెట్టాయి. ఎందుకంటే, ప్రస్తుతం కంపెనీలు గతంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్ రెన్యువల్, 5జీ కవరేజీ విస్తరణ, స్పీడ్ పెంపుపై ప్రధానంగా దృష్టి సారించాయి. అందుకే ఈసారి అత్యంత వేగంతో సేవలందించగలిగే బ్యాండ్‌విడ్త్ స్పెక్ట్రమ్ కోసం మాత్రమే కంపెనీ లు బిడ్ వేసినట్లు తెలిసింది. వేలం తొలి రోజున (మంగళవారం) 5 రౌండ్ల బిడ్డింగ్ జరగగా.. బుధవారం మరో రెండు రౌండ్ల బిడ్డింగ్ జరిగింది. దాంతో ఉదయం 11.30 గంటలకే వేలం ప్రక్రియ ముగిసింది. టెలికాం శాఖ విడుదల చేసిన మంగళవారం బిడ్డింగ్ నివేదిక ప్రకారం.. కంపెనీలు ప్రధానంగా 900, 1800 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ స్పెక్ట్రమ్ కోసమే పోటీపడ్డాయి. ఓ కంపెనీ మూడు సర్కిళ్లలో 2100 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ తరంగాల కోసమూ బిడ్ వేసినట్లు తెలిసింది.

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,000 ▼ | 66,000 ▼ | 94,500 ▼ |
| ముంబై | 71,270 ▼ | 65,280 ▼ | 86,940 ▼ |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 515 | విజయవాడ | 515 |
| వరంగల్ | 517 | గోదావరి | 515 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 525 |
| | | డజను గుడ్లు రూ. | 72 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 110 | విజయవాడ | 123 |
| వరంగల్ | 110 | గుంటూరు | 123 |
| కరీంనగర్ | 110 | ఒంగోలు | 123 |
| మహబూబ్‌నగర్ | 110 | చిత్తూరు | 131 |
| కర్నూలు | 110 | నెల్లూరు | 131 |
| విశాఖపట్నం | 129 | అనంతపురం | 123 |
| గోదావరి | 123 | | |

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

నేటి నుంచి విధుల్లోకి..



మీడియా సమావేశంలో మంత్రి దామోదర, జూడాలు

మంత్రి సమక్షంలో జూడాల ప్రకటన.. వారి సమస్యలను పరిష్కరించాం

రెండ్రోజుల్లో రూ.610 కోట్లు విడుదల చేశాం.. ఉస్మానియా కొత్త భవనాన్నీ నిర్మిస్తాం 12


ఫుడ్, డ్రగ్స్ ల్యాబ్‌లను బలోపేతం చేస్తాం.. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

గురువారం | 27-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 89 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, తిథి: షష్ఠి సా. 6.40 తదుపరి సప్తమి; నక్షత్రం: శతభిషం ఉ. 11.37 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా. 5.38-7.08, దుర్ముహూర్తం: ఉ. 10.07-11.00, మ. 3.20-4.12; అమృతఘడియలు: శేషం ఉ. 6.12 వరకు, రా. 2.39-4.09, రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





లోక్‌సభ

# స్పీకర్ ఓం బిర్లా

## వరుసగా రెండోసారి సభాధ్యక్ష పదవి

మూజువాణి ఓటుతో విజయం

మీ చిరునవ్వుతో లోక్‌సభలో ఆనందం వెల్లివిరుస్తుంది

చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహిస్తున్నారు

ఓం బిర్లాపై ప్రధాని మోదీ ప్రశంసలు

విపక్షాలకూ అవకాశమివ్వండి

ఓం బిర్లాను కోరిన రాహుల్ గాంధీ

సస్పెన్షన్ల పర్వం కూడదన్న విపక్షాలు

మోదీ, రాహుల్ పరస్పర కరచాలనం

**తొలిరోజే సభలో గందరగోళం**

ఎమర్జెన్సీ, ఇందిరపై స్పీకర్ విమర్శలు

కాంగ్రెస్, విపక్ష నేతల నిరసన


సభ వెలుపల ఎన్డీయే ఆందోళనలు



ఎన్నిక అనంతరం ఓంబిర్లాను స్పీకర్ కుర్చీ వద్దకు తీసుకెళ్తున్న సందర్భంగా మోదీ-రాహుల్ కరచాలనం

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదో లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. 48 ఏళ్ల తర్వాత మళ్లీ లోక్‌సభ సభాధ్యక్ష పదవికి ఎన్నిక జరగ్గా.. ఓం బిర్లా మూజువాణి ఓటుతో విజయం సాధించారు. దీంతో వరుసగా రెండోసారి సభాధ్యక్షుడిగా ఎన్నికైన ఐదో స్పీకర్‌గా ఓం బిర్లా గుర్తింపు పొందారు. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమయ్యాక.. ఓంబిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని మోదీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎన్డీయే ఎంపీలు ఈ తీర్మానాన్ని బలపరిచారు. ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును ప్రతిపాదిస్తూ శివసేన(ఉద్ధవ్ వర్గం) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానాన్ని తీసుకురాగా విపక్ష కూటమి ఎంపీలు బలపరిచారు. అనంతరం మూజువాణి ఓటుతో ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రకటించారు. ఆ వెంటనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లేచి.. ఓం బిర్లా వద్దకు వెళ్లి, ఆయనకు అభినందనలు

మిగతా 2వ పేజీలో...



ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

# ఆషాఢంలోపే విస్తరణ!

**మంత్రివర్గంలో మరో నలుగురికి చాన్స్**

రేసులో సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు

ఢిల్లీలో పార్టీ పెద్దలతో సీఎం రేవంత్ చర్చలు

రెండు మూడు బెర్తులు పెండింగ్‌లోనే!

విస్తరణ తర్వాత పీసీసీ చీఫ్, నామినేటెడ్ పోస్టులు

పీసీసీ అధ్యక్ష పదవికి నలుగురు నేతల పోటీ

ఇప్పటికే రాజధాని చేరుకున్న ఆశావహులు

**కేంద్రం-రాష్ట్రం మధ్య వారధిగా ఉంటా**

తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో పదవీ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో చర్చలు జరిపినట్లు సమాచారం. జూలై తొలి వారంలోనే రేవంత్ తన మంత్రివర్గాన్ని విస్తరించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రేవంత్ ఢిల్లీలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరిపారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపిన రేవంత్‌రెడ్డి.. బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తొలుత మంత్రివర్గ విస్తరణ, తర్వాత పీసీసీ అధ్యక్షుడి నియామకం చేపట్టాలని

మిగతా 12వ పేజీలో...

### ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణభాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించండి 11

దానికి ఈ ఏడాది ప్రణాళికలో నిధులు మంజూరు చేయండి

హైదరాబాద్-విజయవాడ హైవేను 6 లేన్లుగా విస్తరించండి

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

### రోడ్లు బాగా లేకపోతే టోల్ వద్దు

గుంతల రోడ్లకు వసూలు చేస్తే ప్రజా వ్యతిరేకత

కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ వ్యాఖ్యలు 2



### మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

ఢిల్లీలో వేణుగోపాల్, దీపాదాస్‌తో భేటీ

ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యతన్న ఎమ్మెల్సీ

పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ 7

### కల్యాణ లక్ష్మి చెక్కులకు ఆగస్టు వరకు గడువు

ఈలోపే లబ్ధిదారులకు అందిస్తాం 11

హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం



కేజ్రీవాల్‌ను తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

### సీబీఐ కస్టడీకి కేజ్రీవాల్

3 రోజులకు అనుమతించిన ప్రత్యేకకోర్టు

మద్యం కేసులో ఆయనది కీలకపాత్ర

తప్పంతా సిసోడియాదేనంటున్నారు

సీబీఐ న్యాయవాది వాదనలు

ఇదంతా మీడియా వేదికగా సీబీఐ కుట్ర

సిసోడియా తప్పు చేశారని ఎన్నడూ అనలేదు: కేజ్రీవాల్ 2

# కదలరు.. మెదలరు

## సగం మంది భారతీయులు వ్యాయామం చేయట్లే..

శారీరక శ్రమ లేని వారు 49.4%

పురుషుల కంటే మహిళలే ఎక్కువ!

ఇలాగైతే దేశంలో 2030 నాటికి 60% మంది శారీరక నిర్బలురవుతారు

దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతారు

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

'లాన్సెట్ గ్లోబల్ హెల్త్'లో వ్యాసం



న్యూఢిల్లీ, జూన్ 26: భారత్‌లో 18 ఏళ్లకు పైబడినవారిలో దాదాపు సగం మంది అవసరమైన మేరకు శారీరక శ్రమ చేయడం లేదట! నడక, వ్యాయామం లాంటివేమీ చేయరట! దేశంలో ఇలా శరీరానికి పెద్దగా పని చెప్పని వారి సంఖ్య భారీగా పెరిగిపోయిందట! 2000 సంవత్సరంలో ఇలాంటి వారి సంఖ్య 22.3 శాతం ఉండగా.. 2022 నాటికి 49.4 శాతానికి పెరిగిపోయింది! ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం 'లాన్సెట్ గ్లోబల్ హెల్త్'లో ప్రచురితమైంది. కనీస వ్యాయామం చేయని వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండడం మరో విశేషం. డబ్ల్యూహెచ్‌వో అధ్యయనం ప్రకారం.. 2022 నాటికి శరీరానికి అవసరమైనంతగా వ్యాయామం చేయని పురుషులు 42 శాతం ఉంటే మహిళలు ఏకంగా 57.2 శాతం ఉన్నారు. ఇది ఇలాగే కొనసాగితే 2030 నాటికి దేశంలో 18 ఏళ్లకు పైబడినవారిలో 60 శాతానికి పైగా శారీరకంగా నిర్బలురయ్యే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె జబ్బులు, టైప్2 మధుమేహం, మతిమరుపు, క్యాన్సర్ల వంటి వ్యాధుల బారిన పడే ముప్పు ఉందని తెలిపింది. పెద్దలు వారానికి కనీసం 150 నుంచి 300 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. కఠినమైన వ్యాయామం అయితే వారానికి 75 నుంచి 150 నిమిషాలు చేయాలని పేర్కొంది. ఇక ప్రపంచంలోని 195 దేశాల్లో సరిపడినంత వ్యాయామం చేయని దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో

మిగతా 2వ పేజీలో...



ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

# 6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

పరేషాన్ కావద్దు: పార్టీ నాయకులతో కేసీఆర్

అధినేతను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పార్టీ మారతారన్న ఊహాగానాల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ

మరో నలుగురు నగర ఎమ్మెల్యేలతో కూడా..

ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ మంతనాలు

**మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?**

కమలం గూటికి పటాన్‌చెరు ఎమ్మెల్యే!

ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్‌ఎస్ నేత

ఢిల్లీకి రహస్య టూర్.. బీబీ పాటిల్‌తో భేటీ

ఎమ్మెల్యే వెంట సంగారెడ్డి బీజేపీ నేతలు

హైదరాబాద్/మర్కుక్/ఉప్పల్, జూన్ 26: 'ఆరు నెలల్లో అన్నీ తారుమారవుతాయి.. పరేషాన్ కావద్దు' అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీ నాయకులతో అన్నారు. ఎవరికీ ఎప్పుడూ ఏదీ తక్కువ చేయలేదని, అయినా కొందరు పార్టీ మారడం బాధాకరమన్నారు. అధికార దాహంతో, స్వార్థంతో పార్టీ వీడుతున్న నాయకులపై సుప్రీంకోర్టుకు వెళ్దామని పేర్కొన్నారు. బుధవారం పార్టీ ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజి గిరి), కాలేరు వెంకటేశ్ (అంబర్‌పేట), దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (ఎల్బీ నగర్), చామకూర మల్లారెడ్డి (మేడ్చల్) కేసీఆర్‌ను కలిశారు. పలువురు నగర ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతారన్న ఊహాగానాల నేపథ్యంలో ఈ ఐదుగురూ కేసీఆర్‌ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా బండారి లక్ష్మారెడ్డి పార్టీ మారతారని నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులే చర్చించుకోవడం, చేరడం ఖాయమైందని.. ముహూర్తం కోసం

మిగతా 7వ పేజీలో...

### ఎట్టకేలకు పిన్నెల్లి అరెస్టు

ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసుల్లో నరసరావుపేటలో అరెస్టు చేసిన పోలీసులు

'బెయిల్' పిటిషన్ కోర్టు కొట్టేసిన వెంటనే రంగంలోకి..

ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎస్పీ ఆఫీసుకు తరలింపు.. 14 కేసుల నమోదు 3

**ట్యాపింగ్ కేసులో ముగిసిన బెయిల్ పిటిషన్ వాదనలు**

తీర్పు నేటికి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు



నిజామాబాద్ జిల్లా ఎల్లమ్మకుంట గ్రామ సమీపంలో బోల్తా పడ్డ కారు

### చిరుతను తప్పించబోయి..

కారు బోల్తా పడి భార్య మృతి.. భర్తకు తీవ్రగాయాలు

నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో దుర్ఘటన 12

### మహిళలకు రుణ బీమా!

స్వయం సహాయక సంఘాలకు మాత్రమే

ప్రస్తుతం.. సంఘంలో మహిళ మరణిస్తే రుణం చెల్లింపు బాధ్యత కుటుంబానిది లేదా గ్రూపుది

ఇకపై బీమా కంపెనీది.. అదనంగా కుటుంబానికి సొమ్ము

త్వరలోనే బీమా కంపెనీతో సర్కారు ఒప్పందం 11

**ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థల్లో..**

**దివ్యాంగులకు 5% రిజర్వేషన్లు**

## ఒవైసీని ఎంపీ పదవి నుంచి తొలగించండి

» రాష్ట్రపతి ముర్ముకు అడ్వొకేట్ హరిశంకర్ లేఖ

న్యూఢిల్లీ, జూన్ 26: మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ లోక్‌సభ సభ్యుడిగా కొన సాగడానికి అనర్హుడని, ఆయన్ను వెంటనే ఎంపీ పదవి నుంచి తొలగించాలని ప్రముఖ అడ్వొకేట్ హరిశంకర్ జైన్ రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ లేఖ రాశారు. ఒవైసీ మంగళవారం ఎంపీగా ప్రమాణం చేసే సమయంలో 'జై పాలస్తీనా' అని నినదించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఎవరైనా ఎంపీ పరదేశం పట్ల విధేయత ప్రకటిస్తే వారు ఆ పదవిలో కొనసాగటానికి అనర్హులని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 దీన్నే నిర్దేశిస్తోందని పేర్కొన్నారు. ఒవైసీ అలా నినాదాలు చేయడం దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని జైన్ కోరారు. ఎంపీని తొలగించే అధికారం రాజ్యాంగం రాష్ట్రపతికి ఇచ్చిందని తెలిపారు. కాగా, ఒవైసీ ప్రమాణ స్వీకారం సందర్భంగా లోక్‌సభ హాలులో "జై భీమ్, జై ఎంఐఎం, జై తెలంగాణ, జై పాలస్తీనా" అని నినాదాలు చేశారు.

## 2న విచారణకు రాహుల్ రావాలి: యూపీ కోర్టు

సుల్తాన్‌పూర్ (యూపీ), జూన్ 26: పరువు నష్టం దావాలో వచ్చే నెల రెండో తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని స్థానిక ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ఆదేశించింది. కేంద్ర మంత్రి అమిత్ షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్ర 2018లో ఈ దావా వేశారు. బుధవారం ఈ కేసు విచారణకు రాగా ఇందులో తనను పార్టీగా చేర్చుకోవాలంటూ రామ్ ప్రతాప్ అనే వ్యక్తి కోర్టును అభ్యర్థించారు. ఇందుకు ఫిర్యాదుదారు తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ఆయన బాధితుడు కాడని, ఈ కేసులో ఆయనకు సంబంధమేమీ లేదని చెప్పారు. రాహుల్ తరపు న్యాయవాది కూడా అభ్యంతరం చెప్పారు. వాదనలు విన్న జడ్జి రామ్ ప్రతాప్ పిటిషన్‌ను తిరస్కరించారు. రాహుల్ మాత్రం విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఫిబ్రవరి 20న కూడా రాహుల్ కోర్టుకు వచ్చారు.

## జూలై 23 నుంచి అగ్నివీర్ నియామక ప్రక్రియ

న్యూఢిల్లీ, జూన్ 26: భారత సైన్యంలో కీలకమైన అగ్నివీర్ నియామకాలకు సంబంధించిన రెండో దశ ప్రక్రియ జూలై 23 నుంచి ప్రారంభంకానుందని రక్షణ శాఖ గువాహటి విభాగం పీఆర్‌వో ఓ ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ నియామకాలను రెండు దశల్లో చేపడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తొలిదశలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రెండో దశలో భౌతిక సామర్థ్యం సహా ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్-మే మధ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన తొలిదశలో అర్హులైన అభ్యర్థులకు వచ్చే నెల 23-27 మధ్య అసోంలోని మిలిటరీ స్టేషన్‌లో రెండోదశ నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. తొలిదశలో అర్హులైన అభ్యర్థుల అడ్మిట్ కార్డులను ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పీఆర్‌వో సూచించారు. రెండో దశ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందని, దళారులను ఆశ్రయించి మోస పోవద్దని అభ్యర్థులను కోరారు.

## కళాశాల ఆవరణలో హిజాబ్‌పై నిషేధం సబబే

ముంబయి, జూన్ 26: కళాశాల ఆవరణల్లో హిజాబ్ ధారణపై నిషేధం విధించడం సబబేనని బుధవారం బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. ఏకరూప వస్త్రధారణ దృష్ట్యా విద్యార్థులు హిజాబ్, బుర్ఖా, నకాబ్, టోపీలను ధరించకుండా నిషేధం విధించవచ్చని తెలిపింది. చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీ ముంబయిలో నిర్వహిస్తున్న ఎన్‌జీ ఆచార్య, డి.కె.మరాఠే కళాశాలల్లో హిజాబ్ ధారణను నిషేధిస్తూ యాజమాన్యం ఆదేశాలు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. కళాశాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయం తమ ప్రాథమిక, మతపరమైన హక్కులకు భంగకరమని, వ్యక్తిగత గోప్యతను హరించేదని పేర్కొన్నారు. కళాశాలల తరఫు న్యాయవాది ఈ వాదనలను ఖండించారు. కేవలం క్రమశిక్షణలో భాగంగా డ్రెస్ కోడ్‌ను నిర్ణయించారే తప్ప ఏ మతానికి వ్యతిరేకంగా కాదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం డ్రెస్ కోడ్ నిర్ణయాన్ని సమర్థించింది.

## కరాచీలో వేడిగాలులకు 450 మంది మృతి

కరాచీ, జూన్ 26: పాకిస్థాన్ ఆర్థిక రాజధాని కరాచీలో ఎండలు, వేడిగాలులు హడలెత్తిస్తున్నాయి. వేడి గాలుల దెబ్బకి నాలుగు రోజుల్లో కనీసం 450 మంది మరణించినట్లు అక్కడి ఎన్జీవో ఈదీ ఫౌండేషన్ బుధవారం తెలిపింది. కరాచీలో ఆదివారం నుంచి 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చనిపోయిన వారిలో ఎక్కువ మంది రోడ్లపై జీవిస్తూ డ్రగ్స్ వినియోగించేవారే ఉన్నట్లు ఈదీ ఫౌండేషన్ తెలిపింది. "నగరంలో రోడ్లపై విగత జీవులుగా పడిఉన్న వారిలో చాలా మంది మాదకద్రవ్యాలు వినియోగించేవారు, నిరాశ్రయులుగా గుర్తించాం. ఆసుపత్రుల్లోని మార్చురీల్లో మృతదేహాలు పేరుకుపోయాయి. మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది" అని పేర్కొంది. అయితే మృతదేహాలు తమవారివంటూ బంధువులెవరూ రాకపోవడం గమనార్హం.

## పఠాన్‌కోట్‌లో ఉగ్రవాదుల సంచారం.. హై అలెర్ట్

పఠాన్‌కోట్, జూన్ 26: భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలో భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు గుర్తించడంతో బుధవారం హైఅలెర్ట్ ప్రకటించారు. గ్రామాల్లో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సరిహద్దు రేంజి డీఐజీ రాకేశ్ కౌశల్ మాట్లాడుతూ.. గత రాత్రి ఇద్దరి అనుమానాస్పద కదలికలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు తెలిపారు. బీఎస్ఎఫ్, సైన్యం, ఎయిర్‌ఫోర్స్ ఇతర సెక్యూరిటీ ఏజెన్సీలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఇద్దరు సాయుధులు కోట్ భట్టియాన్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించామని పఠాన్‌కోట్ ఎస్ఎస్‌పీ సుహైల్ ఖాసిం మిర్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, జమ్మూ-కశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.

## సూరజ్ రేవణ్ణ కేసులో ట్విస్ట్.. శివకుమార్ యూటర్న్

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అసహజ లైంగిక దౌర్జన్యం ఆరోపణతో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ కేసులో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. నాలుగు రోజుల కిందట సూరజ్ బ్రిగేడ్ కోశాధికారినంటూ సూరజ్‌కు మద్దతుగా నిలిచిన శివకుమార్ తాజాగా యూటర్న్ తీసుకున్నారు. సూరజ్ రేవణ్ణ స్వలింగకాముకుడని, మూడేళ్ల కిందట తనపైనా అసహజ లైంగిక దౌర్జన్యం చేశారని ఆరోపించారు. సూరజ్‌పై ఇటీవల ఇదే తరహా ఆరోపణలు జేడీఎస్ కార్యకర్తకు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి చేశారని చెప్పారు. అందుకే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. ఇదిలా ఉండగా, సూరజ్‌పై ఫిర్యాదు చేసిన జేడీఎస్ కార్యకర్త.. మీడియాకు ఆయన గురించి మరిన్ని విషయాలు తెలిపారు. అమావాస్య రోజున సూరజ్‌రేవణ్ణ చేతులకు గాజులు ధరిస్తారని, చీర కడతారని వివరించారు. ఎన్నికల సందర్భంగా అరకలగూడులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న సూరజ్.. తన ఫోన్ నంబరు తీసుకొని తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని పేర్కొన్నారు. ఫాంహౌస్‌కు పిలిపించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడేవారని ఆరోపించారు. ఈ విషయం ఎక్కడా చెప్పరాదని రూ. 2 కోట్లతో పాటు పని ఇప్పిస్తానని ఆశ చూపారని అన్నారు. ఒప్పుకోనందుకు ప్రాణం తీస్తానని బెదిరించారని, ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

## కాంగ్రెస్ విదేశీ విభాగం అధిపతిగా మళ్లీ పిట్రోడా

న్యూఢిల్లీ, జూన్ 26: కాంగ్రెస్ పార్టీ విదేశీ విభాగం అయిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా ప్రముఖ సాంకేతిక నిపుణుడు శ్యాం పిట్రోడా మళ్లీ నియమితులయ్యారు. రాజకీయ వివాదం నేపథ్యంలో రెండు నెలల క్రితం ఆయన పదవుల నుంచి తప్పుకొన్నారు. తిరిగి ఆయనను చైర్మన్ పదవిలో నియమిస్తున్నట్టు బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. విదేశాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఈ సంస్థలో సభ్యులుగా ఉంటారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో వారసత్వ పన్నుపై పిట్రోడా చేసిన ఓ ప్రకటన రాజకీయంగా వివాదాస్పదం కావడంతో ఈ పదవికి రాజీనామా చేశారు. పిట్రోడా వ్యాఖ్యలను రాజకీయ ఆయుధంగా మార్చుకున్న ప్రధాని మోదీ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు లాక్కుంటారని విస్తృతంగా ప్రచారం చేశారు.

## ఆన్‌లైన్ గేమ్‌లో గొడవ..

## న్యూజెర్సీ నుంచి ఫ్లోరిడా వచ్చి సుత్తితో దాడి

ఫ్లోరిడా, జూన్ 26: ఆ ఇద్దరు యువకులూ 'ఆర్పీఏజీ' అనే ఆన్‌లైన్ ఫాంటసీ గేమ్ ఆడేవారు. ఒకరి పేరు కాంగ్.. ఉండేది న్యూజెర్సీ మరొకతను దిన్హ్.. వందల కిలోమీటర్ల దూరంలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఉంటాడు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిద్దరూ ఎప్పుడూ కలుసుకోలేదు. ఆన్‌లైన్ గేమ్‌లో గొడవపడి దిన్హ్‌పై కత్తికట్టాడు కాంగ్. అతడిని హతమార్చాలని న్యూజెర్సీలో విమానమెక్కి ఫ్లోరిడాలోని జాక్సన్‌విల్‌లో దిగాడు. అక్కడ నుంచి దిన్హ్ ఉండే ఫెర్నండినా బీచ్ నగరానికి చేరుకున్నాడు. హోటల్‌లో రూం తీసుకున్నాడు. సుత్తి, ఫ్లాష్‌లైట్ కొన్నాడు. నలుపు రంగు దుస్తులు, మాస్క్, గ్లవ్స్ ధరించి అర్ధరాత్రి దాటక దిన్హ్ ఇంట్లోకి చొరబడి అతనిపై సుత్తితో దాడి చేశాడు. దిన్హ్ అరుపులతో నిద్రలేచిన అతని తండ్రి పరుగున వచ్చి నిర్ఘాంతపోయాడు. రక్తమోడుతున్న దిన్హ్.. కాంగ్ నుంచి తప్పించుకునేందుకు పెనుగులాడుతున్నాడు. తండ్రి వెంటనే పోలీసులకు ఫోన్ చేసి.. కాంగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు కాంగ్‌ను అరెస్టు చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

# లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఓం బిర్లా వద్దకు వెళ్తుండగా.. మోదీ ఆయనను రమ్మంటూ ఆహ్వానించారు. వీరిద్దరూ కలిసి ఓం బిర్లాకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ కరచాలనం చేసుకున్నారు. ఆ తర్వాత పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు వీరిద్దరితో కలిసి ఓం బిర్లాను స్పీకర్ స్థానం వద్దకు తీసుకువెళ్లారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి లేచి నిలబడి.. ఆ స్థానంలో ఓం బిర్లాను కూర్చోవాలంటూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ సభలో సంప్రదాయాలు, విలువలను కాపాడతానన్నారు. రెండోసారి స్పీకర్‌గా అవకాశం కల్పించిన సభ్యులకు, ప్రధాని మోదీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజుకు ధన్యవాదాలు తెలిపారు. సభను అడ్డంకులు లేకుండా నడపాలన్నదే తన అభిమతమన్నారు. అధికార, విపక్షాలు కలిసికట్టుగా సభను నడపాలని ఆకాంక్షించారు. "నేనెప్పుడూ ఏ సభ్యుడికి వ్యతిరేకంగా ప్రవర్తించాలని కోరుకోను" అని స్పష్టం చేశారు. అనంతరం లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ నియామకాన్ని ఆమోదిస్తూ పార్లమెంట్ వ్యవహారాల శాఖ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. పార్లమెంట్ చట్టం-1977 ప్రకారం ఆయనకు అన్ని రకాల వసతులను కల్పించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

### ప్రధాని మోదీ ప్రశంసలు

ఓం బిర్లా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికవ్వడంతో ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. "మీ చిరునవ్వుతో సభలో ఆనందం వెల్లివిరుస్తుంది. మీ చిరునవ్వు సభను ఎల్లప్పుడూ సంతోషకర వాతావరణంలో ఉంచుతుంది. కొన్ని దశాబ్దాలుగా సభాపతిగా పనిచేసిన వారంతా ఎటువంటి పోటీని ఎదుర్కోలేదు. కానీ మీరు ఎన్నికల్లో గెలిచి, చరిత్ర సృష్టించారు. చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహిస్తున్నారు. స్పీకర్ పదవి ఎంత క్లిష్టమైనదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొత్తగా లోక్‌సభకు ఎన్నికైన వారికి మీ పనితీరు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. గడిచిన ఐదేళ్లలో స్పీకర్‌గా ఓం బిర్లా పనితీరు అద్భుతమంటూ ప్రధాని కొనియాడారు. "చరిత్రలో గుర్తుండిపోయే ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ మొదలు.. కొత్త నేర చట్టాల వరకు అనేక కీలక బిల్లులను ఆమోదించారు" అని మోదీ అన్నారు.


స్పీకర్ స్థానంలో ఓంబిర్లాకు మోదీ, రాహుల్, రిజిజు శుభాకాంక్షలు

### విపక్షాలకు అవకాశం ఇవ్వాలన్న రాహుల్

ప్రజావాణిని బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పీకర్‌ను కోరారు. ఓం బిర్లాకు ఇండియా కూటమి తరఫున శుభాకాంక్షలు చెప్పారు. లోక్‌సభ భారతదేశ ప్రజల స్వరాన్ని వినిపించాలని ఆకాంక్షించారు. "ప్రభుత్వానికి రాజకీయంగా బలం ఉండొచ్చు. విపక్షాలు ప్రజావాణికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సభ సజావుగా సాగడానికి ప్రతిపక్షం సహకరిస్తుంది. గతంతో పోలిస్తే.. ఈ సారి మంచి వాతావరణంలో సభ నడుస్తుందని ఆశిస్తున్నాను. సభను ఎంత సమర్థంగా నడుపుతున్నామనేది ముఖ్యం కాదు. ఈ సభలో దేశ ప్రజల స్వరాన్ని ఎంతవరకు వినిపించేందుకు అవకాశం ఇస్తున్నామనేది ముఖ్యం. ప్రజా సమస్యలను బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాను" అని రాహుల్ వ్యాఖ్యానించారు. సభను ఓం బిర్లా సజావుగా నడిపిస్తారనే నమ్మకముందని సమాజ్ వాదీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ అన్నారు. ప్రతి లోక్‌సభ సభ్యుడు, ప్రతి పార్టీని గౌరవిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల గొంతు నొక్కకుండా నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని, బహిష్కరణలు పునరావృతం కాకుండా చూస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

## నేడు రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ, జూన్ 26: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. గత సోమవారం లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గురువారం రాజ్యసభ 264వ సెషన్ ప్రారంభం కానుంది. గురువారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ముర్ము పార్లమెంట్‌కు చేరుకుంటారు. పార్లమెంట్ బిల్డింగ్ గజ ద్వారం వద్ద ఆమెకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు లోక్‌సభ, రాజ్యసభల ప్రిసైడింగ్ అధికారులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఆమెను సాంప్రదాయ రాజదండం 'సెంగోల్'తో లోక్‌సభ చాంబర్‌కు తీసుకువెళతారు. కాగా, జూలై 2-3 తేదీల్లో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడే అవకాశం ఉంది.

## తొలిరోజే సభలో గందరగోళం


న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ ఓం బిర్లా బుధవారం సభనుద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో ఎమర్జెన్సీ రోజులను గురించి ప్రస్తావించడంతో.. తొలిరోజే లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సభ తీర్మానమని చెబుతూ ఆయన ఎమర్జెన్సీని ఖండించారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నిర్ణయాన్ని రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. "దేశంలో ఎమర్జెన్సీ విధించి.. 50వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా ఆ చర్యను నేను ఖండిస్తున్నాను. 1975లో ఇదే రోజు(జూన్ 26) ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ రోజు దేశ చరిత్రలోనే ఓ చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది" అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారికి అభినందిస్తున్నానని, వారు తమ పోరాటంతో భారత రాజ్యాంగాన్ని కాపాడారని పేర్కొన్నారు. సభ్యులు


పార్లమెంటు వెలుపల ఎన్డీయే నేతల నిరసన

అంతా రెండు నిమిషాలు మౌనం పాటించాలని సూచిస్తూ.. సభను గురువారానికి వాయిదా వేశారు. కాగా.. స్పీకర్ ఎమర్జెన్సీ ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అప్పట్లో జరిగిన చీకటి అధ్యాయాన్ని ఎత్తి చూపడాన్ని అభినందిస్తూ.. నేటి యువత ఎమర్జెన్సీ రోజుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

### విపక్ష.. అధికార పక్ష నిరసనలు

స్పీకర్ ఓం బిర్లా ఎమర్జెన్సీపై మాట్లాడడాన్ని లోక్‌సభలో విపక్ష నేతలు ఖండించారు. తమతమ స్థానాల్లోంచి లేచి నిలబడి నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ మాట్లాడుతున్న సమయంలోనే అభ్యంతరం చెబుతూ నినదించారు. "నియంతృత్వాన్ని ఆపండి" అని నినాదాలిచ్చారు. సభ వాయిదా పడ్డాక.. కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీలు లోక్‌సభ వెలుపల ఆందోళన చేపట్టారు. "ఎమర్జెన్సీపై కాంగ్రెస్ సిగ్గుపడాలి".. "ఎమర్జెన్సీ విధించినందుకు క్షమాపణలు చెప్పాలి".. అని హిందీలో రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. "రాజ్యాంగ ప్రతులను చేతుల్లో పట్టుకున్న వాళ్లు అద్దంలో ఒకసారి చూసుకోవాలి. రాజ్యాంగాన్ని మార్చాలని చూసింది ఎవరో తెలుస్తుంది" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్రా వ్యాఖ్యానించారు.




## కదలరు.. మెదలరు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని తెలిపింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 31 శాతం అంటే సుమారు 180 కోట్ల మంది వైద్యుల సిఫారసు మేరకు వ్యాయామం చేయడం లేదని వివరించింది. శారీరక శ్రమ లేకపోవడం అనేది ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు పెనుముప్పు అని, ప్రజలు తీవ్రమైన జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ (హెల్త్ ప్రమోషన్) బ్రెచ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ కారణాల వల్ల శారీరక శ్రమ లేకపోవడం అనే సమస్య పెరుగుతోందన్నారు. శారీరక శ్రమ లేని వారిలో అంతర్జాతీయంగానూ పురుషుల (29%) కంటే మహిళలే (34%) ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

## రోడ్లు బాగా లేకపోతే టోల్ వసూలు చేయొద్దు

» కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 26: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏ మాత్రం బాగాలేని, అధ్వాన్నంగా ఉన్న హైవేలపై టోల్ సంస్థలు ఫీజు వసూలు చేయవద్దన్నారు. ఉపగ్రహ సమాచారం ఆధారంగా టోల్ ఫీజును లెక్కించి వసూలు చేసే వ్యవస్థకు సంబంధించిన ఓ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు మంచి రోడ్లు వేయలేకపోతే టోల్ ఫీజును కూడా వసూలు చేయకండి. గుంతలు పడి, బురదతో కూడిన రోడ్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది" అని చెప్పారు. కాగా, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌తో టోల్ ఫీజు వసూలుకు ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 5వేల కిలోమీటర్లలో దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

## పేపర్ లీక్ చేస్తే రూ.కోటి జరిమానా

» రెండేళ్ల నుంచి యావజ్జీవం దాకా జైలు

» యూపీ సర్కార్ ఆర్డినెన్స్

లఖ్‌నవూ, ముంబై, జూన్ 26: పోటీ/ప్రవేశ పరీక్ష పేపర్ల లీకేజీలకు పాల్పడేవారికి యావజ్జీవ ఖైదు, రూ.కోటి ఫైన్ వంటి కఠిన శిక్షలు విధించేలా ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కారు ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. 'ఉత్తరప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్)' పేరిట జారీ చేసిన ఈ ఆర్డినెన్స్‌లో పేర్కొన్న నేరాలకు పాల్పడ్డవారికి బెయిల్ రావడం కూడా చాలా కష్టమే. కారాగారవాసం, జరిమానాలతోనే సరిపెట్టకుండా.. పేపర్ లీక్ కేసుల్లో భాగస్వాములైనవారి ఆస్తులను సైతం జప్తు చేసే ప్రొవిజన్‌నూ ఈ ఆర్డినెన్స్‌లో పొందుపరిచారు. పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయితే.. దానివల్ల పడే ఆర్థిక భారాన్ని దోషుల నుంచే వసూలు చేస్తామని యూపీ సర్కారు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పాలుపంచుకునే సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు లీకేజీలో భాగమైతే.. వాటిని శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. ఇక.. మహారాష్ట్రలో నీట్ లీక్ కేసులో అరెస్టయిన ఇద్దరు టీచర్లు.. ఈ పరీక్షలో అభ్యర్థులను పాస్ చేయించేందుకు ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షలు తీసుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది.

# సీబీఐ కస్టడీకి కేజ్రీవాల్

» 3 రోజులకు ప్రత్యేక కోర్టు అనుమతి

» దేశంలో ఎమర్జెన్సీ : సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను మూడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు, తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను కేసు విచారిస్తున్న ప్రత్యేకకోర్టు ఎదుట హాజరుపర్చినప్పుడు.. న్యాయాధికారి అమితాబ్ రావత్ అనుమతి మేరకు సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. మద్యం కుంభకోణంలో ప్రశ్నించటానికి వీలుగా కేజ్రీవాల్‌ను తమకు అయిదు రోజుల కస్టడీకి అప్పగించాలని సీబీఐ విజ్ఞప్తి చేసింది. దీనిపై తొలుత తీర్పును రిజర్వు చేసిన అమితాబ్ రావత్.. మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయాన్ని వెలువరించారు. తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేశారు. కాగా, కోర్టులో విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తన వాదనలను స్వయంగా వినిపించారు. 'మొత్తం తప్పంతా మనీష్ సిసోడియాదేనని నేను ఒక ప్రకటన చేశానంటూ సీబీఐ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. నేను అటువంటి ప్రకటన ఎన్నడూ చేయలేదు. సిసోడియా,


బుధవారం రౌజ్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్

ఆమ్‌ఆద్మీపార్టీ, నేను నిర్దోషులం. ఇదంతా మా ప్రతిష్ఠను దెబ్బతీయటానికి మీడియా వేదికగా సీబీఐ చేస్తున్న కుట్ర' అని తెలిపారు. దీనికి సీబీఐ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. తాము వాస్తవాల ఆధారంగానే వాదనలు వినిపిస్తున్నామని, మీడియాతో సీబీఐ వర్గాలు ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. 'ఈ కేసులో సహనిందితుడైన విజయ్ నాయర్ తన కింద పని చేశాడన్న సంగతిని కూడా కేజ్రీవాల్ అంగీకరించటం లేదు. అతిషీ మర్లేనా, సౌరభ్ భరద్వాజ్‌ల కింద నాయర్ పని చేశాడని చెబుతున్నారు. మొత్తం తప్పంతా మనీశ్ సిసోడియాదేనని అంటున్నారు. అందువల్ల, కేసుకు సంబంధించిన పత్రాలను ఆయన ముందుపెట్టి ప్రశ్నించాల్సి ఉంది. ఈ మేరకు సీబీఐ కస్టడీకి అప్పగించాలి' అని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, కేజ్రీవాల్ తరఫు న్యాయవాది సీబీఐ అభియోగాలను తప్పుబడుతూ, వారి రిమాండ్ అప్లికేషన్ పూర్తి అస్పష్టంగా ఉందని, ఇది అధికార దుర్వినియోగానికి ఒక మచ్చుతునక అని పేర్కొన్నారు.

### సుప్రీంకోర్టు నుంచి పిటిషన్ ఉపసంహరణ

మద్యం కేసులో విచారణ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించటాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ కొనసాగించినప్పుడు.. ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవటానికి కేజ్రీవాల్ అనుమతి కోరారు. బెయిల్‌పై స్టే విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు ఇవ్వటం, మరోవైపు, ఇదే కేసులో సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయటం వంటి తాజా పరిణామాల దృష్ట్యా.. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని, పూర్తి వివరాలతో తర్వాత అప్పీల్ దాఖలు చేస్తామని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి తెలిపారు. దీనికి న్యాయమూర్తులు అంగీకరించారు. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. జైలు నుంచి తన భర్త బయటకు రాకుండా వ్యవస్థలన్నీ కట్టగట్టుకొని పని చేస్తున్నాయని, దేశంలో చట్టబద్ధపాలన లేదని, నియంతృత్వం, ఎమర్జెన్సీ నడుస్తోందని కేజ్రీవాల్ భార్య సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

# వికీలీక్స్ అసాంజేకు విముక్తి

» విడుదల చేసిన అమెరికా కోర్టు

కాన్‌బెర్రా, జూన్ 26: రహస్యాల వెల్లడి కేసులో అరెస్టయిన వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే (52)కు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఆయనను విడిచిపెట్టాలని అమెరికా కోర్టు ఒకటి ఆదేశించడంతో బుధవారం స్వదేశమైన ఆస్ట్రేలియాకు చేరుకున్నారు. అమెరికా న్యాయశాఖతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఆయన కేసు నుంచి బయటపడ్డారు. అమెరికా ప్రధాన భూభాగంలోని కోర్టుల్లో విచారణ జరిగేందుకు ఆయన ఇష్టపడకపోవడంతో అమెరికా కామన్‌వెల్త్ ప్రాంతమైన నార్తరన్ మారియానా ద్వీపంలోని సైపాన్‌లో ఉన్న యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో విచారణ జరిగింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న ఈ దీవి ఆస్ట్రేలియాకు సమీపంలో ఉండడం గమనార్హం. అమెరికా రక్షణ శాఖకు చెందిన రహస్య పత్రాలను బహిర్గతం చేశారన్న ఆరోపణలు అసాంజేపై ఉన్నాయి. 2006లో స్థాపించిన వికీలీక్స్ సంస్థ ద్వారా వీటిని బహిర్గతం చేశారు. ఇరాక్, అఫ్గానిస్థాన్‌ల్లో అమెరికా సైన్యం చేసిన అక్రమాలతోపాటు వివిధ అంశాలపై ఆయన దాదాపు కోటి పత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఈ పత్రాల కారణంగానే అమెరికా మిలటరీ అకృత్యాలు ప్రపంచానికి తెలిశాయి. అసాంజే చర్యలను పత్రికా స్వేచ్ఛను ఆకాంక్షించే వారు స్వాగతించినా అమెరికా ప్రభుత్వం మాత్రం తీవ్రంగా పరిగణించింది. దాంతో అమెరికా నుంచి లండన్‌కు పరారై అక్కడి ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో తలదాచుకున్నారు. చివరకు అయిదేళ్ల పాటు లండన్ జైలులో శిక్షను


కాన్‌బెర్రాలో అసాంజే

అనుభవించారు. గత వారం రహస్య విచారణ జరిపిన అక్కడి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాంతో సోమవారం ఆయన లండన్ జైలు నుంచి విడుదలయ్యారు. లండన్ నుంచి వచ్చిన తరువాత అమెరికా కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశాన్ని పొందారు. అమెరికా న్యాయవిభాగంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అసాంజే.. కోర్టులో తన నేరాన్ని అంగీకరించారు. గూఢచర్య చట్టానికి విరుద్ధంగా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, ప్రచురించడం వంటి నేరాలకు పాల్పడినట్టు ప్రకటించారు. సుమారు మూడు గంటల పాటు వాదనలు విన్న జడ్జి రమోనా విమంగ్లోనా ఈ నేర అంగీకారాన్ని ఆమోదించారు. లండన్ జైలులో గడిపిన కాలాన్ని శిక్షగా పరిగణిస్తూ ఆయనను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంకా అదనపు శిక్ష అవసరం లేదని తెలిపారు. అనంతరం అసాంజే ప్రత్యేక విమానంలో అమెరికా, బ్రిటన్‌ల్లోని ఆస్ట్రేలియా రాయబారులతో కలిసి కాన్‌బెర్రా చేరుకున్నారు.

# ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ కాంట్రాక్టర్లు!

» కీలక నిర్ణయం దిశగా బైడెన్ ప్రభుత్వం

వాషింగ్టన్, జూన్ 26: రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు సాయం చేసే విషయంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకోబోతుంది. రష్యా భూభాగంలో తమ ఆయుధాలతో దాడి చేసేందుకు మే నెలలో ఉక్రెయిన్‌కు అనుమతినిచ్చిన అమెరికా.. ఇప్పుడు తమ దేశానికి చెందిన ఆయుధాల కాంట్రాక్టర్లను ఉక్రెయిన్‌కు పంపేందుకు సిద్ధమవుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనడంపై విధించుకున్న అప్రకటిత నిషేధం ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తోంది. నిజానికి, రష్యా-ఉక్రెయిన్ పోరుకు అమెరికా దళాలు, ప్రజలను దూరంగా ఉంచేందుకు జోబైడెన్ దాదాపు రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. అమెరికా నేరుగా యుద్ధంలో పాల్గొందనే భావన రష్యాకు కలగకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో ఉక్రెయిన్‌కు సరఫరా చేసిన ఆయుధాల మరమ్మతులు, నిర్వహణ పనులను అమెరికా స్వయంగా చేపట్టడం లేదు. ఆయా ఆయుధాలను నిర్వహణ పనుల కోసం పోలాండ్, రొమేనియా లేదా ఏదైనా నాటో సభ్య దేశానికి తరలిస్తున్నారు. ఈ విధానం వల్ల చాలా సమయం వృథా అవుతోంది. దీంతో యుద్ధభూమిలో రష్యా పైచేయి సాధిస్తుంది. ఈ నేపథ్యంలో అప్రకటిత నిషేధం ఎత్తివేత ప్రతిపాదనపై అమెరికా అధికార వర్గాల్లో చాలా కాలంగా చర్చ జరుగుతోంది. దీనికి ఈ ఏడాదే బైడెన్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అదే జరిగితే అమెరికాకు చెందిన ఆయుధాల కాంట్రాక్టర్లు స్వయంగా ఉక్రెయిన్ వెళ్లి పని చేయనున్నారు. ఫలితంగా ఆయుధాల మరమ్మతు, నిర్వహణ పనులు వేగవంతం కానున్నాయి. పైగా, అమెరికా త్వరలో ఉక్రెయిన్‌కు ఎఫ్-16 ఫైటర్ జెట్లు ఇవ్వనుంది. ఈ నిషేధం ఎత్తివేత ఎఫ్-16ల నిర్వహణకు కూడా ఉపకరిస్తుందని అమెరికా వర్గాలు పేర్కొంటున్నాయి.

## పంజాబ్ వలస కూలీ దుర్మరణం.. ఇటలీలో నిరసనలు

రోమ్, జూన్ 26: పంజాబ్‌కు చెందిన ఓ కూలీ మరణం ఇటలీ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు కారణమైంది. ఈ ఘటనపై ఇటలీ ప్రధాని మెలోనీ కూడా స్పందించారు. బాధ్యులను కఠినంగా శిక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పంజాబ్‌లోని చాంద్ నవాన్ గ్రామానికి చెందిన సత్నామ్ సింగ్(31) దంపతులు ఇటలీ వెళ్లి అక్కడ ఓ యజమాని దగ్గర వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వ్యవసాయ పనులు చేస్తుండగానే ప్రమాదం జరిగి సత్నామ్ కుడి చేయి పూర్తిగా దెబ్బ



తిన్నది. ఇది గమనించిన యజమాని రెంజో లెవాటో సత్నామ్‌కు తీవ్ర రక్తస్రావం అవుతున్నా కూడా ఆస్పత్రికి తీసుకుపోకుండా తన ఇంటి బయట వదిలేశాడు. సత్నామ్ భార్య చుట్టుపక్కల వాళ్ల సాయంతో అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించింది. సత్నామ్ చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. ఈ నేపథ్యంలో ఇటలీలో కార్మికుల హక్కులు, వలస కార్మికుల భద్రతపై ప్రశ్నలు తలెత్తాయి. హక్కుల ఉద్యమకారులు నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో, మెలోనీ ఆ దేశ పార్లమెంటు వేదికగా స్పందించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# నన్ను కుప్పంలో 'లాక్' చేయాలని కుట్ర!

- ఓటుకు 5 వేలు పంచారు: చంద్రబాబు
- కుప్పంలో ముగిసిన రెండ్రోజుల పర్యటన


కుప్పంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మరెక్కడా నేను దృష్టి పెట్టకుండా కుప్పంలోనే నన్ను లాక్ చేసేందుకు కుట్ర పన్నారు. అందుకే ఇక్కడ ఓటుకు రూ.5 వేలు పంచారు. కొంతమంది టీడీపీ నాయకులను మభ్య పెట్టారు. అయినా పట్టించుకోకుండా రాష్ట్రమంతటా తిరిగాను. అందుకే కుప్పంలో ఆశించిన మెజారిటీ రాలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సొంత నియోజకవర్గం కుప్పంలో ఆయన రెండ్రోజుల పర్యటన బుధవారం ముగిసింది. ఉదయం అర్అండ్‌బీ అతిథిగృహంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. తర్వాత నియోజకవర్గంలోని అధికారులతో, టీడీపీ శ్రేణులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుడతాను. సింపుల్ గవర్నమెంట్.. సమర్థ ప్రభుత్వం (ఎఫెక్టివ్ గవర్నెన్స్) నా విధానం. దీనికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి. గత ప్రభుత్వ పాలనకు, ఇప్పటికి చాలా వ్యత్యాసం ఉంటుంది. అధికారులు ఫిజికల్‌గా, వర్చువల్‌గా పనిచేసేందుకు సిద్ధపడండి. బలవంతపు జనసమీకరణతో పెద్ద సమావేశాలు, భారీ కాన్వాయ్ హంగామా ఈ ప్రభుత్వంలో ఉండవు. సాయంత్రం 6 తర్వాత సమావేశాలు వద్దని మంత్రులకు చెప్పాను. కుప్పం సమగ్ర అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి. ఇక్కడ రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు కనిపించకూడదు. రాజకీయ ప్రోద్బలంతో గత ప్రభుత్వ హయాంలో పెట్టిన కేసులను ఎత్తేయండి. గత ఐదేళ్లలో కొందరు అధికారులు మనసు చంపుకొని పనిచేశారు. మరి కొందరు వైసీపీ నేతలకు సహకరించారు. నా సొంత నియోజకవర్గానికి రాకుండా నన్ను అడ్డుకున్నారు. నాపైనా హత్యాయత్నం కేసు పెట్టారు' అని గుర్తుచేశారు.

## జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా చాన్సే లేదు

- ఆ హోదా రావడానికి ఓ పదేళ్లు పడుతుంది
- ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ప్రతిపక్ష హోదా లేదు. అందుకే జగన్ ప్రతిపక్ష నేత కాదు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ఫ్లోర్ లీడర్ మాత్రమే' అని ఏపీ ఆర్థిక, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుత నిబంధనల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అవకాశం లేదు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా రావడానికి పదేళ్లు పట్టింది. ఆ హోదా రావడానికి జగన్‌కూ ఓ పదేళ్లు పడుతుంది. జగన్‌కు ఆప్తుడైన కేసీఆర్ కూడా 2019లో తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. స్పీకర్‌కు లేఖ రాసిన జగన్ బెదిరించే ప్రయత్నం చేశారు. లేఖ రాసింది మీరే అయితే మీ వైఖరి మార్చుకోండి.. దాన్ని రాసింది సలహాదారులైతే వారిని మార్చుకోండి' అని పయ్యావుల సూచించారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేని స్థితిలో జగన్ ఉన్నారనే విషయం స్పీకర్‌కు ఆయన రాసిన లేఖను బట్టి అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష నేత కావడం తన హక్కు అనే తరహాలో లేఖ రాయడమేంటని మంత్రి నిలదీశారు. 'గతంలో చంద్రబాబును సభలో ఎంత హేళన చేశారో వీడియో తెప్పించుకుని చూడండి. మొన్నటి వరకూ ప్రభుత్వంలో ఉన్నప్పుడు మేం చిటికేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదన్నారు. 10శాతం సభ్యులు కూడా లేకుండా ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని గత శాసనసభ సాక్షిగా జగన్ తన నోటితోనే చెప్పారు. ఇప్పుడు ఆ నిబంధనే లేదు తూచ్ అంటారా? ప్రజలు అధికారం తీసేసినా కొసరు అధికారం కోసం పాకులాడుతున్నారు. ప్రతిపక్ష హోదా కావాలి.. ప్రజా సమస్యల గురించి మాట్లాడతామని చెబుతున్నారు. ఇన్ని రోజులకు ప్రజా సమస్యలు గుర్తుకొచ్చాయా?' అని పయ్యావుల నిలదీశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన బెయిల్ పిటిషన్ వాదనలు

- తీర్పు నేటికి వాయిదా

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. తాము బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన సమయంలో చార్జిషీట్ కోర్టు పరిగణనలో లేనందున మ్యాండేటరీ బెయిల్ మంజూరు చేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. తాము నిబంధనల ప్రకారం 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేశామని, నిందితుల వాదనలు సరి కాదని, కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇరు పక్షాల వారు తమ వాదనలకు సంబంధించి గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుల్ని ఉదహరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు గురువారానికి వాయిదా వేశారు.

## సీనియర్ న్యాయవాదికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణకు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. జడ్జిలను మేనేజ్ చేసి అనుకూల తీర్పు ఇప్పిస్తానని తన వద్ద డబ్బులు వసూలు చేశారని డాక్టర్ చింతల యాదగిరి చేసిన ఫిర్యాదు మేరకు వెంకటరమణపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. తనవద్ద వెంకటరమణ, ఎంఐఎం ఎమ్మెల్యే మహమ్మద్ బిన్ అబ్దుల్ బలాల తదితరులు రూ.7 కోట్లు వసూలు చేశారని యాదగిరి ఫిర్యాదు చేశారు. 18 ఏళ్లుగా వివాదంలో ఉన్న బౌరంపేట భూమి కేసులో అనుకూల తీర్పు తెస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. ఈ కేసును కొట్టేయాలంటూ వెంకటరమణ క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు జరిపి, ఆరోపణలను నిగ్గుతేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. తుది రిపోర్ట్ దాఖలు చేసే వరకు పిటిషనర్‌ను అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. పిటిషనర్ దర్యాప్తునకు సహకరించకపోతే పోలీసులు తగిన చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

## 'సంహిత'లపై 1న బెంగాల్ లాయర్ల ఆందోళన

కోల్‌కతా, జూన్ 26: కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్న మూడు న్యాయ నేర చట్టాలు ప్రజా వ్యతిరేకం, అప్రజాస్వామికం, క్రూరమైనవని పశ్చిమ బెంగాల్ న్యాయవాదులు విమర్శించారు. కొత్తగా అమల్లోకి తీసుకురానున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలకు తమ వ్యతిరేకత తెలిపారు. వీటిని వ్యతిరేకిస్తూ బార్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇవి అమల్లోకి వచ్చే జూలై ఒకటో తేదీన కోర్టులను బహిష్కరించి 'బ్లాక్ డే' పాటించాలని నిర్ణయించారు.

## పుణె వైద్యునికి జికా వైరస్

- నిలకడగా ఆరోగ్యం

పుణె, జూన్ 26: స్థానిక ఎరండవానే ప్రాంతంలో నివసించే ఓ వైద్యునికి జికా వైరస్ సోకినట్టు బుధవారం అధికార వర్గాలు తెలిపాయి. 46 ఏళ్ల ఆ వైద్యునికి, 15 ఏళ్ల ఆయన కుమార్తెకు ఈ వైరస్ సోకినట్టు పేర్కొన్నాయి. వారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని స్పష్టం చేశాయి. జ్వరంతో పాటు శరీరంపై దద్దుర్లు రావడంతో ఆ వైద్యుడు ఆ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడి డాక్టర్లు రక్త నమూనాలు సేకరించి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. జికా వైరస్ సోకినట్టు ఈ నెల 21న రిపోర్టు వచ్చింది. దాంతో ఆ కుటుంబంలోని మొత్తం అయిదుగురు సభ్యుల రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. వారిలో ఆయన 15 ఏళ్ల కుమార్తెకు పాజిటివ్ లక్షణాలు కనిపించాయి. మిగిలిన వారికి వైరస్ సోకలేదు. దాంతో అప్రమత్తమైన పుణె మున్సిపల్ కార్పొరేషన్ వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో తనిఖీలు జరిపారు. ఇంకెక్కడా ఈ వైరస్ లక్షణాలు కనిపించలేదు. దోమల కారణంగా ఈ వైరస్ సోకనుండడంతో పారిశుధ్య, ఫాగింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. జికా వైరస్ ప్రాణాంతకమేమీ కాదు. గర్భిణులకు సోకితే మాత్రం పిండం ఎదుగుదలలో సమస్యలు ఏర్పడుతాయి. ఏడిస్ రకం దోమ కారణంగా ఈ వైరస్ సోకుతుంది. చికెన్ గున్యా, డెంగీ జ్వరాలకు కూడా ఈ దోమే కారణం కావడం గమనార్హం.

## మార్చినాటికి అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి

- ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ వెల్లడి

లఖ్‌నవూ/అయోధ్య, జూన్ 26: వచ్చే ఏడాది మార్చి నాటికి అయోధ్యలోని రామమందిరం నిర్మాణం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ ఏడాది జూలై చివరికల్లా ఆలయం మొదటి అంతస్తు, డిసెంబరు నాటికి రెండో అంతస్తు పూర్తి కానుందని చెప్పారు. ఈ ఏడాది జనవరి 22న రామ మందిరం ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు 1.75 కోట్లకు పైగా భక్తులు ఈ మందిరాన్ని సందర్శించారు. ఈ నెల చివరినాటికి ఈ సంఖ్య రెండు కోట్లకు చేరే అవకాశం ఉందని మిశ్రా తెలిపారు. సగటున ప్రతి రోజు లక్ష మంది భక్తులు ఆలయానికి వస్తున్నారని చెప్పారు. రామ కథ మ్యూజియం పని ప్రారంభిస్తున్నామన్నారు. కాగా అయోధ్యలో రామ మందిర మ్యూజియంను టాటా సన్స్ అభివృద్ధి చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఉత్తరప్రదేశ్ కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం టాటా సన్స్ రూ.750 కోట్లు వెచ్చించనుంది. ఇందులో రూ.650 కోట్లు మౌలిక సదుపాయాలు, డిజైన్, ఇంటీరియర్ పనుల కోసం, రూ.100 కోట్లు భవనం నిర్మించే ప్రదేశం అభివృద్ధి కోసం ఖర్చు చేయనున్నారు. ఆలయ మ్యూజియం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

## ఇల్లు కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటి గోడ కూలి మరో ఇంటిపై పడటంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల తాలూకా మున్నూరు గ్రామంలో భారీ వర్షాల కారణంగా అబూబకర్ అనే వ్యక్తి ఇంటి గోడ బుధవారం తెల్లవారుజామున కూలి పక్కింటి మీద పడింది. దీంతో ఆ ఇల్లు కూలి.. ఇంట్లో నిద్రిస్తున్న యాసిర్(45), ఆయన భార్య మరియమ్మ (40), కూతుళ్లు రిఫానా (17), రియానా (11) మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున ప్రజలు అక్కడికి చేరి శిథిలాలను తొలగించి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. అగ్నిమాపక శాఖ అధికారులు సిబ్బందితో వచ్చి రెండు గంటలు శ్రమించి మరొకరి మృతదేహాన్ని శిథిలాల నుంచి వెలికి తీశారు. మృతి చెందిన యాసిర్ మంగళూరు ఓడరేవులో మడ్డి ఆయిల్ విభాగంలో పనిచేసేవారు. మంగళవారం రాత్రి అందరూ కలిసి భోజనం చేసి నిద్రించారు. రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. పక్కింటి గోడతోపాటు రెండు వక్కచెట్లు యాసిర్ ఇంటిపై కూలాయి. దీంతో ఇల్లు కూలిపోయింది.

# పిన్నెల్లి ఎట్టకేలకు అరెస్టు

**ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసుల్లో నరసరావుపేటలో అరెస్టు చేసిన పోలీసులు**

- 'బెయిల్' పిటిషన్ కోర్టు కొట్టేసిన వెంటనే రంగంలోకి..
- ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు


నరసరావుపేటలో పిన్నెల్లిని అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

నరసరావుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో రాజకీయ అరాచకాలకు కేరాఫ్‌గా మారిన వైసీపీ మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆట ఎట్టకేలకు కట్టింది. ఈవీఎం ధ్వంసం, సీఐపై దాడి, టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యానికి పాల్పడిన కేసుల్లో నరసరావుపేటలో బుధవారం ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో ఆయన వేసిన పిటిషన్లు బుధవారం తిరస్కరణకు గురయ్యాయి. ఆ వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. మధ్యాహ్నం 3.47 గంటల సమయంలో పిన్నెల్లిని అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. అరెస్టు వార్తను ఎస్పీ మల్లికాగార్గ్ రాత్రి 7 గంటల సమయంలో ధ్రువీకరించారు. ఆయనను వైద్య పరీక్షల నిమిత్తం ఎస్పీ కార్యాలయం నుంచి నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి 8 గంటల సమయంలో తరలించారు. అనంతరం 9.13 గంటలకు ఆస్పత్రి నుంచి ఎస్పీ కార్యాలయానికి తిరిగి తీసుకొచ్చారు. మాచర్ల నియోజకవర్గంలో కేసులు నమోదు కావడంతో ఆయనను మాచర్ల కోర్టులో హాజరు పరచాలని పోలీసులు నిర్ణయించారు. రాత్రి 10 గంటల సమయంలో ఎస్పీ కార్యాలయం నుంచి పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి, అయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కలిసి ఈ ఏడాది మే 13వ తేదీన పోలింగ్ సందర్భంగా హింసకు పాల్పడ్డారు. రెంటచింతల మండలం పాల్వాయిగేటు గ్రామంలో 202 పోలింగ్ బూత్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎం, వీవీప్యాట్లను పిన్నెల్లి ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై మారణాయుధాలతో దాడి చేయించారు. ఈ ఘటనలో రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసిన ఘటనలో కూడా రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై జరిగిన దాడిలో రామకృష్ణారెడ్డిపై 307 కేసు నమోదైంది. ఇలా మొత్తం పిన్నెల్లిపై మాచర్ల నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

### సీసీటీవీ ఫుటేజీ బయటకు రాకపోతే..!

పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేస్తున్న సీసీ టీవీ ఫుటేజీ బయటకు వచ్చింది కాబట్టి పిన్నెల్లిపై పోలీసులు అరెస్టు చేయగలిగారు. ఈ దృశ్యాలు బయటకు రాకుంటే పిన్నెల్లి చేసిన సవాలక్ష పాపాల్లాగే ఈ నిజం కూడా సమాధి అయిపోయేదే. దీని తర్వాత పిన్నెల్లి అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగుచూశాయి. ఎన్నికలు జరిగిన మే 13వ తేదీన కేపీ గూడెం, రాయవరం పోలింగ్ బూత్‌లపై దాడులు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న టీడీపీ ఏజెంట్లపై హత్యాయత్నం చేశారు. టీడీపీ పోలింగ్ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై పిన్నెల్లి అనుచరులు హత్యాయత్నం చేశారు. పిన్నెల్లి నేతృత్వంలో వైసీపీ గూండాలు పోలింగ్ కేంద్రాన్ని ముట్టడించారు. దీనిపై టీడీపీ నేతలు... అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోలేదు. తమపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ వైసీపీ గూండాలు మరింతగా రెచ్చిపోయారు. బరిసెలతో మూకుమ్మడి దాడులు చేశారు. ఈ వీడియోలను టీడీపీ నేతలు బయటపెట్టడంతో రాష్ట్రమంతా విస్తుపోయింది.

## పిన్నెల్లికి హైకోర్టు షాక్

- ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, హత్యాయత్నం తదితర తీవ్ర నేరాభియోగాలతో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్‌కు ఆయన దాఖలుచేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నారని, గత ఎన్నికల సందర్భంగా కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడ్డారంటూ విచారణలో పోలీసులు తెలిపిన వివరాలను కోర్టు గుర్తు చేసింది. నేరాలకు పాల్పడడం పిటిషనర్ అలవాటుగా మార్చుకున్నారని పోలీసులు చెబుతున్నారని పేర్కొంది. కేసుల దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ సమయంలో బెయిల్ మంజూరు చేస్తే నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపింది. మరోవైపు ఈవీఎం ధ్వంసం చేసిన వ్యవహారంలో పిటిషనర్ పై నమోదైన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న వైనందున తనను అరెస్ట్ చేయడానికి వీల్లేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది.

### వ్యవస్థలను బెదిరించేవారిని ఉపేక్షించబోం: ఈసీ

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్గించే ఎవరికైనా శిక్ష తప్పదని భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈవీఎంల ధ్వంసం, ఇతరనేరాలపై మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడం, వెంటనే పోలీసులు అరెస్టు చేయడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసీ ఈ వ్యాఖ్యలు చేసింది.

## ఎన్నికల గుర్తులపై ఈసీదే తుది నిర్ణయం

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల గుర్తులపై తుది నిర్ణయం ఎన్నికల కమిషన్‌దేనని, అందులో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. చపాతీ రోలర్ గుర్తును 'ఫ్రీ సింబల్స్' జాబితా నుంచి తొలగించడంపై అలయెన్స్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. ఈసీదే అంతిమ నిర్ణయమని హైకోర్టు స్పష్టం చేయడంతో ఏడీఆర్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.

## అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

చేగుంట, జూన్ 26 : పంటలపై ఎన్నో ఆశలతో అప్పులు తెచ్చి సాగు చేసిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన చింతల సత్తయ్య (52)కు రెండెకరాల భూమి ఉంది. పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఓ వైపు పంటల దిగుబడి సరిగా రాకపోవడం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ తరుణంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక జీవితంపై విరక్తితో బుధవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## నాకు పెళ్లి చేయండి..!

- 'రైతు' అయినందుకే పిల్ల దొరకడంలేదు
- అధికారికి కర్ణాటక ఓ యువరైతు వినతి

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేస్తున్న కారణంగా తనకు పెళ్లి కావడం లేదని, తన సమస్యను పరిష్కరించాలని కర్ణాటక రాష్ట్రం కొప్పళ జిల్లాకు చెందిన ఓ యువరైతు జిల్లా అధికారికి విన్నవించారు. కనకగిరి పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన జనస్పందన కార్యక్రమంలో సంగప్ప శిరహట్టి(30) ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. తాను రైతునని, అందుకే పెళ్లి చేసుకునేందుకు ఏ ఒక్క యువతీ ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు. ఇది తన ఒక్కడి సమస్య కాదని, ప్రతిచోటా తనలాంటి రైతులు ఉన్నారని వివరించారు. తనకు ఆరు ఎకరాల పొలం ఉందని, సొంతంగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నానని పేర్కొన్నారు. పెళ్లి చేసుకోవాలని ఎన్నో చోట్ల సంబంధాలు చూశానని, ఎక్కడా వధువు దొరకలేదని వాపోయారు. యువరైతుల కోసం వధూవరుల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్, పరిశీలిస్తామని తెలిపారు.

## టెర్రరిస్టు గోల్డీ బ్రార్ ఆచూకీ చెబితే రూ.10 లక్షలు

- ఎన్ఐఏ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 26: కెనడాలో ఉంటున్న తీవ్రవాది సత్వీందర్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ ఆచూకీ చెబితే రూ.10 లక్షలు బహుమతిగా ఇస్తామని బుధవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించింది. అతడి సహచరుడు గురుప్రీత్ సింగ్ అలియాస్ గోల్డీ రాజ్‌పురా ఆచూకీ చెబితే ఇంకో రూ.10 లక్షలు ఇస్తామని తెలిపింది. వివరాలు చెప్పిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని పేర్కొంది. డబ్బులు గుంజడం కోసం చండీగఢ్‌లో ఓ వ్యాపారి ఇంటిపై కాల్పులు జరిపిన ఘటనలో వారిద్దరు నిందితులుగా ఉన్నారు.



# మనమంతా ఒక్కటే!

- సమస్యలుంటే నాతో చెప్పండి
- లోక్‌సభలో చర్చల్లో పాల్గొనండి
- టీడీపీ ఎంపీలకు ప్రధాని సూచన


టీడీపీ ఎంపీలతో సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే సభ్యులమైన మనమందరం ఒకటేనని.. తనను కలవాలనుకుంటే ఎప్పుడైనా నిరభ్యంతరంగా కలవొచ్చని ప్రధాని మోదీ టీడీపీ ఎంపీలతో అన్నారు. అందరూ కలిసి వచ్చినా.. లేదంటే విడివిడిగా వచ్చినా పర్వాలేదన్నారు. బుధవారం లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనంతరం మధ్యాహ్నం టీడీపీ ఎంపీలు ప్రధానితో భేటీ అయ్యారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. రామ్మోహన్‌నాయుడు ఎంపీలను మోదీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని కుశల ప్రశ్నలు వేశారు. చాలా సరదాగా మాట్లాడారు. తనను కలిసేందుకు కుటుంబ సభ్యులతో రావచ్చొని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తనతో ఓపెన్‌గా చెప్పాలన్నారు. దేశ, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం పార్లమెంటు చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. ఎంపీలందరూ ఐక్యమత్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చారని తెలుసుకుని అభినందించారు. కుటుంబ నేపథ్యం గురించి ఆరాతీశారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రాతినిధ్యం వహించిన విజయనగరం నుంచి ఆయన ఎన్నికయ్యారని తెలుసుకుని.. అశోక్ ఆరోగ్యం గురించి రామ్మోహన్‌నాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానిని టీడీపీ ఎంపీలు సన్మానించారు. రామ్మోహన్ ఆయనకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడి విగ్రహాన్ని బహూకరించారు.

### బాబు నేతృత్వంలో 2 పార్టీలు కలిసి పనిచేస్తున్నాయ్

భారతదేశ పురోగతికి, ఏపీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రధాని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ, టీడీపీ కలిసి పనిచేస్తున్నాయని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు చంద్రబాబు ఎక్స్‌లో స్పందించారు. ఎన్డీయే ఎంపీలు లోక్‌సభలో వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ భారత్ కోసం కృషి చేస్తారన్నారు.

## జూలై 5న కోల్‌బెల్ట్ బంద్

- సింగరేణి పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటానికి సిద్ధం కావాలి: కూనంనేని

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలానికి నిరసనగా జూలై 5న కోల్‌బెల్ట్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. 15 రోజులపాటు సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, కలెక్టరేట్ల ముట్టడి చేపడతామని చెప్పారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న సింగరేణిలేని తెలంగాణను ఊహించుకోలేమన్నారు. బుధవారం మగ్దూంభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ఇచ్చిన మాటకు భిన్నంగా వ్యవహరించారని, కేంద్ర ప్రభుత్వానికి గనులు రాసిచ్చారని తెలిపారు. సింగరేణిని ప్రైవేటు పరం చేయబోమని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారన్నారు. బొగ్గు గనులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రధాని మోదీ కుట్రలో కిషన్‌రెడ్డి భాగస్వాములయ్యారని, ఆయన తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గతంలో ప్రైవేటు పరం చేసిన బొగ్గు గనుల లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున రాష్ట్ర ప్రభుత్వం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నేతలు

## నీట్ పరీక్ష, ఎన్‌టీఏను రద్దు చేయకుంటే భారత్ బంద్

- త్వరలో చలో రాజ్‌భవన్, ఇందిరా పార్కు వద్ద మహాదీక్ష : బల్మూరి

బర్కత్‌పుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష, ఎన్టీఏను రద్దు చేయకుంటే దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలతో భారత్ బంద్ నిర్వహిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నీట్‌లో అక్రమాలపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించాలని డిమాండ్ చేశారు. త్వరలో చలో రాజ్‌భవన్, ఇందిరాపార్కు వద్ద మహాదీక్ష చేపడతామన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ విద్యార్థి యువజన సంఘాలు బుధవారం నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశాయి. నేతలు ఆర్ఎల్ మూర్తి(ఎస్ఎఫ్ఐ), ఎ.వెంకటేష్ (డీవైఎఫ్ఐ), మహేష్(పీడీఎస్‌యూ), శ్రీకాంత్(ఏఐవైఎఫ్), కృష్ణ(పీవైఎల్)లతో కలిసి ఈ సందర్భంగా బల్మూరి మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## స్వేచ్ఛాజీవి అసాంజే

వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఇప్పుడు స్వేచ్ఛాజీవి. ప్రత్యేక విమానంలో బుధవారం స్వదేశం ఆస్ట్రేలియా చేరుకున్న ఆయన, విమానాశ్రయంలో భార్యనీ, తండ్రినీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు, ఎంతో ఉత్సాహంగా తనను పలుకరిస్తున్న మీడియాకు చేతులూపారు. పద్నాలుగేళ్ళ సుదీర్ఘ వివాదం నుంచి తనను బయటపడవేసి, సొంతింటికి చేర్చడంలో కీలకమైన పాత్ర పోషించినందుకు ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌కు ఫోన్‌చేసి ధన్యవాదాలు కూడా తెలియచేశారు. కాస్తంత విశ్రాంతి తీసుకున్నాక త్వరలోనే అసాంజే మీడియా ముందుకు వస్తారని కుటుంబీకులు హామీ ఇచ్చారు. ఏళ్ళతరబడి న్యాయపోరాటం చేస్తూ, ఒకదశలో ప్రాణభయంతో వొణికిపోయిన ఆయన చివరకు ఇలా ఒక ఒప్పందానికి వచ్చి, నిర్దోషిగా బయటపడిన క్రమం, అది అమలుజరిగిన వేగం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది.

నేరాంగీకారానికి అమెరికా ప్రభుత్వంతో ఓ అంగీకారానికి రాగానే ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. బ్రిటన్‌లోని హైసెక్యూరిటీ జైలునుంచి అసాంజే బయటకు వచ్చారు, ఒక ప్రైవేట్ విమానంలో పశ్చిమ పసిఫిక్‌లోని ఉత్తర మారియానా ద్వీపం చేరుకొని, అక్కడి అమెరికా కోర్టులో తప్పు ఒప్పుకున్నారు. నేరుగా అమెరికాలో అడుగుపెట్టి, అక్కడి కోర్టులో ఆ పనిచేయాల్సిన బాధలేకుండా ఆస్ట్రేలియాకు అత్యంత సమీపంలో ఉన్న ఓ అమెరికన్ ద్వీపాన్ని ఎంచుకున్నారన్నమాట. అసాంజే తన నేరాన్ని అంగీకరిస్తారు, అందుకు బదులుగా అమెరికా ప్రభుత్వం అయనకు విముక్తి ప్రసాదిస్తుంది అన్న సమాచారం అందరికీ ముందే తెలిసినప్పటికీ, న్యాయస్థానంలో అసాంజే ఏయే మాటలతో ఆ పనిపూర్తిచేస్తారన్న ఉత్సుకత మాత్రం కాస్తంత మిగలకపోలేదు. గూఢచర్యం చట్టానికి విరుద్ధంగా, దేశభద్రతకు సంబంధించిన అతిముఖ్యమైన సమాచారాన్ని సేకరించడం, వ్యాప్తిచేయడం తప్పేనని ఒప్పుకుంటే కథ సుఖాంతం అవుతుంది కనుక ఆయన ఆ పని సవ్యంగా పూర్తిచేశారు, క్షేమంగా బయటపడ్డారు. అసాంజేను అమెరికాకు అప్పగించండంటూ బ్రిటన్ దిగువకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పుమీద మరో రెండువారాల్లో ఆయన ఎగువకోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉండగా ఈ ఒప్పందం కుదిరింది. అమెరికా ఆయన మీద పెట్టిన కేసుల లెక్కప్రకారం 175సంవత్సరాల వరకూ జైలుశిక్ష అనుభవించాల్సి రావచ్చు. కానీ, అధికారంలో బైడెన్ ప్రభుత్వం ఉండటం, ఈ ఏడాది చివర్లో అక్కడ అధ్యక్ష ఎన్నికలు జరగబోతూండటంతో వాతావరణం కలిసొచ్చింది.

దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ వస్తున్న ఒత్తిడికి బైడెన్ లొంగుతున్న విషయం ఫిబ్రవరిలోనే అర్థమైంది. అసాంజే మీద కేసులు ఉపసంహరించుకోవాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం విజ్ఞప్తిచేయడం, సానుకూలంగా పరిశీలిస్తానని బైడెన్ హామీ ఇవ్వడంతో ఈ నేరాంగీకార ఒప్పందం ద్వారా బయటపడిపోవడానికి అసాంజేకు వీలుకలిగింది. మూడుగంటల విచారణలో ఆయన వాక్‌స్వాతంత్ర్యం, భావ ప్రకటనాస్వేచ్ఛ ఇత్యాది ప్రస్తావనలతో తనను తాను సమర్థించుకుంటూ కొన్ని వ్యాఖ్యలు, విశ్లేషణలు చేశారు. ఒక జర్నలిస్టుగా రహస్యపత్రాలు సేకరించి, ప్రజలకు తెలియచేసే హక్కును కూడా గుర్తుచేశారు. అయినా, అంతిమంగా న్యాయమూర్తికి కావాల్సిన ఆ నాలుగుమాటలూ అన్నందుకు అసాంజేమీద విమర్శలు రావచ్చు కూడా. అమెరికా రక్షణ వ్యూహాలను, రహస్యాలను, యుద్ధనేరాలను, కుట్రలను, విదేశీప్రముఖుల రహస్య హత్యలను ప్రపంచానికి బహిరంగపరిచి, హీరోలాగా వెలుగుతున్నవాడు, ఎందరికో స్ఫూర్తినిచ్చినవాడు ఇలా అడ్డుతోవలో బయటకు రావడం చాలామంది మెచ్చకపోవచ్చు కూడా. కానీ, అన్ని హక్కులకూ, స్వేచ్ఛలకూ నిలయమని చెప్పుకొనే అమెరికా, దాని మిత్రదేశాలు అసాంజేను తీవ్రంగా వేధించాయి. చివరకు అత్యాచారం కేసులు పెట్టడానికి కూడా వెనుకాడలేదు. హిల్లరీ క్లింటన్ ఈమెయిల్స్ వ్యవహారాన్ని వికీలీక్స్ బయటపెట్టడంతో రాజకీయంగా ఆ వ్యవహారాన్ని వాడుకొని గెలిచిన డోనాల్డ్ ట్రంప్ తన పదవీకాలమంతా అసాంజే వెంటపడ్డారు. భవిష్యత్తులో పాత్రికేయులు, ప్రజావేగులెవరూ ఇటువంటి సాహసాలకు పూనుకోకుండా భయోత్పాతంలో ముంచాలన్నది లక్ష్యం. ప్రభుత్వాలు దేశరహస్యాలని వేటిని అంటాయో, తమ అకృత్యాలను ప్రజలకు తెలియనివ్వకుండా ఎలా దాస్తాయో వికీలీక్స్ బయటపెట్టింది. అందుకు శిక్షగా పద్నాలుగేళ్ళు కోల్పోయిన అసాంజే ఇప్పుడు స్వేచ్ఛాజీవి అయినందుకు సంతోషించాలి.

# నేరం మీది కాదు, నిన్నటిదీ మొన్నటిదీ!!





■ కె. శ్రీనివాస్

**సందర్భం**

ఏ కాలంలో ఆ కాలపు విషయాలుంటాయని అనుకుంటాం. కానీ, ఇది అకాలం లాగా, అతీత కాలంగా ఉంది. గత పదేళ్లకాలంలో పేరుకు నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయినా, నెహ్రూగారే పాలిస్తున్నారేమో, అన్ని పాపాలకూ ఆయనే భైరవుడు అన్నట్టుగా గడచిపోయింది. ఇప్పుడు నెహ్రూ నుంచి ఇందిరకు నాలుగడుగులు చరిత్రలో ముందడుగు వేశాం. ఇది మూడో విడత మోదీ పాలన కాదు, తాజాగా మనం ఇందిరాగాంధీ నియంతృత్వపు పీడకలను స్మరించడం మొదలుపెట్టాం. కళ్లెదురుగా కనిపిస్తున్న వర్తమానాన్ని మూర్ఛపుచ్చి, కాలయంత్రంలో గతంలోకి నడిపించుకువెళ్లడం సామాన్యమైన విద్య కాదు. ఆ అమోఘమైన విద్యను సాధన చేస్తున్నవారిని అభినందించవలసిందే. ఫ్లాష్ బ్యాక్ కాలాన్ని జీవించే, పునర్జీవించే భారతీయులు అదృష్టవంతులు.

ఆ నాటి ఎమర్జెన్సీ తక్కువదేమీ కాదు. అది స్వతంత్ర భారతం మీద చేసిన స్వదేశీ గాయం చిన్నది కాదు. స్వేచ్ఛకు, పోరాటశీలతకు కత్తులబోనులు మొలిచి, నెత్తురు పారిన కాలం అది. కానీ, ఆ పీడకల నుంచి భారతదేశం తేరుకున్నది. ఎమర్జెన్సీ అనుభవాల నుంచి దేశంలో పౌర హక్కుల ఉద్యమాలు, పాత్రికేయ పరిశోధనోద్యమాలు, న్యాయవ్యవస్థ క్రియాశీలత మొదలైనవన్నీ ఉధృతమయ్యాయి. చరిత్రలో ఆ ఘట్టం ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఏ దేశం చరిత్రలో అయినా అనేక ఉద్రిక్త, విషాద, దుర్మార్గ పర్వాలుంటాయి. కొన్ని జ్ఞాపకాలుగా మారిపోయి, మచ్చలుగానే గుర్తుంటాయి. ఏ న్యాయమూ జరగనప్పుడు మాత్రం ఇంకా సలుపుతూ ఉంటాయి. 1984 సిక్కుల ఊచకోత, అదే ఏడాది భోపాల్ విషవాయు హత్యలు, 1992 బాబ్రీమసీదు కూల్చివేత, ముంబై హింసాకాండ, పేలుళ్లు, 2002 గుజరాత్ ఊచకోత వంటివి, తగిన నిష్కృతి దొరకక, ఇంకా సజీవ వ్రణాలుగానే మిగిలాయి. వాటి ప్రభావాలు, ప్రతిధ్వనులను భరించడంతో పాటు, కొత్తగా తమ ముందుకు వచ్చే అనేక జీవన్మరణ అంశాల మీద కూడా ప్రజలు ఆవేదన చెందుతూ, పరిష్కారాలు వెదుక్కోవలసి ఉంటుంది. దురదృష్టవశాత్తూ, దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకూ గతంలో మూలాలున్నాయి, ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నిటికీ అయా కాలాల్లో వాటితో ప్రమేయం ఉన్నది. ఎవరూ ఇందులో పూర్తి నిర్దోషులు కారు. ఎవరి చేతులూ పవిత్రంగా లేవు. ఆ పార్టీలతోనే ప్రజలు ప్రయోగాలు చేయాలి. గెలిపించాలి. ఓడించాలి.

రాజ్యాంగానికి ప్రమాదం ఉన్నదని, దాన్ని కాపాడుకోవాలని ప్రతిపక్ష కూటమి గత ఎన్నికలలో ప్రచారం చేసింది. మూడోసారి దేశ సారథ్యాన్ని చేపట్టిన నరేంద్రమోదీ నుంచి ఆ ప్రమాదం ఇంకా కొనసాగుతున్నదని కూడా భావిస్తోంది. దాన్ని ఎదుర్కొనడానికి, తామెంతటి రాజ్యాంగ నిబద్ధులమో చెప్పుకోవలసింది పోయి, యాభై ఏళ్ల కింద కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి ద్రోహం చేసిందని బీజేపీ ఎదురుదాడి చేయడంలో ఆత్మరక్షణ వ్యూహం ఉన్నదా, అతిశయించిన మేధ ఉన్నదా తెలియదు. గత రెండు ప్రభుత్వాలలోని అన్ని అంశాలను కొనసాగించే వ్యూహంలో ఇది భాగమా, లేక, కొత్త ఎత్తుగడలు వేయలేని భావదారిద్ర్యమా అర్థం కావడం లేదు.

ఏ కొత్త ప్రభుత్వమైనా పాత ప్రభుత్వాల వైఫల్యాల నుంచి, దుష్పరిపాలనల నుంచే ప్రజల తీర్పును పొందుతుంది. ఓడించడమే పాత ప్రభుత్వానికి పెద్ద శిక్ష. కొన్ని సమయాల్లో, గత ప్రభుత్వాలు ప్రజల విషయంలో, ప్రత్యర్థుల విషయంలో అతి దుర్మార్గంగా వ్యవహరించినప్పుడు, కొంతకాలంపాటు, పాత కాలపు స్మరణ, దోషుల అభిశంసన కొనసాగుతూ ఉంటాయి. అరుదైన సందర్భాలలో, గత పాలకులు నేరస్థులుగా నిర్ధారణ జరిగి, శిక్షలు అనుభవిస్తారు. ఎమర్జెన్సీ కాలంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వం అకృత్యాలకు పాల్పడడమే కాక, వాటి సమాచారం వ్యాప్తి చెందకుండా సెన్సార్‌షిప్ కూడా విధించింది. అందువల్ల, ఎమర్జెన్సీ అంతమై, జనతాప్రభుత్వం వచ్చిన తరువాత, ఆ కాలపు అకృత్యాలన్నీ ఒక్కొక్కటిగా వెలికిరావడం, తెలియని వారు దిగ్భ్రాంతి చెందడం దీర్ఘకాలం పాటు జరిగింది. కథలు కథలుగా వాటిని తెలుసుకున్న ప్రజలు, ఆ కోపంలో చాలాకాలం పాటు జనతాప్రభుత్వాన్ని అధికారంలో కొనసాగించి ఉండేవారు. కానీ, రాజకీయ అంతఃకలహాలు, పాలనలో వాటి ప్రతిఫలనాలు వారిలో విరక్తి కలిగించాయి. ఎమర్జెన్సీ ప్రతికూలత మీద అమితంగా ఆధారపడడం ఒక వైపు, కమిషన్ల విచారణలు ఇందిరను వేధించడానికే సాగుతున్నాయన్న అభిప్రాయం కలిగించడం మరోవైపు, 1980లో ప్రజలు తిరిగి ఇందిరకు పట్టం కట్టడానికి కారణం అయ్యాయి. గతం నుంచి, గత ప్రభుత్వాల నుంచి రాజకీయ లాభం కొంత పొందవచ్చు. కానీ, గతాన్నభుక్కులు కావడాన్ని ప్రజలు ఇష్టపడరు.

> సైద్ధాంతిక కారణాలు కాక, కేవలం రాజకీయ ఆధిక్యం కోసం కొత్తప్రభుత్వాలు పాతప్రభుత్వాల నేరాల మీద అమితంగా ఆధారపడడం కూడా అనేక సందర్భాలలో చూడవచ్చు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా, గత ప్రభుత్వాల రాజకీయ, పాలనా అనైతికత మీద అమితంగా ఆధారపడడంలో ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలి. మునుపటి ప్రభుత్వాలు పాల్పడిన రాజకీయ అకృత్యాలయినా, పాలనా పరమైన అక్రమాలైనా, వాటిని బట్టబయలు చేసి, సరైన విచారణకు, న్యాయప్రక్రియలకు నివేదించడం తప్పనిసరి. ఆ క్రమాన్ని ప్రజలు కోరుకుంటారు. అంతేకాదు, అది ప్రజలకు అవసరమైనది కూడా.

నరేంద్రమోదీ ప్రభుత్వం 2014లో మొదటి దఫా గెలిచినప్పుడు, గత ప్రభుత్వంలోని అవినీతి, పాలనా వైఫల్యాల నుంచి బాగానే ప్రయోజనం పొందింది. తరువాత దాన్ని దీర్ఘకాలికం చేసుకోవడానికో, తన విస్తృతమైన ఎజెండాను అమలు చేయడంలో భాగంగా ఆధునిక భారత చరిత్రను కొత్తగా వ్యాఖ్యానించడానికో, గాంధీతో మొదలుపెట్టి, నెహ్రూ కుటుంబం దాకా బోనులో నిలబెట్టింది. గత ప్రభుత్వం స్థానంలో, ఆ ప్రభుత్వం రాజకీయచరిత్రే దోపిడిగా మారిందన్న మాట. జరిగిందంతా తప్పే, 2014 నుంచి మాత్రమే దిద్దుబాటు మొదలయిందన్న ప్రచారాన్ని భారతీయ సమాజం పూర్తిగా అంగీకరించలేదు. 2024లో ఆ ప్రాజెక్టుకు పెద్ద ఆటంకం ఏర్పడింది. అయినా, ఏమీ జరగనట్టు, ఇంతకాలం అనుసరించిన విధానమే మరింత తీవ్రంగా కొనసాగించడమే కర్తవ్యమన్నట్టు, మోదీ ప్రమాణస్వీకారాల రోజు నుంచే యాభై ఏళ్ల కిందటి చరిత్రను రక్షణకవచంగా ధరించింది. వర్తమానంలో బలమైన ప్రత్యర్థి కాకపోయినా, ఊహలో, గతంలో బలశాలిగా ఉన్న కాంగ్రెస్‌తో మోదీ యుద్ధంచేస్తూ వచ్చారు. గత్యంతరం లేదు, ప్రమాదకరమైన ప్రత్యర్థి లేకపోతే తీవ్ర జాతీయవాదం లేదు.

ఎమర్జెన్సీ జ్ఞాపకాన్ని కవచంగా ధరించడంలో నరేంద్ర మోదీ సరళి అందరికీ పనికివచ్చేది కాదు. 2019 దాకా ఆ పద్ధతి సైద్ధాంతికమైన చట్రం కోసం మాత్రమే ఉద్దేశించింది. కానీ, అది ఇటీవల ఎన్నికలలో పగుళ్లు బారింది. ఇప్పుడు కూడా ఇండియాకూటమి రాజకీయనైతికతను దెబ్బతీయడానికి మాత్రమే ఎమర్జెన్సీను రంగంలోకి దించారు. సైద్ధాంతిక కారణాలు కాక, కేవలం రాజకీయ ఆధిక్యం కోసం కొత్త ప్రభుత్వాలు పాతప్రభుత్వాల నేరాలమీద అమితంగా ఆధారపడడం కూడా అనేక సందర్భాలలో చూడవచ్చు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా, గత ప్రభుత్వాల రాజకీయ, పాలనా అనైతికత మీద అమితంగా ఆధారపడడంలో ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలి. మునుపటి ప్రభుత్వాలు పాల్పడిన రాజకీయ అకృత్యాలయినా, పాలనా పరమైన అక్రమాలైనా, వాటిని బట్టబయలు చేసి, సరైన విచారణకు, న్యాయప్రక్రియలకు నివేదించడం తప్పనిసరి. ఆ క్రమాన్ని ప్రజలు కోరుకుంటారు. అంతేకాదు, అది ప్రజలకు అవసరమైనది కూడా. ప్రభుత్వాలలో ఉన్నవారు ఎంతటి అవినీతికి, అఘాయిత్యాలకు పాల్పడగలరో ప్రజలకు తెలిసి, వారు ముందుముందు అప్రమత్తంగా ఉంటారు. ఇదంతా కూడా పరిపాలనను మెరుగుపరచడానికి జరిగే ప్రక్రియలాగానే ఉండాలి కానీ, రాజకీయ కక్ష సాధింపుగా ప్రజలు భావించే ఆస్కారం ఇవ్వకూడదు. న్యాయంగా కనిపించే నేరవిచారణ, ఏ కీలక దశలో ప్రజలకు అన్యాయంగా అనిపిస్తుందో గ్రహించే వివేచన నాయకులకు ఉండాలి.

చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఇంకా నెలరోజులు కూడా కాలేదు. ఒకరి ఘోరపరాజయం, ఒకరి అతి ఘన విజయం అన్న జంటపరిణామాలు సహజంగానే సంచలనం కలిగించాయి. రాజకీయంగాను, ప్రభుత్వపరంగానూ కొన్ని ఉద్రిక్త స్పందనలు కనిపించాయి. ఓటు ద్వారా ఓడించినా, ప్రజల నుంచి కొంత ఆగ్రహప్రకటన కూడా జరిగింది. కానీ, చంద్రబాబు బృందం వెంటనే పనిలోకి దిగింది. ప్రధానమైన వాగ్దానాలపై నిర్ణయం తీసుకుంది. గత పాలన దోషాలను నిగ్గుతీయవలసిందే కానీ, కేవలం గతాన్ని నిందిస్తూ కూర్చుంటే ఉపయోగం లేదన్న గ్రహింపు అందులో ఉంది. కానీ, తెలంగాణలో మాత్రం కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా, పరిస్థితి భిన్నంగా ఉన్నది.

పోయిన డిసెంబర్‌లో తెలంగాణ విజయం, కష్టకాలంలో కాంగ్రెస్‌కు లభించిన రెండో గెలుపు. కాకపోతే, కర్ణాటకలో లాగా ఘనవిజయం లభించలేదు. ఆరు భారీ గ్యారంటీల మీద, ప్రజాస్వామిక పాలన వాగ్దానం మీద ఆధారపడి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా, హామీలన్నీ ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. ఆర్టీసీ ఉచిత ప్రయాణం వెంటనే ప్రారంభించగలిగారు. ఎంతో వ్యవధి లేకుండానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అదనంగా 2 లక్షల రుణమాఫీ వాగ్దానం. ఆ వాగ్దానం లేకపోతే, కాంగ్రెస్‌కు ఎనిమిది స్థానాలు కూడా దక్కేవి కాదన్న అభిప్రాయం ఉంది. అసెంబ్లీ ఎన్నికలనాటి వాగ్దానాల విషయంలో గట్టి ముందంజపడి ఉంటే, కాంగ్రెస్ మీద విశ్వాసం మరింత బలంగా ఉండేది. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్పుడు నిర్ణయాలు, కరెంటు కొనుగోళ్లలో జరిగిన అధికవ్యయాలు, ఇంకా అవినీతులు, అక్రమాలు, ఈ ఆరునెలల కాలంలో చర్చలోకి వచ్చాయి. ప్రభుత్వం సంక్షేమాన్ని అమలుచేయడానికి తగిన ధనవసతి లేకపోవడానికి గత ప్రభుత్వమే కారణమన్న అభిప్రాయమైతే కలిగింది. కానీ, కొత్తప్రభుత్వం చాకచక్యంగా పరిస్థితిని చక్కబరచాలని కూడా ప్రజలు భావిస్తారు.

> దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకూ గతంలో మూలాలున్నాయి, ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నిటికీ ఆయా కాలాల్లో వాటితో ప్రమేయం ఉన్నది. ఎవరూ ఇందులో పూర్తి నిర్దోషులు కారు.

చంద్రబాబుతో పోటీపడి రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేయాలని రేవంత్ రెడ్డి అనుకోవడం బాగుంది. కానీ, ఇంతకాలానికి కూడా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇంకా స్థిమిత పడలేదని, సమర్థులైన అధికారులు, వ్యవహర్తలైన సలహాదారులు అధినేతకు సమకూరలేదని ఒక అభిప్రాయమైతే వ్యాప్తిలో ఉంది. ఎక్కడో ఫామ్‌హౌస్‌లో ఉండి, అత్యవసర వ్యవహారాలను కూడా పెండింగ్‌లో పెట్టేవారని గత ముఖ్యమంత్రిపై విమర్శలు ఉండేవి. కొత్త ముఖ్యమంత్రి రాజధానిలోనే, విరామం లేకుండా జనం మధ్యలోనో, అధికారులతోనో ఉంటారు. కానీ, అనేక ప్రక్రియలు నత్తనడక నడుస్తున్నాయి. ఈ పరిస్థితికి గత ప్రభుత్వం నుంచి సంక్రమించిన అయోమయం కొంత కారణం. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకమైన కొన్ని పరిస్థితులు మరో కారణం. ప్రాంతీయపార్టీకి ఉండే స్వేచ్ఛ, నిర్ణయవేగం రాష్ట్ర కాంగ్రెస్‌లో సాధ్యపడదు. కానీ, పరిపాలన నాణ్యత ప్రజలకే బాగా తెలుస్తుంది. అందులో కలిగే లోపాన్ని గత ప్రభుత్వం మీద అభియోగాలు, ఆరోపణలు భర్తీ చేయలేవు. పైగా, సానుభూతి కలిగిస్తాయి. ప్రతికూల ప్రచారం నుంచి కాక, సానుకూల పాలన నుంచే బలాన్ని పెంచుకోవడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నించాలి.

## కాంగ్రెస్ రైతుల పార్టీ అని మరోమారు రుజువైంది!

తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అసలైన పండుగ సమయమిది. ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణ మాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైతులపై మన ప్రజా ప్రభుత్వానికి ఉన్న కమిట్‌మెంటుకు ఇదో గొప్ప ఉదాహరణ. కాంగ్రెస్ అంటేనే రైతులు, రైతులంటే కాంగ్రెస్. రుణమాఫీతో రైతులు ఊరు వాడ సంబరాలు జరుపుకుంటున్నారు, పాలాభిషేకాలు చేస్తున్నారు, ప్రజాపాలనకు నీరాజనాలు పడుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం కొలువుదీరిన అతికొద్ది రోజుల్లోనే ఇచ్చిన మాటకు కట్టుబడి మన రాష్ట్ర రైతులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మే 6, 2022 వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అమలు చేయడం మన దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం, చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా చేయని గొప్ప సాహసం. బీఆర్ఎస్ పరిపాలించిన దశాబ్ద కాలంలో శతాబ్దపు దోపిడీ జరిగింది, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయింది. ఆర్థిక ఇబ్బందులను పంటి బిగువున ఓర్చుకొని రైతులకు ఇచ్చే సొమ్ము మనకు భారం కాదు ఎంత బరువైన భరిద్దాం అని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర క్యాబినెట్ రైతులను రుణ విముక్తులను చేయటానికి నిశ్చయించింది. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీకి ఆమోదం తెలిపింది.



> రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అస్సలు సహకరించకపోయినా, ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ రుణమాఫీ హామీని నిలబెట్టుకుంది. రానున్న దశాబ్ద కాలంలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారం గురించి ఆలోచించే పరిస్థితి లేదు. రైతు రుణమాఫీ నిర్ణయంపై క్యాబినెట్ ఆమోదం తెలిపిన అనంతరం రైతులలో ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే ఇది స్పష్టం అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయదని, అబద్ధపు ప్రచారాలు చేసిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను ఇప్పుడు రైతులు నిలదీయాలి.

దాదాపు 47 లక్షల మంది రైతులకు మేలుచేసే రుణ మాఫీకి, కట్ ఆఫ్ డేట్ డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 వరకూ. ఈ ఐదేళ్ళల్లో రైతులు తీసుకున్న 2 లక్షల రూపాయల రుణాలు మాఫీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. రుణమాఫీ మొత్తానికి 31 వేల కోట్ల నిధులు అవసరం. కేసీఆర్ ప్రభుత్వ దోపిడీ నుంచి తేరుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అన్వేషిస్తూ ప్రభుత్వం ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి ప్రజల నుంచి స్వచ్ఛందంగా హర్షాతిరేకలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో రైతులకు పెద్దపీట వేస్తారు అనే అభిప్రాయం ప్రజలలో మరింత బలపడింది.

రైతు రుణమాఫీ నిర్ణయంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వారి రాజకీయ మనుగడపై ఆందోళన చెందుతున్నాయి. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కుట్రపూరితంగా రుణమాఫీపై అసత్యపు ప్రచారాలతో, ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేసిన బీజేపీ, ప్రజలను మభ్యపెట్టి కొన్ని స్థానాలు పెంచుకోగలిగింది. కానీ ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ లకు రుణమాఫీ నిర్ణయంతో కోలుకోలేని షాక్ తగిలింది. దేశంలో పదేళ్ళల్లో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్లకు రుణమాఫీలు చేసింది గాని ఏ రోజు రైతుల గురించి ఆలోచించలేదు. కేసీఆర్ పదేళ్లలో చేసింది కేవలం రూ.28 వేల కోట్లు మాత్రమే. దాన్నే దఫదఫాలుగా చేస్తూ రైతుల ఆత్మహత్యలకు కారకుడయ్యాడు. కానీ ప్రజా ప్రభుత్వం ఆరు నెలల్లోనే 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తున్నది. అది కూడా ఒకే దఫాలో రెండు లక్షలు రుణమాఫీ చేస్తున్నాం. ఇలాంటి చారిత్రక నిర్ణయం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం.

రానున్న దశాబ్ద కాలంలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారం గురించి ఆలోచించే పరిస్థితి లేదు. రైతు రుణమాఫీ నిర్ణయంపై క్యాబినెట్ ఆమోదం తెలిపిన అనంతరం రైతులలో, ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే ఇది స్పష్టం అవుతుంది. ప్రజల హర్షాతిరేకాలను గమనించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో భాగస్వాములు కావడానికి పోటీపడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకమైంది. దీనికి తోడు రుణమాఫీ నిర్ణయం బీఆర్ఎస్ రాజకీయ ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అమరవీరుల స్థూపం సాక్షిగా ప్రమాణం చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు తన రాజీనామా లేఖను స్పీకర్ ఫార్మాట్‌లో సిద్ధం చేసుకుని ఉంచాలి.

ఎన్నికల్లో లబ్ధి కోసం, ఓట్ల కక్కుర్తి కోసం దిగజారి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయదని, అబద్ధపు ప్రచారాలు చేసిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను ఇప్పుడు రైతులు నిలదీయాలి. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అస్సలు సహకరించకపోయినా, ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ రుణమాఫీ హామీని నిలబెట్టుకుంది. పంద్రాగస్టు 2024 లోపు రైతులకు రుణమాఫీ చేసి తీరుతాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. జూన్ లోనే క్యాబినెట్ ఆమోదం పొంది, జూలై లోపే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసి "రైతన్నల కళ్ళల్లో ఆనందం చూడటానికి ఎంత దూరమైనా వెళ్తాం ఎంత భారమైన మోస్తాం" అన్నారు. కాంగ్రెస్ అంటేనే నమ్మకం.. చేసేదే చెప్తాం, చెప్పిందే చేస్తాం అని మరో మారు రుజువైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏకకాలంలో రెండు లక్షల రూపాయల అప్పున్న రైతులను రుణ విముక్తుల్ని చేయగల ప్రజా ప్రభుత్వ ఈ సాహసోపేత నిర్ణయానికి తెలంగాణ రైతాంగం అండగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నది. కొద్దిరోజుల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీని అత్యద్భుతంగా గెలిపించేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

○ **డాక్టర్ కొనగాల మహేష్**
కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

## దివ్యాంగుల ఉద్యోగ ఫలితాలు ప్రకటించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన వికలాంగులకు సంబంధించిన ఫలితాలను ప్రకటించాలి. వీరిని 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు. పాఠాలు బోధించే డెమో క్లాసులు నిర్వహించారు. అంతేకాక వికలాంగులకు సంబంధించిన టెస్టులను సరోజినీదేవి కంటి దవఖానలోను, శారీరక వికలాంగులకు మరొక చోట టెస్టులు నిర్వహించారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో జూన్ 1 నుండి తరగతులు ప్రారంభం అయినాయి. గురుకులాలలో అన్ని రకాల పోస్టులు అన్ని రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించిన ఫలితాలను వెల్లడించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా ఇచ్చారు. కేవలం వికలాంగులపై వివక్షతతో జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో వికలాంగుల ఫలితాలను ప్రకటించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అర్హులైన వికలాంగులు గత కొన్ని నెలలుగా ఫలితాల కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నారు. కాబట్టి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వికలాంగుల ఫలితాలను వెంటనే ప్రకటించాలని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న బాధితులు కోరుతున్నారు.

**– రాపాక రవీందర్**, జనగాం

## కొత్త ప్రభుత్వం నడవాల్సింది కొత్త దారుల్లోనే!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులందరితో కలసి జూన్ 21న ప్రెస్‌మీట్ పెట్టి క్యాబినెట్ సమావేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించి తీసుకున్న రెండు ముఖ్యమైన నిర్ణయాలను ప్రకటించారు. వరంగల్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్లుగా రైతులకు రెండు లక్షల లోపు ఉన్న ఋణాలను ఆగస్ట్ 15 లోపు తప్పకుండా రద్దు చేస్తామని, ఇందుకు సంబంధించి విధి విధానాలను ఫైనల్ చేశామని, త్వరలో జీవో కూడా విడుదల అవుతుందని చెప్పారు.

రైతు భరోసా విధి విధానాలను ఖరారు చేయడానికి నలుగురు సభ్యులతో ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ అందరితో చర్చించి జూలై 15 నాటికి నివేదిక ఇస్తుందని, ఈ నివేదికను అసెంబ్లీ సమావేశాలలో చర్చించి ఫైనల్ చేస్తామని, ఆ తరువాత అర్హులకు రైతు భరోసా పెట్టుబడి సహాయం చెల్లిస్తామని ప్రకటించారు. తప్పకుండా హృదయ పూర్వకంగా స్వాగతించాల్సిన ప్రకటనలు ఇవి.

రాజకీయ ఒత్తిళ్లకు లొంగి అనాలోచితంగా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాలు నిజమైన రైతులకు మేలు చేయకపోవచ్చు. గత ప్రభుత్వం చేసినట్లుగా నిధుల దుర్వినియోగానికి కూడా దారితీయవచ్చు. సాధారణంగా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకుండా, అధికారమే పరమావధిగా భావించే ప్రతిపక్ష పార్టీలు కొన్ని ఈ క్యాబినెట్ నిర్ణయాలను తప్పుపట్టవచ్చు కానీ, జూన్ 6 వరకూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉండి, ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలో మొదలైనందున, ఇలా ఒక నెల రోజుల సమయం తీసుకుని అన్ని కోణాలలో ఆలోచించి, అందరితో సంప్రదించి, విధాన నిర్ణయాలు చేయడం సరైనది. ఫలితంగా జూలైలో రైతు భరోసా సహాయం నిజమైన రైతులకు అందించవచ్చు. ఆగస్ట్‌లో అర్హులైన వారికి ఋణమాఫీ చేయవచ్చు. కొత్త బ్యాంకు ఋణాలకు దారి సుగమం చేయవచ్చు. పంటల బీమా పథకానికి, రైతు బీమా పథకానికి నిజమైన అర్హులను నిర్ణయించవచ్చు.

అయితే ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించి మరికొన్ని అంశాలను కూడా క్యాబినెట్‌లో చర్చించి ప్రభుత్వం ప్రకటన చేసి ఉండాల్సింది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ఏయే భూముల్లో పంటలు సాగవుతున్నాయో, ఒక నిర్దిష్ట సర్వే నంబర్‌లో ఎవరు సాగు చేస్తున్నారో, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు పరిశీలించి, ఎవరి ఒత్తిళ్లకూ, ప్రలోభాలకూ లొంగకుండా వాస్తవ సమాచారాన్ని సేకరించేలా తగిన ఆదేశాలు ఇస్తామని ప్రకటన చేసి ఉండాల్సింది. ఇప్పటి వరకూ వ్యవసాయ శాఖ సేకరించే ఈ గణాంకాలు పూర్తి స్థాయిలో సవ్యంగా లేవని అందరికీ తెలుసు.


2011 భూ అధీకృత సాగుదారుల చట్టం మార్గదర్శకాల ప్రకారం అన్ని గ్రామాలలో కౌలు రైతులను గుర్తించడానికి వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించి ఉండాల్సింది. గత ఎనిమిదేళ్లుగా ఈ చట్టాన్ని అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది మంది కౌలు రైతులకు అన్యాయం చేసింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత ప్రజా పాలన అందిస్తామన్న కొత్త ప్రభుత్వంపై ఉంది. అలాగే రైతు భరోసా సహాయం అందించడానికి అర్హులైన వ్యవసాయ కూలీలను గుర్తించే ప్రక్రియ కూడా వెంటనే ప్రారంభిస్తామని ప్రకటించి ఉండాల్సింది.

అలాగే ధరణిలో పార్ట్–బీలో ఉండిపోయిన పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి కూడా అవసరమైన జీవోలు ఇచ్చి, సమస్యలను పరిష్కరించే ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించి ఉండాల్సింది. జూలైలో మంత్రివర్గ ఉప సంఘం నివేదిక వచ్చే నాటికి కౌలు రైతులను గుర్తించి, ధరణిలో సమస్యలను కూడా పరిష్కరించి రెడీగా ఉంటామని, నివేదికను అసెంబ్లీ సమావేశాలలో చర్చించి ఫైనల్ చేసిన వెంటనే, అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సహాయం అందిస్తామని స్పష్టంగా ప్రకటించి ఉంటే బాధిత రైతులకు భరోసా కలిగేది.

ఈ నిర్ణయాలు చేయాలంటే ఏ ప్రభుత్వానికైనా రాజకీయ చిత్తశుద్ధి, సాహసం కావాలి. ప్రస్తుత ప్రభుత్వం పాత ప్రభుత్వ విధానాలను విడనాడి, సామాజిక న్యాయం భావనను మనసులో ఉంచుకుని, కొత్తగా ఆలోచిస్తే, రాష్ట్రంలో నిజమైన రైతులకు న్యాయం చేసిన వాళ్ళవుతారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన వాళ్ళవుతారు.

స్వయంగా వ్యవసాయం చేయకపోయినా, భూమి పట్టా ఉంది అనే పేరున ఇప్పటి వరకూ రైతు బంధు సహాయం, వడ్డీ లేని పంట రుణం, పంట నష్టపరిహారం పొందుతున్న భూ యజమానులకు, ప్రభుత్వం ఆయా భూముల్లో నిజంగా సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి, వారికి ఈ పథకాలన్నీ వర్తించేలా అమలు చేయడం అంతగా ఇష్టం ఉండకపోవచ్చు. రకరకాల తప్పుడు కారణాలు చెప్పి, అధికారులు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అడ్డుకోవచ్చు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి, గ్రామ సర్పంచ్ వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులూ, రైతు సంఘాలూ, రాజకీయ పార్టీలూ బాధ్యతగా వ్యవహరించి, సాగు చేయని భూ యజమానులకు నచ్చ చెబితే, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, సహాయం చేయడానికి వాళ్ళు కూడా అంగీకరించవచ్చు. ప్రభుత్వమే 2011 కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని అమలు చేయడానికి తటపటాయిస్తే, కొన్ని ప్రతిపక్షాలు పనిగట్టుకుని భూ యాజమానులైన రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వం మీదికి ఎగదోస్తాయని రాజకీయంగా వెనకాడితే, ఈ పని ఎప్పటికీ ముందుకు పోకపోవచ్చు. ప్రభుత్వం జరిపే చర్చలలో అన్ని రాజకీయ పార్టీలు స్పష్టంగా వాస్తవ సాగుదారుల పక్షం తీసుకునేలా, రైతు సంఘాలు ఐక్యంగా కృషి చేయాలి. ఒప్పించాలి. రాష్ట్ర వ్యవసాయ సమస్యలను అధిగమించి, సక్రమ పద్ధతిలో ముందుకు వెళ్లాలంటే, నిజమైన రైతులను గుర్తించే ఈ సందర్భం అత్యంత ముఖ్యమైనది.

> ప్రభుత్వమే 2011 కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని అమలు చేయడానికి తటపటాయిస్తే, కొన్ని ప్రతిపక్షాలు పనిగట్టుకుని భూ యాజమానులైన రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వం మీదికి ఎగదోస్తాయని రాజకీయంగా వెనకాడితే, ఈ పని ఎప్పటికీ ముందుకు పోకపోవచ్చు. రాష్ట్ర వ్యవసాయ సమస్యలను అధిగమించి, సక్రమ పద్ధతిలో ముందుకు వెళ్లాలంటే, నిజమైన రైతులను గుర్తించే ఈ సందర్భం అత్యంత ముఖ్యమైనది.




ఈ సంవత్సరం కౌలు రైతులను గుర్తించే పని ముందుకు పోకపోతే, రాబోయే ఐదేళ్ల పాటూ అదే ఒరవడి కొనసాగుతుంది. లక్షలాది మంది కౌలు రైతులకు మళ్ళీ నష్టం జరుగుతుంది. రైతు భరోసా పేరుతో ఎన్ని వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టినా, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉంటాయి. రైతు ఆత్మహత్యలు ఆగి, రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో నుంచి బయటపడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయడానికి, పాత ప్రభుత్వ చెప్పుల్లో కాళ్ళు పెట్టకుండా కొత్త దారులు వేయాలి.

పంట రుణాల విషయమూ అంతే. ఇప్పటి వరకూ బ్యాంకులు భూమిపై పట్టా హక్కులు కలిగివున్న వాళ్ళకు మాత్రమే పంట రుణాలు ఇస్తున్నాయి. స్వయంగా వ్యవసాయం చేయని అనేక మంది వడ్డీ లేని పంట రుణాలు పొంది ఎంజాయ్ చేస్తున్నారు. నిజంగా వ్యవసాయం చేస్తున్న కౌలు, పోడు, మహిళా రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు అందక ప్రైవేట్ రుణాల ఊబిలో కూరుకు పోతున్నారు. ఈ ఖరీఫ్ నుంచి నిజంగా సాగు చేస్తున్న రైతులను నమోదు చేసి, వారికే పంట రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం బ్యాంకులతో చర్చించాలి. అవసరమైతే అటువంటి వారిని జాయింట్ లయబిలిటీ గ్రూపులు (JLG)గా ఏర్పాటు చేసి వారికి వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలి. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలు కూడా అదే సూచిస్తున్నాయి. పంటల బీమా ప్రీమియం, రైతు బీమా ప్రీమియం, ఇతర సబ్సిడీ పథకాల కోసం నిధులను ప్రభుత్వం ఖర్చు చేయాలి.

రైతులను ఋణ విముక్తులను చేస్తామనే పేరుతో ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న ఋణమాఫీ కూడా వ్యవసాయ రంగ సంక్షోభాలను ఆటోమాటిక్‌గా పరిష్కరించదు. మిగిలిన సమస్యలను పరిష్కరించడానికి కూడా తగినన్ని నిధులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుకోవాలి. వ్యవసాయం చేసి నష్టపోయిన నిజమైన రైతులకు రుణ మాఫీ చేయడం న్యాయం. వ్యవసాయం చేయకపోయినా, వడ్డీ లేని పంట రుణాలు తీసుకున్న వాళ్ళకు కూడా ఋణ మాఫీ చేయడం అనైతికం, నిధుల దుర్వినియోగం. అందుకే ఈ దఫాలో గ్రామాలలో ఉండి సాగు చేస్తున్న సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులకు రెండు లక్షల లోపు రుణాలను ఋణమాఫీ చేయడంపై ప్రభుత్వం ముందుగా దృష్టి పెట్టాలి.

రాష్ట్రంలో అసెంబ్లీ ఆమోదించిన వ్యవసాయ కుటుంబాల రుణ విముక్తి కమిషన్‌ను పునరుద్ధరించాలి. చట్టం నిర్దేశిస్తున్నట్లుగా ఆ కమిషన్‌కు రిటైర్డ్ జడ్జ్‌ను చైర్మన్‌గా నియమించాలి. అర్హులైన ఇద్దరు పురుషులను, ఇద్దరు మహిళలను కమిషన్ సభ్యులుగా నియమించాలి. రాబోయే కాలంలో వ్యవసాయంలో ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయి అప్పుల పాలైన రైతులకు ఋణమాఫీ చేయమని ఈ కమిషన్ సిఫారసు చేస్తే, ఎన్నికల కోసం ఆగకుండా అప్పటికప్పుడు ఆయా రైతుల రుణాలను మాఫీ చేయడానికి నిధులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుకోవాలి.

• **కన్నెగంటి రవి**
రైతు స్వరాజ్య వేదిక





నిట్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వాన నీరు

# ఎన్‌హెచ్‌ఎం నిధుల జాడేదీ?



హనుమకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మురికి కూపాలుగా మారిన పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులు ఇవ్వడం లేదు. ఈ మిషన్ ద్వారా పంచాయతీలకు అందాల్సిన రూ.10వేల నుంచి రూ.15వేల నిధులు మూడేళ్లుగా విడుదల కావడం లేదు. ఎప్పుడు విడుదల అవుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఉంది. ఆ నిధులొస్తేనే పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. ఈ నిధుల విడుదలలో అంతులేని జాప్యం కారణంగా పల్లెలన్నీ మురికి కూపాలుగా మారాయి.

వానాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి పంచాయతీల వారీగా నిధులు మంజూరు చేసేది. ఈ నిధులతో వైద్య, ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేవి. నిధులు విడుదల కాకపోవడంతో వానాకాలం చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాలు అటకెక్కాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వర్షాకాలంలో పారిశుధ్యం క్షీణించిన చోట, ఆరోగ్యపరంగా ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట్ల ఈ నిధులతో కార్యక్రమాలు చేపట్టేవారు. దీంతో వ్యాధులబారిన పడకుండా కొంత ఉపశమనం పొందేవారు.

**మూడేళ్లుగా..**

జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఏటా మంజూరయ్యే నిధులు పంచాయతీ సర్పంచ్, ఏఎన్‌ఎం సంయుక్త ఖాతాలో జమయ్యేవి. గ్రామ జనాభాను బట్టి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు విడుదలయ్యేవి. ఏటా వర్షాకాలంలో ఉమ్మడి జిల్లాకు రూ.16.88కోట్ల వరకు మంజూరు అయ్యేవి. మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో సుమారు రూ.50.64 కోట్ల వరకు నిధులు బకాయిలు రూపంలో పేరుకుపోయాయి. నిధుల విడుదలను విస్మరించడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్య పనులు చేపట్టడం వైద్య ఆరోగ్య సిబ్బందికీ కష్టంగా మారింది. అంటువ్యాధులు ప్రబలి గ్రామాల్లో పరిస్థితులు చేయిదాటితే ప్రమాదమని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉన్న నిధులతో తాత్కాలికంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. వర్షాకాలంలో నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. అదీకాక ఈ ఏడాది గ్రామాల్లో ప్రస్తుతం సర్పంచులు లేరు. ప్రత్యేక అధికారులను కేటాయించారు. అధికారుల ఆధ్వర్యంలోనే గ్రామాల్లో కార్యక్రమాలు సాగుతున్నాయి.

**కార్యక్రమాలు ఇలా..**

సాధారణంగా కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులకు తన వంతుగా 40 శాతం నిధులను కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు విడుదల చేస్తుంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఈ నిధులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు కేటాయిస్తారు. మెడికల్ ఆఫీసర్లు ఈ నిధులను తన పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు సర్పంచ్‌లు, సంబంధిత ఏఎన్‌ఎం ఖాతాలో జమ చేస్తారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు కలిసి గ్రామంలో పర్యటించి ఎక్కడెక్కడ నీరు నిలుపస్తున్నది. బురద గుంటలు ఎక్కడెక్కడ ఉన్నాయి. అక్కడ దోమలు ఏ మేరకు పెరుగుతున్నది పరిశీలిస్తారు. వాటిని మట్టితో పూడ్చడమా? లేక గండిపెట్టడం ద్వారా ఆ నీటిని బయటకు పంపడమా? అనేది నిర్ధారించి ఆ మేరకు వాటిని పూడ్చే పనులు చేపట్టేందుకు ఈ నిధులను విని యోగిస్తారు. వర్షాకాలంలో గ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలతో పాటు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లోని నిల్వనీటిలో లార్వా ఉండలు వేయడం, ఇళ్లలో నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయడం, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని పక్కకు మళ్లించడం తదితర కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. అయితే ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం గ్రామీణుల్లో ఇలాంటి కార్యక్రమాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.

**నిధులు రావడం లేదు..**

**- డాక్టర్ సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్‌వో**



జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంజూరయ్యే నిధులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రస్తుతం నిధులు రావడం లేదు. అయినా కూడా వైద్య, ఆరోగ్య శాఖ పరంగా గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైప్పుడు చేపట్టాల్సిన కార్య క్రమాలు చేపడుతూనే ఉన్నాం. అంటు వ్యాధులు ప్రజల కుండా అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం. గ్రామాల్లో నీటి గుంటలను పూడ్చి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- మూడేళ్లుగా విడుదల కాని ఆరోగ్య మిషన్ డబ్బులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రావల్సినవి రూ.50.64కోట్లు
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఇబ్బందులు
- పల్లెల్లో కరువవుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలు
- అంటువ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



**అటకెక్కిన పారిశుధ్య నిర్వహణ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వానాకాలంలో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలుస్తుంది. కాలువల్లోకి చెత్త, చెదారం చేరి కంపుకొడతాయి. మురుగునీరు, బురదవల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారతాయి. దీంతో ఈ ప్రాంతాలు దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా తయారవుతాయి. దోమ కాటు వల్ల ప్రజలు డెంగీ, మలేరియా తదితర అంటువ్యాధులకు గురవుతారు. ఈ పరిస్థితిని నివారించేందుకు, వర్షాకాలంలో మురుగునీరు నిలిచిన చోట్ల పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతీ పంచాయతీకి జనాభాను బట్టి వానాకాలం ప్రారంభం కావడానికి ముందే విడుదల కావాలి. ఈ మొత్తం నిధుల్లో కేంద్రం 60 శాతం నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులివ్వడం ఆనవాయితీ, కానీ కేంద్రంప్రభుత్వం ఆధ్వర్యంలో అమలయ్యే జాతీయ ఆరోగ్య మిషన్‌కు కేంద్రమే నిధులు ఇవ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు.

## నగరంలో భారీ వర్షం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం

హనుమకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కేంద్రం హెచ్చరించినట్టే బుధవారం సాయంత్రం నుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వర్షం కురవడం మొదలైంది. సాయంత్రం సుమారు 7గంటల నుంచి గంటపాటు ఒక మోస్తరు భారీ వర్షం పడింది. హనుమకొండ జిల్లాలోని హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, వేలేరు, ధర్మసాగర్, దామెర తదితర మండలాల్లో తేలికపాటి మొదలు కొని ఒక మోస్తురు భారీ వర్షం కురిసింది. రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా వర్షం కురుస్తూనే ఉంది. హనుమకొండ జిల్లాలో సరాసరి 41 మి.మీ., వరంగల్ జిల్లాలో 40 మి.మీ. వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు.

భారీ వర్షంతో నగరంలోని పలు లోట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరంగల్ నిట్ కళాశాల, పెట్రోల్ పంపు, చైతన్యపురి కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచింది. హనుమకొండ బస్‌స్టేషన్‌లో పెద్ద ఎత్తున వదననీరు నిలిచింది. కాకాజీ కాలనీల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. హనుమకొండ చౌరస్తా, ములుగు రోడ్డు ప్రాంతాలు కూడా జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్‌లో కూడా వర్షం కురిసింది. కాశిబుగ్గ జంక్షన్ వద్ద వరదనీరు నిలిచింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో మహబూబాబాద్, ములుగు, వరంగల్ హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఈ జిల్లాల అధికార యంత్రాంగాలు అప్రమత్తం అయ్యాయి. ముందు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భారీ వర్షానికి వరంగల్ నగరం వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో వరంగల్ మహా నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తం అయ్యారు. ముంపు ప్రాంతాలపై దృష్టి సారించారు.



కూరగాయలతో వినూత్నంగా నిరసనలో పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

## నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు

బాలసముద్రం, జూన్ 26: పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలను నియంత్రించాలని బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో కూరగాయలతో వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నెలరోజులుగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటినా పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వస్తువులతోపాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారిందన్నారు. పచ్చిమిర్చి, టమాట ధర కిలోకు రూ.100కు చేరుకున్నాయని, ఉల్లిగడ్డ రూ.50కి చేరుకుందన్నారు మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగిన కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించి, బ్లాక్‌మార్కెట్, దళారులను నియంత్రించాలని డిమాండ్ చేశారు లేకుంటే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, జిల్లా నాయకులు కొట్టిపాక రవి, రాసమల్ల దీనా, కామెర వెంకటరమణ, కండె నర్సయ్య, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమించిన జూడాలు

వరంగల్ మెడికల్, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్లు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. వెంటనే సమ్మెను విరమిస్తున్నట్లు వైద్యుల సంఘం బుధవారం ప్రకటించింది. హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే రూ.204.85కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. ఉస్మానియాకు రూ.121కోట్లు, గాంధీకి రూ.79కోట్లు, కాకతీయ వైద్య కళాశాలకు రూ.6కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గురువారం ఉదయం నుంచి ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సేవలు అందించే అవకాశం ఉంది.

## యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్

- సమష్టి కృషితోనే మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట
- అదనపు కలెక్టర్ రాధికగుప్తా



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు

సుబేదారి, జూన్ 26: మాదక ద్రవ్యాల వ్యసనం యువతను నిర్వీర్యం చేస్తోందని, మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్టు వేయడానికి సమష్టి కృషి అవసరమని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని అదాలత్‌సెంటర్ ట్రాఫిక్ కూడలి వద్ద జెండా ఊపి ఆమె ప్రారంభించారు. కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన రాధిక గుప్తా మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు చాక్లెట్, బిస్కెట్ రూపంలో పాఠశాలలు, కళాశాలల సమీపంలోని షాపుల్లో విక్రయిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వీటిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అప్రమత్తం చేయాలని ఆమె పేర్కొన్నారు. దేశ సంపదగా భావించే యువత పార్టీల పేరుతో సరదాగా మత్తుపదార్థాలను సేవించి వాటికి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. యువ శక్తి ముందు ఏది సాటి రాదని, యువత తలుచుకుంటే ఉన్నత స్థానాల్లో ఉంటారని చెప్పారు. కన్నతల్లిదండ్రుల కలలను సాకారం చేయాలంటే ఉన్నత విద్యతో పాటు ఉన్నత ఆశయాలతో బతకాలని సూచించారు.

అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉన్నదని అన్నారు. మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీసు శాఖకు తెలియజేయాలని టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ విభాగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ రాష్ట్ర పాలక వర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, డీసీపీ సురేష్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, ఏసీపీలు కొత్త దేవేందర్‌రెడ్డి, తిరుమల్‌రావు, నందిరాం నాయక్, సీఐలు దుర్గా భవాని, సత్యనారాయణ, డి.సురేష్, రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్ పాషా, డెమో అశోక్‌రెడ్డి, డాక్టర్లు ఉమశ్రీ, ప్రహసిత్, అహ్మద్, డీపీవో ముంజెం రాజు, ఇన్‌చార్జి డీసీపీవో సౌరం ప్రవీణ్ కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, హెల్పింగ్ అండ్ సంస్థ రాము, న్యూవిజన్ ఆల్కహాల్ అండ్ డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ డైరెక్టర్ ఎ. సురేందర్‌రావు, ఎఫ్‌ఆర్‌వో రవికృష్ణ, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, ప్రొఫెసర్ రవి కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసి మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై దిష్టి బొమ్మను దహనం చేశారు.



ఎమ్మెల్సీ మల్లన్న, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిలను సన్మానిస్తున్న టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్26: ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో తన విజయంలో టీఎన్‌జీవోల పాత్ర కీలకమన్నారు. హనుమకొండ జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ అలంకార్ జంక్షన్ లోని టీఎన్‌జీవోస్ భవనంలో బుధవారం రాత్రి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలను గజమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. ప్రశ్నించే గొంతుకగా ఉంటూ ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల ఓట్లతో గెలిచిన తాను.. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చేస్తానన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌తోనే తన గెలుపు ఖాయమైందని, ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కడిపికొండ దగ్గర ఉన్న ఉద్యోగుల స్థల పరిష్కారానికి కృషి చేసి కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నను ఉద్యోగుల ప్రతినిధిగా భావిస్తున్నామని, తమ సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కడిపికొండలో ఉన్న ఉద్యోగుల స్థలాల సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, సారంగపాణి, మోయిజ్, లక్ష్మీప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, కార్యదర్శి చైతన్య, మహబూబాబాద్ కార్యదర్శి నాగరాజు, జిల్లా నేతలు సలీం, చీకటి శ్రీనివాస్, రాజమౌళి, రాజ్యలక్ష్మీ, సురేష్, పావని, యమున, ఇందిరా, ప్రియదర్శిని, రజిత, రాజమణి, శ్రీలతతోపాటు పెద్ద సంఖ్యలో టీఎన్‌జీఓస్ యూనియన్‌కు సంబంధించిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## మళ్లీ పైప్‌లైన్ లీకేజీ

- పోచమ్మమైదాన్‌లో ఇళ్ల మధ్య నుంచి ప్రవహించిన తాగునీరు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు మేయర్ ఆదేశాలు



పైప్‌లైన్ లీక్ అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సుధారాణి



లీక్ అయిన చోట ధ్వంసమైన రోడ్డు



పైప్‌లైన్ లీకై కాలనీలలోకి ప్రవహిస్తున్న తాగునీరు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 26: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అలసత్వం, కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం వల్ల మంచి నీరు ప్రవహించే పైపులైన్ లీకైంది. దీంతో ఐదు కాలనీల వాసులకు సరిపడే తాగునీరు బుధవారం వృథాగా పోయింది. గతంలో పోచమ్మమైదానం జంక్షన్ దేశాయిపేట రోడ్డులో కాంట్రాక్టర్ వేసిన పైప్‌లైన్ పగిలిపోయి చాలా రోజులుగా నీరు వృథాగా పోయింది. దీనిపై స్థానిక ప్రజలు గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్పందించి మరమ్మతు పనులు చేయాలని ఆదేశించారు. రూ.8లక్షలకు పనులు చేయాలని ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో ఈ నెల 23న పోచమమ్మ మైదాన్‌లో పైప్‌లైన్ లీకేజీ పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ మూడు రోజుల పాటు పైప్‌లైన్ పనులను చేశాడు. అయితే ముందు ఉన్న పైపులను గమనించకుండా పగిలిన పైపులనే అతికించి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నట్టు స్థానిక ప్రజలు చెప్పుకొచ్చారు. బుధవారం సాయంత్రం నల్లా నీరు వదలడంతో మరమ్మతు చేసిన పైప్‌లైన్ పక్క నుంచి ఒక్కసారిగా నీరు బయటకు చిమ్మింది. రోడ్డుపైకి నీరు కాలనీలలో ప్రవహించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యాయి. అధికారుల అవగాహన లోపంతోనే లీకేజీలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి పైపులు మరమ్మతు చేసేందుకు మరో రెండు రోజులు పడుతుందని, అప్పటివరకు నీళ్ల బంద్ అవుతాయని పేర్కొంటున్నారు. కాగా, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ నుంచి పోచమ్మమైదాన్ వరకు పాత పైపులైన్ వేసి ఉండడంతో తరుచుగా నీరు లీకేజీ జరుగుతోందని బల్దియా ఇంజనీరింగ్ డీఈ రంగారావు పేర్కొన్నారు. ఈ లైన్‌లో రెండు వాల్వ్‌లు మాత్రమే ఉండడంతో గాలి ఒత్తిడికి పైపులలో లీకేజీ అవుతోందన్నారు. వీటి మరమ్మతుకు మరో రెండు రోజులు నీటి సరఫరా బంద్ అవుతుందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయండి : మేయర్**

వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతంలో ప్రధాన పైప్‌లైన్ లీకేజీకి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను సూచించారు. బుధవారం పోచమ్మమైదాన్ సమీపంలోని ప్రధాన పైప్‌లైన్ నుంచి లీకేజీ జరిగిన ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి పోచమ్మమైదాన్ వరకు 1982 సంవత్సరంలో వేసిన పైపులు కావడం వల్ల తరుచుగా లీకేజీలు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో కొత్త వాల్వ్ వేసి నీటిని వదిలిన క్రమంలో మరో చోట పైప్‌లైన్ లీకేజీ జరిగిందన్నారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ నుంచి పోచమ్మమైదాన్ వరకు కొత్త పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. మేయర్ వెంట డీఈలు రంగారావు, రవీందర్‌లతో పాటు ఏఈ సతీష్ ఉన్నారు.

# ‘ఓవర్ లోడ్’ వసూళ్లు!

● ఆర్టీఏ అధికారుల చేతివాటం ● ఓవర్ లోడ్ లారీ పట్టుబడితే వేలల్లో వసూళ్లు ● ఏజెంట్ ద్వారా నెలవారీ మామూళ్లు

వరంగల్ క్రైం, జూన్ 26: రవాణా శాఖలో ఓవర్ లోడ్ దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల వారిగా ఇసుక లారీ ఒకంటికి రూ.5,500 చొప్పున తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్నాయి. శాఖ అధికారులు ఓవర్ లోడ్ పేరిట పెద్ద ఎత్తున లాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్, వరంగల్ నగరంలో పెద్ద ఎత్తున నిర్మాణాల జరుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. రెండు పెద్ద నగరాలకు భద్రాచలం, కాళేశ్వరంనుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక లారీల యజమానులకు టన్నుకు రూ.600 మేరకు ఖర్చు అవుతుండగా, మార్కెట్‌లో రూ.1400కు విక్రయిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 12 టైర్ల లారీలో 27టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నులు, 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంటుంది. దీనికి మించి లారీల్లో ఇసుక తరలించకూడదు. కానీ లారీల యజమానులు ఇసుక నింపుకునే ప్రాంతంలో ఉన్నవారికి ఎంతోకొంత జేబులో పెట్టి అదనంగా నాలుగు నుంచి ఐదు టన్నులు తీసుకువస్తుంటారు. రవాణా శాఖ అధికారులు లారీల తనిఖీలు నిర్వహించి ఓవర్‌లోడ్ లారీలకు టన్నుకు రూ.5వేల చొప్పున పెనాల్టీ వేయాల్సి ఉంటుంది. కాని దీనికి బిన్నంగా అధికారులు ప్రవర్తిస్తూ లారీ సీజ్ చేస్తామనే బెదిరింపులకు గురి చేసి నోటికి వచ్చినంత వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. రూ.20వేల నుంచి 50వేల వరకు వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి.

నెలవారి మామూళ్ల తీసుకుంటున్న రవాణా శాఖ అధికారులు.. రోజువారి తనిఖీల్లో భారీగానే మూటగట్టుకుంటున్నట్లు సమాచారం. భద్రాచలం, కాళేశ్వరం నుంచి హనుమకొండకు రోజుకు 500కు పైగా లారీలు, హైదరాబాద్‌కు వెయ్యికి పైగానే వెళుతున్నట్లు తెలిసింది. 90శాతం లారీలు ఓవర్ లోడ్‌తోనే వస్తుంటాయని సమాచారం. ఈ లెక్కన రవాణా శాఖ అధికారుల సంపాదన ఏమేరకు ఉంటుందో ఊహించుకోవచ్చు.


ఇసుక లారీలు

### మధ్యవర్తిగా ఒక ఏజెంట్

రవాణా శాఖలో ప్రైవేటు ఏజెంట్ల హవా కొనసాగుతుందనే విషయం తెలిసిందే. వసూళ్ల కోసం అధికారులు కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. చేతికి మట్టి అంటకుండా ఈ ఏజెంట్లు వసూలు చేస్తారనే విమర్శలున్నాయి. వసూళ్ల కోసం వింగ్‌ల వారిగా నమ్మకమైన ప్రైవేటు ఏజెంట్లు ఉండగా, ఓవర్ లోడ్ వసూళ్లకు ఒక జెమ్ ఏజెంట్ ఉన్నట్లు తెలిసింది. ప్రతి లారీ ఓనర్ వద్ద ఏజెంట్ నంబర్ ఉన్నట్లు సమాచారం. లారీని అధికారులు పట్టుకుంటే వెంటనే యజమాని ఏజెంట్‌కు ఫోన్ చేస్తే పని చక్కదిద్దుతాడని తెలిసింది. అధికారులకు, లారీ యజమానులకు మధ్యవర్తిగా చర్చలు జరిపి లెక్క తేలుస్తాడని సమాచారం. మధ్యవర్తిగా వ్యవహరించే ఏజెంట్ పెద్దఎత్తున సంపాదించినట్లు తెలిసింది. శాఖ అధికారులకు నమ్మకమైన ఏజెంట్లలో ఈ జెమ్ ఒకరని అధికారిక సమాచారం. కొంతమంది అధికారులు వారి ప్రైవేటు డ్రైవర్లతో దందా కొనసాగిస్తున్నప్పటికీ ఏజెంట్ ప్రధాన భూమిక పోషిస్తాడనే ప్రచారం ఉంది.


ప్లాంటేషన్ పనుల వద్ద నుంచి పోడు రైతును లాక్కెళ్తున్న అటవీ సిబ్బంది

# ప్లాంటేషన్ పనుల అడ్డగింత

అధికారులు, పోడు రైతుల మధ్య వాగ్వాదం
గూడూరు మండలం నాయకపల్లి, బొల్లేపల్లి అటవీప్రాంతంలో ఉద్రిక్తత

గూడూరు, జూన్ 26 : అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ కోసం చేస్తున్న భూమి చదును పనులను పోడు రైతులు అడ్డుకునే ప్రయత్నం చేసిన సంఘటన గూడూరు మండలం నాయకపల్లి-బొల్లెపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. మూడు రోజులుగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతుండగా బుధవారం ప్లాంటేషన్‌లో నాటేందుకు మొక్కలను ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పోడు రైతులు ప్లాంటేషన్ పనులు జరుగుతున్న ప్రదేశానికి చేరుకున్నారు. తాము అనేక ఏళ్లుగా పోడు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ భూమిలో ప్లాంటేషన్ పనులు చేపడితే తమకు జీవనోపాధిపాధి ఉండదని అటవీశాఖ అధికారుల వద్ద పోడు రైతులు మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో వారు ప్లాంటేషన్‌పనులు చేపట్టవద్దని ఓ దశలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. బొల్లెపల్లిలో కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని సంబంధిత అధికారులు హక్కుపత్రాలు ఇచ్చారని పోడు రైతులు ఆరోపించారు. ఈ క్రమంలో వాగ్వాదానికి దిగిన పోడు రైతులను జీపు ఎక్కించేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది.

### ఏ ఒక్కరికీ హక్కుపత్రాలు లేవు : జోత్స్నదేవి, రేంజ్ అధికారి

ప్లాంటేషన్ పనులు జరిగే అటవీ భూవికి సంబంధించి ఏ ఒక్క పోడు రైతుకు హక్కుపత్రాలు లేవని మహబూబాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారి జోత్స్నాదేవి తెలిపారు. అక్రమ పోడు సాగును నివారిస్తామని పేర్కొన్నారు. అటవీ భూములను రక్షించి ప్లాంటేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. హక్కుపత్రాలు ఉంటే తమకు చూపిస్తే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. డబ్బులు తీసుకుని హక్కుపత్రాలు ఇచ్చేందుకు సహకరించారని నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. తగిన ఆధారాలు ఉంటే తమకు చూపించాలన్నారు. ప్లాంటేషన్ పనులకు సహకరించాలని కోరారు.

## 10మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి

వరంగల్ క్రైం, జూన్ 26: వరంగల్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 10మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదిమందిలో ఆరుగురిని మహబూబాబాద్ జిల్లాకు, నలుగురిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించడం జరిగింది. పదోన్నతి పొంది మహబూబాబాద్ జిల్లాకు కేటాంచబడిన వారిలో ఎండి.నజీర్, సీహెచ్.అమరేందర్‌రెడ్డి, జి.రమేశ్, ఎంకె.బేగ్, కె.సారంగపాణి, ఎస్.భీమారెడ్డి కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జి.భీమా, కె.సుబ్బారావు, ఎండి.యాకూబ్, పి.కొమురయ్యలను కేటాయించడం జరిగింది.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మసాగర్, జూన్ 26 : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో కరీమ్ (30) అనే వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మునిపల్లికి చెందిన కరీమ్ స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మునిపల్లికి బయలు దేరాడు. ఈక్రమంలో కరుణాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహనం వచ్చి కరీమ్ వాహనాన్ని ఢీకొనడంతో కరీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కరీమ్ అవివాహితుడని తెలిపారు.

## సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను కలిసిన రాకేష్‌రెడ్డి

రాంనగర్, జూన్ 26: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో లక్ష్మీనారాయణను కలిసిన రాకేష్‌రెడ్డి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపు, ఓటమితో సంబంధం లేదని రాజకీయాల్లో ఆదర్శంగా నిలవాలని, విద్యావంతులు, నిజాయితీపరులు రాజకీయాల్లోకి రావాలని ఆయన తెలిపినట్లు రాకేష్‌రెడ్డి తెలిపారు.



## నేటి నుంచి వచ్చేనెల 6 వరకు పలు రైళ్ల రద్దు

కాజీపేట, జూన్ 26: కాజీపేట- బల్లార్ష సెక్షన్‌లో అసిఫాబాద్ - రెచ్నీ స్టేషన్‌ల మధ్య మూడోలైను నిర్మాణం కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12757) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ ఈ నెల 27 నుంచి జూలై 6 వరకు రద్దు చేశారు. (22151) పూణే - కాజీపేట మధ్య నడిచే పూణే ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ ఈ నెల 28 నుంచి జూలై 5 వరకు రద్దు చేశారు. (12724) న్యూఢిల్లీ నుంచి సికింద్రాబాద్‌ల మధ్య నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి జులై 6 వరకు సికింద్రాబాద్ కాజీపేట జంక్షన్‌ల మధ్య మాత్రమే నడిపించనున్నారు. ఇదే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ జూలై 3, 4, 5, తేదీలలో ముద్ఖేడ్, నిజామాబాద్ మీదుగా దారిమళ్లించి నడిపించనున్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, కాజీపేట జంక్షన్‌ల మీదుగా రద్దు చేశారు.

## ఎంజీఎంలో విద్యుత్ అంతరాయంతో మా శాఖకు సంబంధం లేదు: ఎస్ఈ

హనుమకొండటౌన్, జూన్ 26: ఎంజీఎంలో తరుచుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయంతో విద్యుత్‌శాఖకు ఎలాంటి సంబంధం లేదని వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న అంతర్గత కేబుళ్లలో వచ్చే సమస్యలతో అంతరాయం ఏర్పడుతోందని, విద్యుత్‌శాఖ సబ్ స్టేషన్ నుంచి నిరంతరాయంగా ఎంజీఎంకు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. 24గంటల పాటు విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని తెలిపారు.

## త్వరలోనే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ నియామకాలు

హనుమకొండ టౌన్, జూన్ 26: గత సంవత్సరం జూన్‌లో నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల నియామక ప్రక్రియను త్వరలోనే చేపట్టనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ జాయింట్ సెక్రెటరీ కె.రమేశ్ తెలిపారు. 100 పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి నియామకాలు చేపడుతున్న సమయంలో ఆరుగురు అభ్యర్థులు నోటిఫికేషన్‌పై హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తీసుకురాడంతో పోస్టుల భర్తీ మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఆరు పోస్టులను పిటిషనర్ సంబంధిత సర్కిల్‌లో, ఖాళీ లేకపోతే పక్క సర్కిల్‌లో రిజర్వు చేసి తాత్కాలికంగా ఆరు పోస్టుల నియామక ప్రక్రియను నిలిపివేసి, మిగతా 94 పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకుందని, త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

## త్వరలో ఐటీ పార్క్‌లో మా కంపెనీ ప్రారంభిస్తాం..

వరంగల్ క్రైం, జూన్ 26: త్వరలో మడికొండ ఐటీ పార్క్‌లో కంపెనీని ప్రారంభిస్తామని ఎథిరాం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు అరుణ్ కుమార్ రాపోలు ఒక ప్రకటనలో తెలిపారు. తమకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది తన ఎదుగుదలను ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఇస్తానని, కంపెనీలో షేర్ ఇస్తానని తాను ఎవరినీ మోసం చేయలేదన్నారు. తాను ఎవరికీ డబ్బులు ఇచ్చేది లేదన్నారు. తాను తప్పు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. తాను ఎక్కడికి పారిపోలేదని, కంపెనీ పనులు చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా తనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆపాలని అరుణ్‌కుమార్ సూచించారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కేయూ రిజిస్ట్రార్ హాజరు

కేయూ క్యాంపస్, జూన్ 26: కాకతీయ యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఇచ్చిన నోటీసుల మేరకు గురువారం న్యూఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి హాజరయ్యారు. తనకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని, అలాగే అడ్మినిస్ట్రేటివ్ పదవులు ఇవ్వకుండా దాటవేస్తున్నారని ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్‌ను హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. దీంతో వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ హాజరయ్యారు.

## గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

## కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్‌ఆర్‌ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్‌ఆర్‌ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

## రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

## పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

## అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

## మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

## మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

## స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

## ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

# మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

## కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల**

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

# ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి




గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదా యం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

**నా కష్టంమ్మీద నేను ఎదిగా**

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

## ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

# మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

## కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

**కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత**

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

## 6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలి వెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

# డ్రైవింగ్‌లో స్వీయ నియంత్రణ పాటించాలి

**డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్**



హసన్‌పర్తి, జూన్ 26: వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు స్వీయ నియంత్రణ పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. బుధవారం అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ రెగ్యులేషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 యేళ్ల లోపు విద్యార్థులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, రోడ్డు సేఫ్టీ నియమాలను, హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులచే రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రవిం దర్, ట్రాఫిక్ సర్క్యులర్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎంఏ శుక్రు, ఎంవీఐ బి.కిషోర్‌బాబు, ఎస్సైలు మనోజ్‌రెడ్డి, వేణు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# యోగా గురువుకు కలెక్టర్ అభినందన



ఇల్లందకు చెందిన పోశాల శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేట రూరల్, జూన్ 26: మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన యోగా గురువు పోశాల శ్రీనివాస్‌ను బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అభినందించారు. శ్రీనివాస్ యోగాలో అందిస్తున్న విశేష సేవలను గుర్తించి వరల్డ్ రికార్డ్ యూనియన్ సంస్థ యోగాలో వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్‌ను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా సుమారు 160 గ్రామాల్లో 2,50,000 మందికి యోగాలో శిక్షణ ఇస్తూ, అనేక సామాజిక, సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు.

# సీఎం రాకకు ముస్తాబవుతున్న నగరం

- రోడ్ల వెంట పిచ్చిమొక్కలను తొలగింపు
- 2,800 మంది పారిశుధ్య సిబ్బందితో పనులు



కొత్తబస్‌స్టేషన్ ప్రాంతంలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న వాహనాలు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 26: వరంగల్ నగరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 28న వరంగల్ నగరానికి ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి చొరవతో నగరాన్ని శుభ్రం చేస్తున్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ ఆధ్వర్యంలో నగరంలో 66 డివిజన్‌లలో సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు, పారిశుధ్య కార్మికులతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, గట్టి, ప్లాస్టిక్ చెత్తను శుభ్రం చేస్తున్నారు. రాంపూర్, మండికొండ, కడిపికొండ, కాజీపేట, హనుమకొండ, వరంగల్, వెంకట్రామా జంక్షన్, గొర్రెకుంట వరకు శానిటేషన్ సిబ్బంది పనులు చేస్తున్నారు. ప్రధానంగా రోడ్లు శుభ్రం చేయడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, డివైడర్ల మధ్యలో ఉన్న చెత్తను తొలగించడంతో పాటు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాల్వపై మొలిచిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్నారు. డ్రైనేజీల నుంచి తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తరలిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి కట్టిన కట్టడాలను సైతం తొలగిస్తున్నారు. నగరాన్ని సుందరీకరణ దిశగా తీర్చిదిద్దుతున్నామని కుడా అధికారులు వెల్లడించారు.

# ఇళ్ల మధ్యలోని గెస్ట్‌హౌస్ సీజ్

**'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన బల్దియా యంత్రాంగం**



ఎల్బీ నగర్‌లో ఏఎస్ గెస్ట్‌హౌస్‌ను సీజ్ చేస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూన్ 26: ఇళ్ల మధ్యలో ఉన్న గెస్ట్ హౌస్‌ను బల్దియా అధికారులు యుద్ధప్రాతిపదికన సీజ్ చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇళ్ల మధ్యలో గెస్ట్‌హౌస్..?' అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో బల్దియా అధికారులు, సిబ్బందిలో కదలిక వచ్చింది. ఉదయాన్ని ఎల్బీనగర్ సమీపంలోని టెలికామ్‌కాలనీకి సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్‌తోపాటు జవాన్లు చేరుకుని గెస్ట్‌హౌస్ నిర్వహణకు సంబంధించిన ఆధారాలు అడిగారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో గెస్ట్‌హౌస్‌ను సీజ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. అనుమతులు పొందే వరకు గెస్ట్‌హౌస్‌లో ఇంటిని కూడా ఎవరికీ అద్దెకు ఇవ్వకూడదని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ మాట్లాడుతూ.. ఇళ్ల మధ్యలో గెస్ట్‌హౌస్ నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్నారనే ఫిర్యాదు, వార్తా కథనం వల్ల పురపాలిక చట్టం 2019 సెక్షన్ 264 ప్రకారం సీజ్ చేశామన్నారు. అనుమతులతో పాటు కనీసం ట్రేడ్ లైసెన్స్ కూడా లేదన్నారు.

# కేయూకు పాలకమండలి, వీసీలను నియమించాలి

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతి**



వేం నరేందర్‌రెడ్డికి వర్సిటీ సమస్యలను విన్నవిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, జూన్ 26: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలితో పాటు వైస్‌చాన్స్‌లర్ నియమాకం కోసం వెంటనే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని అకూట్ అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కిశోర్‌కుమార్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని వేం నరేందర్ నివాసంలో కలిసి అకూట్ బాధ్యులు వినతి పత్రాన్ని అందచేసి వర్సిటీలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. వర్సిటీల్లో 15 ఏళ్లుగా టీచర్ల నియామకాలు చేపట్టలేదని, అనేక మంది ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ చేస్తున్నారని పేర్కొన్నారు. కేయూలో 400మంది రెగ్యులర్ టీచర్లకు ప్రస్తుతం 83 మంది ఉన్నారని, చాలామంది డాక్టరేట్‌లు పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్నారని వివరించారు. వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలని అన్నారు. రిక్రూట్‌మెంట్‌తో వర్సిటీలను కాపాడాలని విన్నవించారు. ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం నేతలు, బాధ్యులు పాల్గొన్నారు.

# నేటి ధర్నాను విజయవంతం చేయాలి..

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య**



నినాదాలు చేస్తున్న మునిసిపల్ కార్మికులు

హనుమకొండ చౌరస్తా, జూన్ 26: మునిసిపల్ కార్మికులకు వేతనాలు, ఇతర హక్కులను కల్పించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నాను మునిసిపల్ కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయ సమీపంలో 9, 10 డివిజన్ల మునిసిపల్ కార్మికులతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడంతోపాటు రూ.26వేల కనీస వేతనం, చనిపోయిన మునిసిపల్ కార్మికుడి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలనే డిమాండ్‌తో నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో మునిసిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నూతన పీఆర్‌సీలో కనీస వేతనాలను నిర్ణయించాలి

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య**



మలేరియా విభాగం వార్డు ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వడ్డేపల్లి, జూన్ 26: నూతన పీఆర్‌సీలో రూ.26వేల కనీస వేతనాలను కార్మికులకు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ మలేరియా విభాగం వార్డు ఆఫీస్ ఎదుట బుధవారం మునిసిపల్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తేలూరి ఉప్పలయ్య మాట్లాడుతూ.. మునిసిపల్ మలేరియా విభాగంలో పనిచేస్తున్న వారిని సీజనల్ కార్మికులుగా పరిగణిస్తూ అతితక్కువ వేతనాన్ని చెల్లిస్తున్నారని అన్నారు. మలేరియా మునిసిపల్ కార్మికులకు రూ.15,600 వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా మలేరియా విభాగంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ ధర్నాలో మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, మలేరియా విభాగం నేత నద్దునూరి రాజేష్‌ఖన్నా, ఎల్లేష్, మలేరియా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిత్యావసరాల ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



మడికొండలో ధరల పెరుగుదలపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మడికొండ, జూన్ 26: నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం మడికొండలోని ఖందాల దాబా వద్ద త్రాసులో ఓవైపు కూరగాయలు, మరోవైపు డబ్బులు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భిక్షపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వంద రోజుల్లో నిత్యావసర ధరలు నియంత్రించి బ్లాక్ మార్కెట్ చేసే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇచ్చిన హామీ నీటి మూటగా మారిందని ఎద్దేవా చేశారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా సామాన్యులు సరుకులు కొనలేక రెండుపూటలా తిండి తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. యుద్ధప్రాతిపదికన వాణిజ్య పంటలతోపాటు కూరగాయలను పండించేందుకు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భిక్షపతి తెలిపారు.

కార్యక్రమంలో మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాసమల్ల దీన, కొట్టపాక రవి, రాజమణి, సుమన్, స్వరూప, ఐలయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలో 21 మందికి అవకాశం



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ మల్లయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 26: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 21మంది అభ్యర్థులకు రెండు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు దక్కినట్లు జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ అధికారి ఎం.మల్లయ్య చెప్పారు. బుధవారం ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చిందన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఉపాధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఆలయాల్లో తీన్మార్ మల్లన్న పూజలు



వేయిస్తంభాల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హనుమకొండ కల్చరల్, జూన్ 26: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు సాదరంగా ఆహ్వానించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో ఆయనచే ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి చారిత్రక కట్టడాలు పురాతన ఆలయాలతో ఓరుగల్లు నగరం, దాని సంస్కృతి విరాజిల్లుతుందన్నారు. 20 యేళ్ల తర్వాత కల్యాణ మండప పనులు పూర్తయి సందర్శకులకు కనువిందు చేస్తుండటం గొప్ప అనుభూతిని కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయం పక్షాన సీనియర్ అసిస్టెంట్ గోధుమల ప్రేమ్, గంగు ఉపేంద్రశర్మతోపాటు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, బోడ డిన్నా, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- ధర్మసాగర్: ధర్మసాగర్ మండలంలోని కరుణాపురంలో బ్రదర్ పాల్సన్ రాజ్‌ను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. ఈ సందర్భంగా పాల్సన్‌రాజ్ తీన్మార్ మల్లన్నను శాలువతో సన్మానించారు. అనంతరం మల్లన్నకు పాల్సన్ రాజ్, బ్రదర్ ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వాచనాలు అందించారు. మందిరానికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తామని ఆయన తెలిపారు.
- కాజీపేట టౌన్: కాజీపేట దర్గాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్ అబూబకర్, పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

### తీన్మార్ మల్లన్నకు సన్మానం

కేయూ క్యాంపస్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం కేయూ క్యాంపస్‌కు వచ్చారు. తనకు ఓటు చేసి గెలిపించిన పట్టభద్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ లైబ్రరీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థి నాయకులు తీన్మార్ మల్లన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న నాయక్, డాక్టర్ గజ్జల మల్లేశ్, డాక్టర్‌మంద వీరాస్వామి, అలవాల కార్తీక్, సురాశి కృష్ణ, తీగల ప్రేమ్‌కుమార్, మట్టెడ కుమార్, మేడారపు సుధాకర్, తాళ్లపల్లి నరేశ్‌గౌడ్, బండి శ్రీను, భీమా వినయ్‌కుమార్, బొట్ల మనోహర్, అరేగంటి నాగరాజు, మహ్మద్‌పాషా, అజ్మీర సునీల్‌నాయక్, వంగాల వర్షిత్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

- హనుమకొండ హరిత హోటల్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ వాసం శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుంకరి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నల్లాని శ్రీనివాస్, ములుగు జిల్లా అధ్యక్షుడు పిన్న మహేందర్, ములుగు జిల్లా అధ్యక్షుడు మోతుకూరి రాజయ్య, నీలారపు శ్రీనివాస్, పల్లె వంశీ తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నకు సన్మానం చేస్తున్న దృశ్యం

# మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 26: మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలను సర్వనాశనం అవుతాయని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ కంది శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాల ప్రార్థన సమయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సత్ప్రవర్తనతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, మనోహర్, వేణుగోపాల్, స్వామి, సమ్మిరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



డ్రగ్స్ నిర్మూలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

వేలేరు (ధర్మసాగర్), జూన్ 26: డ్రగ్స్ నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని వేలేరు కేజీబీ బాలికల పాఠశాల ఎస్‌వో స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే నష్టాలను, అనర్థాలను బాలికలు నాటకరూపంలో ప్రదర్శించారు. పాఠశాలలోని ఈ సందర్భంగా వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్‌వో స్రవంతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ విజేత కెమెరామెన్స్ జట్టు



జర్నలిస్ట్ క్రికెట్ మ్యాచ్ ఫైనల్లో విజేతగా నిలిచిన కెమెరామెన్స్ జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 26: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో కెమెరామెన్స్ జట్టు, యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య కొనసాగిన ఫైనల్స్‌లో కెమెరామెన్ జట్టు విజయకేతనం ఎగరవేసి ట్రోఫీని కైవసం చేసుకొంది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్-2024లో భాగంగా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ ఫైనల్ పోటీలను వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి ప్రారంభించారు. ఇందులో కెమెరామెన్స్ జట్టు గెలుపొంది ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, కమిటీ బాధ్యులు, బ్యూరోస్, స్టాపర్స్, సీనియర్ జర్నలిస్టులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# సీటీఐని సందర్శించిన మార్నేని



కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సందర్శనలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 26: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్‌ను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బుధవారం సందర్శించారు. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్రీనివాసరావు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతోపాటు డీసీసీ బ్యాంక్‌ల చైర్మన్‌లకు స్వాగతం పలికారు. ఇనిస్టిట్యూషన్‌లో జరిగే శిక్షణ తరగతుల వివరాలను రవీందర్‌రావు అడిగి తెలుసుకున్నారు.

# నేరాల నియంత్రణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి

హనుమకొండ టౌన్, జూన్ 26: మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ సుజాత అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులు ఈవ్ టీజింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రధానంగా అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాలాంటి సోషల్‌మీడియాలో వ్యక్తిగత ఫొటోలను షేర్ చేయడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ఇతరుల నుంచి ఇబ్బందులకు గురైనప్పుడు షీటీమ్ వాట్సాప్ 87126 85142, 87126 85270 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకుంటే ప్రారంభదశలోనే సమస్యలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఏఎస్సై వేణుగోపాల్, హెడ్‌కానిస్టేబుల్ బుచ్యా నాయక్, మహిళా కానిస్టేబుల్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
# నవ్య
కుటుంబ కదంబం
గురువారం ● 27 జూన్ 2024



గంజి పట్టించి, ఇస్త్రీ చేయనిదే కాటన్ చీరలను కట్టుకోలేం అనుకునే రోజులు పోయాయి.
పైగా కాటన్ చీరలు వేసవికే పరిమితమనే భావన కూడా అంతరించింది. అన్ని చీరల్లాగే నచ్చినప్పుడు కట్టుకునేలా ఇప్పుడెన్నో రకాల కాటన్ చీరలు అందుబాటులోకొచ్చాయి. వాటిలో చెప్పుకోదగినవి 'గబ్రు' చీరలు. వాటినొకసారి చూసేద్దామా!

# 'గబ్రు'లో గమ్మత్తుగా..

ఫ్యాషన్



**హ్యాండ్** ప్రింట్ గబ్రు కాటన్ చీరల మూలాలు రాజస్థాన్‌లో ఉన్నాయి. ఈ సంప్రదాయ రాజస్థానీ పద్ధతి తరతరాలుగా మహిళలను అలరిస్తూనే ఉంది. సహజసిద్ధ రంగులతో ఆకట్టుకునే డిజైన్లను అద్దే ఈ గబ్రు కళ నేటికీ ప్రపంచవ్యాప్త పర్యాటకులను ఆకర్షిస్తూనే ఉంది. గబ్రు హ్యాండ్ ప్రింట్ కాటన్‌లో మెటీరియల్స్ చీరలు రెండింటికీ మంచి ఆదరణ ఉంది. వెలసిపోని రంగులు, డిజైన్లను కలిగి ఉండే గబ్రు చీరలు సాదాసీదా కాటన్ చీరల్లా నాలుగైదు ఉతుకులకే వెలసిపోయి, చీకిపోకుండా ఎక్కువ కాలం మన్నడం వల్ల కూడా మహిళలు వీటిని క్యాజువల్ వేర్‌గా ఎంచుకుంటూ ఉంటారు.

### సొగసులీనుతూ...

గబ్రు చీరల్లో రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం కోసం కొన్ని ఫ్యాషన్ చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

- సింపుల్‌గా, హుందాగా కనిపించాలంటే, తేలిక రంగులు, చిన్న డిజైన్లు, సన్నని బార్డర్లు కలిగి ఉండే బగ్రు చీరలనే ఎంచుకోవాలి. ఇలాంటి చీరలు ఆఫీస్ వేర్‌గా కూడా చాలా బాగుంటాయి.
- స్నేహితులతో సరదాగా షికారుకు బయల్దేరేటప్పుడు ముదురు ఎరుపు, నీలం, పసుపు కాంట్రాస్ట్ చీరలు బాగుంటాయి. ఫ్యాషన్‌గా కనిపించడం కోసం పొట్టి చేతులు, కాలర్ కలిగిన బ్లౌజ్‌లు లేదంటే స్లీవ్‌లెస్ బ్లౌజులు ఎంచుకోవాలి.
- ఫ్యామిలీ గెట్ టు గెదర్స్‌లో నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే, సింపుల్ జ్యువెలరీతో చీరను మ్యాచ్ చేయాలి.
- మెత్తగా, హాయిగొలిపే గబ్రు చీరల అందమంతా వాటి మీది అద్దకంలోనే ఉంటుంది. రంగులు, ప్రింట్లు వెలసిపోకుండా ఉండడం కోసం వీటిని నీడ పట్టునే ఆరేస్తూ ఉండాలి. తక్కువ వేడి మీద ఇస్త్రీ చేయించుకోవాలి.



హెల్తీ డ్రింక్

## ఈ టీలతో ఆరోగ్య రక్ష

హెర్బల్ టీతో మనసుకు, శరీరానికి సాంత్వన చేకూరడంతో పాటు కొన్ని రుగ్మతలు కూడా అదుపులోకొస్తాయి. కాబట్టి రుగ్మతకు తగిన టీని ఎంచుకుని, తరచూ తాగుతూ ఉండాలి.

### బ్లాక్ టీ

- మధుమేహంతో పాటు హృద్రోగాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి.
- రక్తంలో చక్కెర స్థాయులు స్థిరంగా ఉంటాయి.
- వాపులు తగ్గిస్తుంది.

### గ్రీన్ టీ

- దీన్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- కణాలు ఆరోగ్యంగా పెరగటానికి దోహదపడుతుంది.
- సాంత్వన చేకూరుస్తుంది.

### పెప్పర్‌మింట్

- కఫం బయటికొచ్చేలా చేస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులు తగ్గించేదిగా) పని చేస్తుంది.
- ఆకలిని తగ్గిస్తుంది.

### శొంఠి టీ

- అలర్జీలను తగ్గిస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పని చేస్తుంది.
- ప్రయాణాల్లో తలెత్తే మోషన్ సిక్‌నెస్‌ను నివారిస్తుంది.
- రుచిని పెంచుతుంది.

### దాల్చిన చెక్కటీ

- కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- వైరస్‌లతో పోరాడుతుంది.
- ఆర్థ్రయిటిస్ లక్షణాలను పారదోలుతుంది.




పేరెంటింగ్

## హోమ్‌వర్క్ ఇష్టంగా...

పిల్లలతో హోమ్‌వర్క్ చేయించటానికి తల్లితండ్రులు సతమతమయిపోతూ ఉంటారు. దగ్గరుండి చేయించలేక, ఆ వర్క్ తామే పూర్తి చేసి హమ్మయ్య... అని ఊపిరి పీల్చుకుంటూ ఉంటారు. ఇలా కాకుండా తమంతట తాము పిల్లలే ఇష్టంగా హోమ్‌వర్క్ చేసుకుపోయేలా చేయగల చిట్కాలున్నాయి. అవేంటంటే...

- రోజూ స్కూలు నుంచి ఇంటికి రాగానే హోమ్‌వర్క్ చేయమని బలవంత పెట్టకుండా గంటపాటు పిల్లలని ఆటలాడనివ్వాలి.
- ఆటల తార్వత స్నానం చేయించి, హోమ్‌వర్క్ చేయమని పురమాయిస్తే కొత్త ఉత్సాహంతో ఇష్టంగా చేస్తారు.
- కొందరు పిల్లలకి ఇంట్లో చదవటం, రాయటం నచ్చదు. ఇంట్లో ఉన్నంతసేపు తమకిష్టమైనట్టు ఉండాలని ప్రయత్నిస్తారు. ఇలాంటి పిల్లలకు హోమ్‌వర్క్ చేయమని చెబితే విసుగ్గా చూస్తారు. ఈరోజు స్కూల్లో ఏం చెప్పారు? ఏం రాయించారు? ఆ టీచర్ ఏం చెప్పింది? అని మాటల్లో పెట్టి పుస్తకాలు తీయించాలి.
- అవసరమైతే దగ్గరుండి అనుమానాలను నివృత్తి చేయాలి.
- ఒకసారి సహాయం చేసినా, రెండోసారి వాళ్లంతట వాళ్లే హోమ్‌వర్క్ పూర్తి చేసేలా చూడాలి.
- ప్రతి రోజూ హోమ్‌వర్క్‌కు ఓ సమయాన్ని, స్థలాన్ని కేటాయించి దాన్నే ప్రతిరోజూ అనుసరించేలా చేయాలి.
- ఎప్పుడైనా పిల్లలు హోమ్‌వర్క్ చేయటానికి నిరాకరిస్తే కారణం అడిగి తెలుసుకుని అందుకు తగ్గట్టు స్పందించాలి.
- హోమ్‌వర్క్ చేయటం కూడా ఆటల్లో భాగంగా పిల్లలు ఇష్టంగా చేసే వాతావరణాన్ని కల్పించాలి.



**ట్రాన్స్ మహిళల పట్ల సమాజంలో పాతుకుపోయిన రకరకాల అపోహలకు, దురాభిప్రాయాలకు దీటైన సమాధానం సుబ్బలక్ష్మీ రెడ్డి జీవితం. హైదరాబాద్‌లోని 'కాదంబరి స్టూడియోస్' బోటిక్ యజమానురాలిగా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించారు. ఆమె డిజైన్ చేసిన వస్త్రాలకు సామాన్యుల మొదలు సెలబ్రిటీల వరకు... ఎంతో మంది అభిమానులున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తన అనుభవాలను, జీవిత విశేషాలను 'నవ్య'తో పంచుకున్నారు.**

# మా బతుకు మమ్మల్ని బతకనిస్తే చాలు



"మా కాదంబరీ స్టూడియోస్ బోటిక్‌లో యాభైమందికిపైగా ఉద్యోగులున్నారు. దాని టర్నోవర్ ఏడాదికి నాలుగు కోట్ల రూపాయలు. ప్రతినెలా పదిలక్షల రూపాయల వరకు జీతభత్యాలు చెల్లిస్తాను. లంగా-ఓణీ లాంటి సంప్రదాయ వస్త్రాలను కస్టమర్ల అభిరుచికి తగినట్టుగా సరికొత్తగా డిజైన్ చేయడం మా ప్రత్యేకత. అదీ బడ్జెట్‌లో. అందుకే ఇక్కడి సినిమా, సీరియల్ నటీమణులతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాల్లోని తెలుగువారి నుంచి మాకు ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. మా దగ్గర నుంచి విదేశాలకు వెళ్లే పార్సిల్స్ రోజుకు పదికి తక్కువ ఉండవు. పెళ్లిళ్లు, సీమంతం, పుట్టినరోజు లాంటి వేడుకలు, శుభకార్యాలకు తగినట్టుగా పెన్‌కలంకారీ దుస్తులు, లెహంగాస్, అనార్కలీ సల్వార్ సూట్స్, లాంగ్ ఫ్రాక్‌లు రూపొందిస్తాం. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ చేసిన రకరకాల డిజైన్లలో వస్త్రాలు అందిస్తాం. కాబట్టి మా 'కాదంబరి'ని చాలామంది ఇష్టపడతారు. పెళ్లికుమారుడి సంప్రదాయ దుస్తులు సైతం మా బోటిక్‌లో ఉంటాయి. ఒక డ్రస్సు కుట్టేముందు దాని కలర్ కాంబినేషన్ దగ్గర నుంచి డిజైనింగ్ వరకు... ప్రతిదీ నేనే దగ్గరుండి చూసుకుంటాను. అలా ఇప్పటివరకు కొన్నివందల వెరైటీలు డిజైన్ చేసి ఉంటాను. అవి ఫ్యాషన్ వస్త్ర వ్యాపార సముదాయంలో మాకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఇదంతా నాకు నేనుగా సాధించిందే అయినా, ఒక్కరోజులో సాధ్యపడలేదు. నా కఠోర శ్రమ, సృజనాత్మకతతో పాటు మా ఉద్యోగుల తోడ్పాటు వల్ల అతి చిన్న బోటిక్‌తో ప్రారంభమైన మా వ్యాపారం ఆరేళ్లలో ఒక పరిశ్రమ స్థాయికి ఎదిగింది.

### అది పెద్ద పరీక్షా సమయం...

నేను అబ్బాయిగా పుట్టినా... నాది కాని శరీరంలో నేనున్నానన్న బాధ నన్ను కుదురుగా ఉండనివ్వలేదు. నా లైంగికతకు, సమాజం నన్ను చూస్తున్న తీరుకు మధ్య సంఘర్షణలో నలిగిపోతూ మాటల్లో చెప్పలేనంత మనోవ్యధను అనుభవించాను. ట్రాన్స్‌గా మారే వరకు ఒక రకంగా నరకాన్ని చూశాను. బహుశా... ఇది నాలాంటి వారందరి జీవితానుభవం కూడా కావచ్చు. మాదొక మధ్య తరగతి కుటుంబం. నాన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. అమ్మ ఇంట్లోనే కుట్టు పని చేసేది. నాకు అక్క, అన్నయ్య ఉన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ చదవాలన్నది చిన్నప్పటి నుంచి నా కోరిక. కానీ ఆర్థిక పరిస్థితి అనుకూలించక... పెద్దల ఒత్తిడితో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సరిగ్గా అదే సమయంలో నా అస్తిత్వం బహిర్గతమైంది. నాదైన రూపం మా కుటుంబం కంట పడింది. దాన్ని చూసి వాళ్లు భరించలేకపోయారు. నా అభిమతాన్ని నిరాకరించారు. దాంతో నాకు ఇష్టమైనట్టు బతకడం కోసం ఇంట్లో నుంచి బయటకు వచ్చాను. నిజానికి అది నాకొక పెద్ద పరీక్షా సమయం.

### సుబ్బలక్ష్మిగా మారిన తర్వాత...

ట్రాన్స్‌గా మారతానన్నప్పుడు నన్ను ఎంతగానో ప్రేమించే మా అక్క కూడా అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ట్రాన్స్ మహిళలు అనగానే సెక్స్‌వర్క్ లేదంటే యాచకవృత్తి చేసుకొని బతికేవాళ్లనేది మా కుటుంబ సభ్యుల అభిప్రాయం. నేనలా కానని అన్నాను. "సమాజం వాళ్లను అలానే చూస్తుంది కదా" అన్నారు. అప్పుడు నన్ను నేను నిరూపించుకోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. శారీరకంగా ట్రాన్స్‌గా మారడాన్ని కొద్దిరోజులు వాయిదా వేసి, ఒక ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. ఏడాది వరకు ఉద్యోగం చేసి, ఆ జీతంలో మిగిలించుకున్న కొద్దిపాటి డబ్బుతో 2018లో బోటిక్ ప్రారంభించాను. కొన్నాళ్లకే వ్యాపారం వృద్ధి కావడంతో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఒకరోజు మా సిబ్బందిని పిలిచి... "ఇప్పటి వరకు మీరు చూస్తున్న నేను ఒక అబద్ధం. ఇకమీదట నాదైన రూపంలోకి మారుతున్నాను. మీకేమైనా అభ్యంతరాలున్నాయా?" అని అడిగాను. "మేము మీ సంస్థలో పనిచేస్తున్నాం, అందుకు తగిన జీతం మాకు ఇస్తున్నారు. అంతకుమించి మీ లైంగికతతో, మీ జెండర్‌తో మాకు పనిలేదు. మాకెలాంటి అభ్యంతరం లేదు"అని వారంతా చెప్పారు. ఒక పెద్దాయన "ఇన్నాళ్లు నీలో నా కొడుకును చూసుకున్నాను, ఇకమీదట నువ్వు నా కూతురు అనుకుంటాను" అన్నారు. అదే ప్రశ్న మా ఇంటి ఓనర్‌ను కూడా అడిగాను. ఆమె నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకొని, మరింత ధైర్యాన్ని ఇచ్చారు. సుబ్బలక్ష్మిగా మారిన నాకు ఎన్నడూ సమాజం నుంచి అవమానాలు, ఛీత్కారాలు ఎదురుకాలేదు. ఇదివరకు "అన్నా" అని పిలిచిన వారు ఇప్పుడు 'అక్కా" అని పిలుస్తున్నారు. "సర్" అని సంబోధించేవారు కాస్తా "మేడమ్" అంటున్నారు. మా కస్టమర్లు కూడా నా లైంగికతకన్నా నేను రూపొందించిన డిజైన్లకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉంది.

> చిన్నతనంలో ఇంటా, బయటా, బడిలో... ఇలా ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురికాని ట్రాన్స్ మహిళ ఉండదు. ప్రతి ట్రాన్స్ మహిళ టీనేజీలో శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు లోనైన బాధితురాలే! మా జీవితాల్లోని ఆ పార్శ్వాన్ని పట్టించుకునే వారెవరు? మా బాధకు ఉపశమనం కలిగించే చోటెక్కడుంది? కాలేజీలు, మరీ ముఖ్యంగా అబ్బాయిల హాస్టళ్లలో లైంగికత విభిన్నంగా ఉన్నవారిపై జరిగే హింస మాటలతో చెప్పేది కాదు. ఒకవైపు వేధింపులు, మరోవైపు తామేంటో తమకు తెలియకపోవడం... ఈ మనో వ్యధతో చదువు మీద శ్రద్ధ పెట్టలేక చాలామంది పదో తరగతి, ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు. వారి అస్తిత్వాన్ని కుటుంబం అంగీకరించక పోవడంతో ఇంటి నుంచి బయటకువస్తున్నారు. బతుకుదెరువు కోసం యాచకవృత్తి లేదంటే సెక్స్‌వర్క్ లాంటివాటిని ఆశ్రయిస్తున్నారు.

### అదే నా ప్రత్యేకత...

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చదవని నాకు... దుస్తుల డిజైనింగ్‌లో నాకంటూ ప్రత్యేక గుర్తింపు రావడానికి ప్రధాన కారణం దానిమీద నాకున్న ఆసక్తి మాత్రమే. ఇంట్లో అమ్మ మిషన్ కుట్టడం, క్లాత్ కత్తిరించడం లాంటివి చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను. మా అక్కతో షాపింగ్‌కు వెళ్లినప్పుడు డ్రెస్సుల రంగులు, వాటి మీద డిజైన్లను క్షుణ్ణంగా చూడటం యుక్త వయసులోనే నాకు ఒక వ్యాపకం అయింది. దానికితోడు సినిమాల్లోని కథానాయికల కాస్ట్యూమ్స్‌ను పరిశీలిస్తుండేదాన్ని. బొటిక్ పెట్టాలన్న ఆలోచన నాకు మొదటి నుంచి ఉంది కనుక... ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ లాంటివన్నీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నాను. నాకు మొదటి నుంచి మన సంప్రదాయ వస్త్రాలంటే చాలా ఇష్టం. వాటిని ప్రస్తుత కాలానికి తగినట్టుగా కస్టమర్లు ఇష్టపడేలా డిజైన్ చేయడం మొదలుపెట్టాను. ఒక కొత్తదనాన్ని పరిచయం చేశాను. అది ఇవాళ నన్ను ఈ స్థానంలో నిలబెట్టింది.

### కావాల్సింది గౌరవ మర్యాదలు కాదు...

కాదంబరీ స్టూడియోస్ ఫ్రాంఛైజీ ఇవ్వమని చాలామంది అడుగుతున్నారు. వారందరికీ నిర్మొహమాటంగా కుదరదని చెబుతున్నాను. నా వస్త్ర వ్యాపారాన్ని మరింత విస్తరింపచేయాలి. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది నా లక్ష్యం. మా కమ్యూనిటీలో కుట్టుపనిలాంటివి తెలిసినవారు పెద్దగా లేకపోవడంతో ముగ్గురు ట్రాన్స్ మహిళలకు మాత్రమే నా పరిశ్రమలో ఉద్యోగం ఇవ్వగలిగాను. ట్రాన్స్ వ్యక్తులను అర్థంచేసుకొనేంతగా ఈ సమాజం ఎదగలేదు. కనుక వారికి ఉద్యోగాలు ఇవ్వడం చాలా అరుదు. ఒకవేళ అలాంటి అవకాశం వచ్చినా, తోటి ఉద్యోగులు వారిని సరిగ్గా అర్థం చేసుకోవాలి కదా. అందుకే ట్రాన్స్ వ్యక్తులకు ఉద్యోగాలకన్నా ఆత్మగౌరవంతో బతికేందుకు చిన్నదైనా వ్యాపారమే ఉత్తమం. కాబట్టి వారికి జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించడం తక్షణ అవసరం. దీన్ని మనమంతా గుర్తించాలి. ట్రాన్స్ మహిళలుగా మాకు ఈ సమాజం నుంచి ప్రత్యేక గౌరవ మర్యాదలేమీ అక్కర్లేదు, వాటిని ఆశించడం లేదు కూడా. సాటి మనుషుల్లా మా బతుకు మమ్మల్ని బతకనిస్తే చాలు.

• సాంత్వన్

**ట్రెండ్‌ను ఫాలో అవదు... అలాగని ట్రెండ్‌ను సెట్ చేయదు. కానీ ఆమెకంటూ ఒక ట్రెండ్ ఉంది. సినిమాల్లో నటిస్తూనే... సామాజిక మాధ్యమాల్లో యమ బిజీగా ఉంటుంది. నచ్చింది చేస్తూ... విభిన్న డ్రెస్సుల్లో ఆకట్టుకొంటూ... ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తుంది. నవతరం ఫ్యాషన్ ఐకాన్‌గా 'ఇన్‌స్టా'ంట్‌గా వేలకు వేలు లైక్‌లు కొట్టేస్తున్న మళయాళ మనోహరి... అహానా కృష్ణ ట్రెండీ టచ్ ఇది.**

# 'అహా'నా స్టైలంటూ!

మళయాళ చిత్ర పరిశ్రమలోనే ప్రధానంగా పని చేస్తున్నా... సామాజిక మాధ్యమాల్లో సరిహద్దులు దాటిన అభిమానం ఉంది అహానా కృష్ణకు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముప్ఫై లక్షలకు పైగా ఆమెను ఫాలో అవుతున్నారు. యూట్యూబ్‌లో పదిహేను లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ దీనికి అదనం. అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న అహానా... సామాజిక మాధ్యమాల్లో పెట్టే ప్రతి పోస్ట్‌కూ క్షణాల్లో లైక్‌లు లక్ష దాటుతున్నాయి.

పదేళ్ల కిందట పరిశ్రమలో ప్రయాణం మొదలుపెట్టినా... ఇప్పటికి ఆమె నటించిన చిత్రాలు పది దాటలేదు. కానీ స్టార్ హీరోయిన్లకు తీసిపోని ఫాలోయింగ్. ఎంచుకొంటూ... అడుగులు వేస్తోంది. మాధ్యమం ఏదన్నది ఆమెకు ముఖ్యం కాదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ... తనకు పేరు తెస్తాయనుకున్న కథలను ఓకే చేస్తూ... ఒక విభిన్నమైన కెరీర్‌ను నిర్మించుకుంది. అందులో భాగంగానే వెబ్‌సిరీస్‌లలో నటిస్తోంది. కొన్ని మ్యూజిక్ వీడియోల్లోనూ కనిపించి.. అన్ని వర్గాల అభిమానులకూ చేరువ అయ్యే ప్రయత్నం చేస్తోంది. రెండు మూడు పాటలూ పాడి... తన సంగీత అభిరుచినీ చాటుతోంది.

ఇవన్నీ ఒకటైతే... సామాజిక మాధ్యమాల్లో ఆమె ట్రెండీ టచ్ మరొక ఎత్తు. ఫ్యాషన్‌పై తన ఆసక్తితో పాటు... విభిన్నమైన వస్త్రధారణతో ఫ్యాషన్ ఐకాన్‌గానూ వేలమంది మనసు దోచుకొంటోంది.

ట్రెండీ టచ్



అందుకు ముఖ్య కారణం... నెట్టింట ఆకట్టుకొనే ఆమె డ్రెస్సింగ్ స్టయిల్. పాశ్చాత్య వస్త్రధారణలో అహానా లుక్ ఎంతగా అలరిస్తుందో... సంప్రదాయ దుస్తుల్లోనూ అంతే అబ్బుర పరుస్తుంది. రెండిటికీ సమప్రాధాన్యం ఇస్తుంది ఈ నటి. బ్లాక్ లేస్ అవుట్‌ఫిట్‌లో ఫొటోషూట్ చిత్రాలను అహానా ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. గంటల వ్యవధిలోనే ఆ ఫొటోలకు లెక్కకు మించి లైక్‌లు వచ్చాయి. వేలల్లో నెట్టింట చక్కర్లు కొట్టాయి. అంతకుముందు ఆఫ్ షోల్డర్ టాప్, థై హై స్లిట్ ప్యాంట్‌తో మెరిసిన ఫొటోలూ తక్కువేంకాదు. లక్షకు పైగా లైక్‌లు సంపాదించాయి.

మళయాళ నటుడు కృష్ణ కుమార్ నలుగురు కూతుళ్లలో అహానా పెద్దమ్మాయి. అహ్మదాబాద్ 'ముద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్'లో అడ్వర్‌టైజింగ్ మేనేజ్‌మెంట్ అండ్ పబ్లిక్ రిలేషన్స్‌లో పీజీ చదివింది. ఆమె స్వస్థలం కేరళ రాజధాని తిరువనంతపురం. సరిగ్గా పదేళ్ల కిందట తొలిసారి వెండితెర మీద తళుక్కుమంది. కథాబలంతో పాటు ప్రాధాన్యమున్న పాత్రలనే



గానూ వేలమంది మనసు దోచుకొంటోంది. ఇదే ఆమెకు సినిమాలకు మించి గుర్తింపు తెచ్చి పెడుతోంది. డ్రెస్సింగ్‌లోనూ ఆమెకంటూ ఒక అభిరుచి ఉంది. ఎక్కువగా వి-నెక్ టాప్స్, డ్రెస్‌లు ఇష్టపడే ఈ తార... ఆకర్షణీయమైన రంగులు, పాలెట్స్, ప్యాటరన్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. సంప్రదాయ సల్వార్ సూట్ అయినా... వెస్టరన్ అవుట్‌ఫిట్స్ అయినా... ఆమె ధరిస్తే 'ఆహా' అనాల్సిందే. కళ్లు చెదిరే వర్ణాలు, హుందాగా కనిపించే వస్త్రశ్రేణులు, సరికొత్త హంగులతో ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ వెనకాడదు. 'హీరామండీ' స్ఫూర్తితో ఇటీవల ఆమె చేసిన ఓ డిజైన్... నెటిజనులనే కాదు, ఫ్యాషన్ పండితులను కూడా ఫిదామరిపించింది. స్టయిలిష్ జంప్‌సూట్స్, స్వెటర్స్, టీషర్ట్స్, క్యాజువల్ అవుట్‌ఫిట్స్ కలెక్షన్ అహానా వద్ద లెక్కకు మించి ఉన్నాయి. యువత అభిరుచిని, నయా ట్రెండ్‌ను పట్టేయడం, ఏ వెరైటీ అయినా తనకు నప్పేలా మార్చుకోవడం... ఇవే అహానాను స్టైల్ ఐకాన్‌ను చేశాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 27 జూన్ 2024
cinema@andhrajyothy.com

# మారేడుమిల్లిలో మొదలైంది



నిఖిల్ యోధుడి పాత్రను పోషిస్తున్న 'స్వయంభూ' చిత్రం తాజా షెడ్యూల్ మారేడుమిల్లిలో మొదలైంది. అక్కడున్న దట్టమైన అడవుల్లో నిఖిల్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు దర్శకుడు భరత్ కృష్ణమాచార్య. ఇది నిఖిల్‌కు 20వ సినిమా. ఆయన కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌లా నిలిచే విధంగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇందులో నిఖిల్ వారియర్‌గా నటిస్తుండడంతో ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నారు. ఈ పీరియాడిక్ ఫిల్మ్‌లో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సెంథిల్ కుమార్, సంగీతం: రవి బస్రూర్, సహ నిర్మాతలు విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్, నిర్మాతలు: భువన్, శ్రీకర్, సమర్పణ: ఠాగూర్ మధు.

# 35 రోజులు.. రూ 15 కోట్లు!



వరుణ్‌తేజ్ తాజాగా నటిస్తున్న చిత్రం 'మట్కా'. ప్రస్తుతం మూడో షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. 35 రోజుల పాటు ఏకధాటిగా జరిగే ఈ షెడ్యూల్ కోసం రూ. 15 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. వైజాగ్ నేపథ్యంలో జరిగే కథ కనుక రామోజీ ఫిల్మ్ సిటీలో వింటేజ్ వైజాగ్ సెట్ వేశారు. ప్రేక్షకులకు అథెంటిసిటీ, గ్రాండియర్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే లక్ష్యంతో టీమ్ వర్క్ చేస్తోంది. వరుణ్‌తేజ్ కెరీర్‌లో మరో మరుపురాని పాత్రలో నిలిచిపోయేందుకు దర్శకుడు కరుణకుమార్ కృషి చేస్తున్నారు. దేశాన్ని కదిలించిన యథార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఈ చిత్రం స్క్రిప్ట్ రూపొందించారు. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతి కలిగించే విధంగా తయారవుతున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. డాక్టర్ విజయేందర్ రెడ్డి, రజనీ తాళ్లూరి ఈ చిత్రానికి నిర్మాతలు.

# కమల్ చిత్రంలో రోహిత్



విశిష్ట నటుడు కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం చాలా కాలం తర్వాత మళ్లీ కలసి పనిచేస్తున్న 'థగ్ లైఫ్' చిత్రంలో బాలీవుడ్ నటుడు రోహిత్ సరాఫ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. అటు కమల్‌ను, ఇటు మణిరత్నంను అభిమానించే రోహిత్‌ను వెదుక్కుంటూ ఈ అవకాశం రావడంతో మరో మాట మాట్లాడకుండా ఒప్పేసుకున్నారు. ప్రస్తుతం అతనిపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఆగస్టుకు సినిమాను పూర్తి చేయాలనే సంకల్పంతో మణిరత్నం పని చేస్తున్నారు. డిసెంబర్‌లో సినిమా విడుదలవుతుంది' అని యూనిట్ వర్గాలు చెప్పాయి. కమల్‌హాసన్, శింబు, త్రిష, నాజర్, జోజు జార్జ్, రోహిత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# 39 ఏళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నో ఆసక్తికర అంశాలతో భారతీయ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దశాబ్దాల తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కలయికకు ఈ చిత్రం వేదిక అవ్వడం ఓ విశేషం. 1985లో వచ్చిన 'గిరఫ్తార్' చిత్రంలో అమితాబ్, కమల్ అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'కల్కి' చిత్రంతో వీరి కాంబినేషన్ సెట్టయింది. ఇందులో కమల్‌హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్రను పోషించగా, అమితాబ్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. వీరి కలయికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించారు.

# టెడ్డీ బేర్ యాక్షన్ ఎంటర్‌టైనర్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం జులై 26న విడుదల కానుంది. మంగళవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ సంస్థలు 'ప్రేమ కథాచిత్రమ్'ను తమిళంలోకి రీమేక్ చేశాం. జీవీ ప్రకాశ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలోనే 'బడ్డీ' తీస్తున్నాం. నేను కథ కంటే శామ్‌నే ఎక్కువగా నమ్మాను. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ ఇచ్చిన సంగీతం చిత్రానికి ప్రాణం. అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు. 'బడ్డీ'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. జులై 26న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మధుర' శ్రీధర్ మాట్లాడుతూ 'నా స్నేహితుడు జ్ఞానవేల్ రాజా ఎన్నో తమిళ చిత్రాలు తెలుగులోకి తీసుకువచ్చి విజయం సాధించారు. 'బడ్డీ'తో ఆయన తెలుగులో స్ట్రయిట్ చిత్రం చేయడం ఆనందంగా ఉంది. టీమ్‌కు ఆల్ ది బెస్ట్' అన్నారు. 'నేను రాజమౌళిగారి అభిమానిని. ఆయన తీసిన 'ఈగ' చిత్రం ఈ 'బడ్డీ'కి ప్రేరణ. సీజీ వర్క్ చేస్తున్నప్పుడు 'ఈగ' మూవీతో పోల్చి సజెషన్స్ ఇచ్చేవాడిని. నా మీద నమ్మకంతో సినిమా ఇచ్చిన నిర్మాత జ్ఞాన్‌వేల్ రాజాకు కృతజ్ఞతలు' అన్నారు దర్శకుడు శామ్.

హీరో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'టెడ్డీ బేర్‌తో అడ్వెంచర్ యాక్షన్ సినిమాను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారా అని మొదట కొంత డౌట్ ఉండేది. కానీ ట్రైలర్ చూశాక నాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇది కొత్త తరహా సినిమా ఇందులో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ క్యారెక్టర్‌కు ఇంప్రెస్ అయి ఈ సినిమా ఒప్పుకొన్నా. మా నాన్న కూడా నా మీద ఇంత ఖర్చు పెట్టి సినిమా తీయలేదు. భారీ ఖర్చుతో నాతో యాక్షన్ అడ్వెంచర్ తీసిన జ్ఞానవేల్ రాజాగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు.

# చక్కనమ్మకు నవ్వు తెచ్చిన చిక్కు



అందం, అభినయంతో పాటు చక్కని చిరునవ్వుతో ప్రేక్షకులకు కనువిందు చేసి అగ్రకథానాయిక కొనసాగుతున్నారు అనుష్కశెట్టి. అయితే ఆ అందమైన చిరునవ్వే తనకు కొన్ని సమస్యలు తెచ్చిపెట్టిందంటున్నారు అనుష్క. ఆమె ఓ అరుదైన సమస్యతో బాధపడుతున్నారు. అనుష్క నవ్వడం మొదలుపెడితే, 15 నుంచి 20 నిమిషాల పాటు ఏకబిగిన నవ్వుతూనే ఉంటారట. కొన్నాళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో అనుష్క ఈ విషయాన్ని చెప్పారు. దీనివల్ల పలు సందర్భాల్లో సినిమా షూటింగ్స్‌కు బ్రేక్ పడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. సెట్‌లో, నలుగురిలోకి వెళ్లినప్పుడు ఇలా నవ్వడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురయినట్లు ఆమె చెప్పారు. ఇలా అకస్మాత్తుగా వచ్చే నవ్వును అదుపుచేసుకోలేని పరిస్థితిని వైద్య పరిభాషలో పీబీఏ (సూడోబల్బార్ ఎఫెక్ట్) అంటారు.

# అభిమానితో నాగ్ సెల్ఫీ



ఇటీవలే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఓ అభిమాని నాగార్జునను కలిసేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పక్కకు నెట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విమర్శలు రావడంతో ఆ సంఘటనపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆ అభిమానికి ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. బుధవారం నాగార్జున ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని కలిశారు. సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టివేసిన సంఘటన ఆ రోజు తనకు తెలియదని అతనితో చెప్పారు. ఆ అభిమానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. అతనితో కొంత సమయం గడిపి, ఫొటోలు దిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జరిగిన సంఘటన పట్ల మీ ప్రవర్తన హుందాగా ఉంది, 'మీరు రియల్ హీరో సార్' అంటూ నెటిజన్లు నాగార్జునను అభినందిస్తున్నారు.



# ఇస్మార్ట్ సాంగ్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది సీక్వెల్. సంజయ్‌దత్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. టైటిల్ సాంగ్‌ను ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రామ్ పోతినేని స్పెషల్ పోస్టర్‌ను బుధవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ గీతాన్ని మణిశర్మ స్వర పరచగా, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. రామ్‌కు జోడీగా కావ్య థాపర్ నటిస్తున్నారు. పూరి జగన్నాథ్, ఛార్మీకౌర్ నిర్మిస్తున్నారు.




# అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శక ధీరుడు రాజమౌళి. అంతే కాదు ఆ సినిమాతో ప్రపంచమంతా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందడంతో పాటు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ సాధించారు. తాజాగా ఆస్కార్ అకాడెమీలో చేరేందుకు ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేసిన రమా రాజమౌళి కూడా ఈ గౌరవంలో భాగమయ్యారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి మొత్తం 487 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ అకాడెమీ ఆహ్వానం పంపింది. వీరిలో రాజమౌళి, రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి షబానా అజ్మీ, రితేశ్ సిద్వానీ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్‌కుమార్ టక్కర్, నిషా పహుజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యా ఉన్నారు. ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డ్ సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం టీమ్‌లో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, సెంథిల్‌కుమార్, సాబు శిరిల్‌కు ఆస్కార్ అకాడెమీ కొత్త సభ్యులుగా గత ఏడాది ఆహ్వానం అందింది.


# ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది

- ట్రోలర్స్‌పై మండిపడ్డ రేణూదేశాయ్



తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నవారిపై నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ మండిపడ్డారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ తన శ్రీమతి అన్నా లెజినేవా, తనయుడు అకిరానందన్, కూతురు ఆద్యలతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫొటోను వాడుకొని కొందరు రేణూదేశాయ్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేస్తూ రకరకాల మీమ్స్ రూపొందించారు. పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకొని పొరపాటు చేశారనీ, అదృష్టాన్ని కాలదన్నుకున్నారనీ రకరకాల వ్యాఖ్యలతో మీమ్స్ పెడుతున్నారు. అవి తమను ఎంతగానో బాధపెడుతున్నాయని రేణూదేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'మనుషులు ఇంత దారుణంగా దిగజారడం సిగ్గు చేటు. నాపై వస్తున్న విమర్శలు, నన్నుఎగతాళి చేస్తున్న తీరు చూసి నా కూతురు ఆద్య కన్నీరు పెట్టుకుంది. మీమ్స్ చేసేవాళ్లంతా గుర్తుంచుకోండి, మీకూ ఓ కుటుంబం ఉంటుంది, తల్లులూ, అక్కచెల్లెళ్లు ఉన్నారు. మాపైన జోక్స్ చేస్తున్నవాళ్లకు ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది. నా బిడ్డ కార్చిన కన్నీరు, ఊరకే పోదు. ఈ తల్లి శాపం తగిలితీరుతుంది. దీన్ని పోస్ట్ చేసేముందు వంద సార్లు ఆలోచించాల్సి వచ్చింది. కానీ తప్పలేదు' అని రేణూదేశాయ్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు.

# ఆరేళ్ల బంధం ముగిసింది



మొత్తానికి పెళ్లి వరకూ వెళ్లకుండానే అర్జున్‌కపూర్, మలైకా అరోరా విడిపోయారు. ఆరేళ్ల క్రితం ఓ ఫ్యాషన్ షోలో తొలిసారిగా కలసిన వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. మలైకా 45వ పుట్టిన రోజున కానీ ఈ విషయం బయటపడలేదు. ఇక అప్పటినుంచీ ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలసే వెళ్లేవారు. ఫ్యామిలీ ఫంక్షన్స్‌లో కూడా అర్జున్ పక్కన మలైకా ఉండాల్సిందే. 'కాఫీ విత్ కరణ్' ప్రోగ్రామ్‌లో తమ అనుబంధం గురించి అర్జున్ వెల్లడించడంతో త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరూ అనుకున్నారు. ఆరేళ్ల పాటు ఎంతో అన్యోన్యంగా కలసి తిరిగిన వీరిద్దరూ మొన్న మే 31న విడిపోయిన విషయం చాలామందికి తెలీదు. తమ బ్రేకప్ విషయం ఇద్దరూ సీక్రెట్‌గా ఉంచారు. ఏ విషయంలో వీరిద్దరికీ చెడిందో ఏమో కానీ ఇప్పుడు అర్జున్ కెరీర్ మీద దృష్టి పెట్టాడు. బుధవారం అతని పుట్టినరోజు కావడంతో తామిద్దరూ కలసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది మలైకా.



జితేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా ఉంటా

» తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి

» తెలంగాణ భవన్‌లో పదవీ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా ఉంటానని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న విభజన చట్టంలోని అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని, అందుకు కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. బుధవారం, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరయ్యారు. అనంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. విభజన చట్టంలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కృష్ణా నుంచి రావలసిన నీటి వాటా కూడా రాలేదని, సాగు, తాగునీరు సాధించడం కోసం రాజీలేని పోరాటం చేస్తానన్నారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘురామిరెడ్డి, బలరాంనాయక్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, యన్నం శ్రీనివాస్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీహరి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## తొమ్మిది మందికి ప్రొబేషనరీ ఐఏఎస్‌ల హోదా

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది మంది జూనియర్ ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం 'ప్రొబేషనరీ హోదా' కల్పించింది. ఈమేరకు వారి సర్వీసులను కన్ఫర్మ్ చేస్తూ కేంద్ర సిబ్బంది, ప్రజా విజ్ఞప్తులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ భూపిందర్ పాల్ సింగ్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. వీరి సర్వీసులను కన్ఫర్మ్ చేస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఇందులో 2020 బ్యాచ్‌కు చెందిన కధిరవన్ పలని ఉండగా, మిగతా ఎనిమిది మంది 2021 బ్యాచ్‌కు చెందినవారున్నారు. కధిరవన్ పలనికి 2023 సంవత్సరం అక్టోబరు 7 నుంచి ప్రొబేషనరీ ఐఏఎస్‌గా కన్ఫర్మేషన్ ఇవ్వగా.. 2021 బ్యాచ్‌కు చెందిన శివేంద్ర ప్రతాప్, సంచిత్ గాంగ్వార్, ఫైజాన్ అహ్మద్, లెనిన్ వత్సల్ టొప్పో, పి.గౌతమి, పర్మర్ పింకేశ్‌కుమార్ లలిత్‌కుమార్, రాధికా గుప్తా, పి.శ్రీజలకు 2023 సంవత్సరం డిసెంబరు 5 నుంచి కన్ఫర్మేషన్ ఇచ్చారు. వీరంతా ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా పని చేస్తున్నారు. అసోం క్యాడర్‌కు చెందిన సంచిత్ గాంగ్వార్‌ను 2022 సంవత్సరం డిసెంబరు 23న తెలంగాణ క్యాడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు త్రిపుర రాష్ట్రానికి చెందిన మరో ఐదుగురు ఐఏఎస్‌లకూ కేంద్రం ప్రొబేషనరీ హోదా కల్పించింది. ఈ హోదా రావడంతో వీరంతా ఇక మీదట రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన రెవెన్యూ డివిజన్లకు సబ్-కలెక్టర్లుగా పనిచేసే అవకాశం ఉంటుంది.

## తెలంగాణ ఖ్యాతిని చాటేలా బోనాలు

» జూలై 5లోగా ఏర్పాట్లు పూర్తి.. 20 కోట్ల నిధుల కేటాయింపు

» అధికారులతో సమీక్షలో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న దశాబ్ది ఆషాఢ మాస బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతిపాదించిన పనులను వివిధ శాఖల సమన్వయంతో జూలై 5లోగా పూర్తిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. టూరిజం ప్లాజాలో బుధవారం ఆషాఢ బోనాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ప్రధాన దేవాలయాల ఛైర్మన్లు, ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కొండా సురేఖ సమీక్షించారు. దశాబ్ది బోనాల ఉత్సవాలను తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గతంలోకంటే వైభవంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బోనాలను గ్రంథస్థం చేయడంతోపాటు డాక్యుమెంటరీ చేయాలని సూచించారు. ఎంపిక చేసిన 28 ఆలయాలకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించనున్నట్టు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బోనాల్లో ప్రసాదం శుభ్రత, నాణ్యతతో ఉండాలని, నాణ్యమైన తాగునీరు భక్తులకు అందించాలని సూచించారు.

## గోదావరి బోర్డుకు చేరిన సీతారామ-సీతమ్మ పథకం డీపీఆర్

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మ బ్యారేజీ బహుళార్థ సాధక ప్రాజెక్టు 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)' గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)కి చేరింది. కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని అన్ని డైరెక్టరేట్ల పరిశీలన అనంతరం జీఆర్ఎంబీ వద్దకు వచ్చింది. ఈ డీపీఆర్‌పై చర్చించేందుకు జీఆర్ఎంబీ త్వరలోనే సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే, జూన్ నెల వేతనాల చెల్లింపులకు కూడా జీఆర్ఎంబీ వద్ద ప్రస్తుతం నిధుల్లేవు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు నిధులు సమకూరిస్తేనే వేతనాలు చెల్లించే పరిస్థితిలో ఉంది. ఈ డీపీఆర్ పరిశీలన తెలంగాణకు కీలకం కావడంతో ఏపీ సహకరించకపోయినా రాష్ట్రం నిధులు సమకూర్చే అవకాశం ఉంది.

## ఎంబీబీఎస్ ఫీజు ఒకేసారి తీసుకుంటే చర్యలు

» ఫీజు రెగ్యులేటరీ కమిటీ హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు మొత్తానికి మెడికోల నుంచి ఒకేసారి ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలను తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ హెచ్చరించింది. ఏ ఏడాది ఫీజును ఆ ఏడాది మాత్రమే వసూలు చేయాలని బుధవారం ఆదేశించింది. ఎంబీబీఎస్ కోర్సు నాలుగున్నరేళ్లేనని కాని కొన్ని కాలేజీలు ఐదేళ్లకు ఫీజు వసూలు చేస్తున్నాయని అలా చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంది. కోర్సు ఫీజు మొత్తాన్ని ఐదు వాయిదాల్లో విద్యార్థుల నుంచి తీసుకోవాలని సూచించింది.

## నేడు కొన్ని జిల్లాలో భారీ వర్షాలు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం కొన్ని జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆవర్తనం ఒకటి పశ్చిమ మధ్య, దానికి అనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం వద్ద సగటు సముద్ర మట్టానికి 1.5 నుంచి 5.8కిలోమీటర్ల మధ్య కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

## 29న ధరణి సమస్యలపై సమీక్ష

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ధరణి దరఖాస్తుల పరిష్కారం, పురోగతిపై ఈనెల 29న సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ రాష్ట్రంలోని ఆయా జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలపై ఆయా జిల్లా కలెక్టర్లతో సమీక్షించనున్నారు.

## మీరు ఎమర్జెన్సీ అంటే.. మేము గోద్రా అంటాం: వీహెచ్

"ప్రధాని మోదీకి ప్రతిసారీ ఎమర్జెన్సీ గురించి మాట్లాడడం అలవాటైపోయింది. మరోసారి ఆయన ఎమర్జెన్సీ గురించి మాట్లాడితే మేము గోద్రా అల్లర్లలో జరిగిన ఊచకోత గురించి మాట్లాడాల్సి వస్తది" అని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు హెచ్చరించారు. కేవలం ఇందిరాగాంధీపైన కక్షతోనే బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వనిత ఇందిరాగాంధీ అని కొనియాడారు.

# ఐకానిక్ టవర్‌గా తెలంగాణ భవన్

### రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన్‌ను ఢిల్లీలోనే ఒక ఐకానిక్ టవర్‌గా నిర్మించబోతున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తాను మంత్రి పదవిని చేపట్టిన మూడో రోజే తెలంగాణ భవన్ నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఏపీ ప్రభుత్వంతో చర్చించి.. పటౌడీ హౌజ్‌లో ఐదున్నర ఎకరాలు, శబరి బ్లాక్ లో మూడున్నర ఎకరాలు తెలంగాణకు కేటాయించేలా ఒప్పించామన్నారు. బుధవారం, ఇక్కడ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. ఢిల్లీలో ఇప్పుడున్న భవనాన్ని ఆంధ్రాభవన్‌గానే పిలుస్తున్నారని.. రాష్ట్రం ఏర్పడి పదేళ్ల గడిచినా ఢిల్లీలో తెలంగాణకు భవన్ లేకపోవడం బాధకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హౌజ్ పక్కన స్థలంలో గవర్నర్, సీఎం, మంత్రుల కోసం సూట్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. మంగళవారం దాదాపు రెండు గంటల పాటు.. తెలంగాణభవన్‌కు సంబంధించిన పలు డిజైన్లపై నిపుణులు ప్రజెంటేషన్ ఇచ్చారని కొమటిరెడ్డి వివరించారు. ఆడంబరాలు, రాజగోపురాల మాదిరిగా డిజైన్లు ఇస్తే వద్దని చెప్పి పలు మార్పులు చేయాల్సిందిగా సూచించానని పేర్కొన్నారు. తుది డిజైన్‌ను ఆమోదించాక హైదరాబాద్‌లో సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చి వారం రోజుల్లో డీపీఆర్ పూర్తి చేస్తామని చెప్పారు. కేవలం రెండు నెలల్లో టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. మూడు నెలల్లో భవన్ నిర్మాణానికి ఢిల్లీ ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులూ పొందేలా చూడాల్సిందిగా ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు కోమటిరెడ్డి తెలిపారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులు మురిగిపోవు

### లబ్ధిదారులకు అందిస్తాం.. హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల గడువు ముగుస్తోందన్న వాదనలో నిజం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన లబ్ధిదారులకు వాటిని అందిస్తామని తెలిపింది. ఇప్పటికే 71 చెక్కులను పంపిణీ చేసినట్లు హైకోర్టు దృష్టికి తెచ్చింది. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల చెక్కుల కాలపరిమితి ఈనెల 27తో ముగియనున్నందున వాటి పంపిణీకి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం మరోసారి జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ ఈ చెక్కులకు ఆగస్టు వరకు సమయం ఉందని తెలిపారు. ఒక్క చెక్కు కూడా మురిగిపోదని, లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని ఏఏజీ కోరడంతో తదుపరి విచారణ వచ్చే నెల 15కు వాయిదా వేసింది.

### ఆర్ఆర్ఆర్ దక్షిణభాగాన్ని

# జాతీయ రహదారి చేయండి

### ఈ ఏడాది ప్రణాళికలో నిధులు మంజూరు చేయండి.. కేంద్రమంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి



కేంద్రమంత్రి గడ్కరీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ రహదారి నిర్మాణం కోసం ఈ ఏడాది ఎన్‌హెచ్ఏఐ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని అభ్యర్థించారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బుధవారం, ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే జాతీయ రహదారులుగా ప్రకటించిన మార్గాల పనుల ప్రారంభం తదితర అంశాలపై సుమారు రెండు గంటల పాటు చర్చించారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ (158.645 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించారని, దాని భూసేకరణకు అయ్యే ఖర్చులో సగభాగాన్ని తమ ప్రభుత్వమే భరిస్తోందని సీఎం గుర్తుచేశారు. చౌటుప్పల్ నుంచి అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి వరకూ (181.87 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. హైదరాబాద్ (ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్) నుంచి వలిగొండ-తొర్రూర్-నెల్లికుదురు-మహబూబాబాద్-ఇల్లెందు- కొత్తగూడెం వరకు రహదారిని (ఎన్‌హెచ్-930పీ) జాతీయ రహదారిగా ప్రకటించారని, ఇందులో కేవలం ఒక ప్యాకేజీ కింద 69 కి.మీ.లకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని తెలిపారు. హైదరాబాద్ నుంచి భద్రచలానికి 40 కి.మీ. దూరం తగ్గించే ఈ రహదారిని జైశ్రీరామ్ రోడ్‌గా వరంగల్ సభలో నితిన్ గడ్కరీ పేర్కొన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ఈ రహదారిలో మిగిలిన మూడు ప్యాకేజీలకు (165 కి.మీ) టెండర్లు పిలిచినందున వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్ 65) రహదారిని 2024 ఏప్రిల్‌లోగా 6 వరుసలుగా విస్తరించాల్సి ఉండగా.. తమకు సరైన ఆదాయం రావడం లేదంటూ కాంట్రాక్ట్ సంస్థ పనులు ప్రారంభించలేదని గడ్కరీకి రేవంత్ తెలియజేశారు.

**ఐకానిక్ బ్రిడ్జి.. ఎలివేటెడ్ కారిడార్**

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్-సోమశిల-కరివెన-నంద్యాల (ఎన్‌హెచ్-167కె) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి 142 కి.మీ. పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని గడ్కరీకి సీఎం రేవంత్ తెలియజేశారు. మిగిలిన 32 కి.మీ.పనులకు, ఐకానిక్ బ్రిడ్జికి టెండర్లు పిలిచారని, ఆ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నుంచి తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. కల్వకుర్తి-నంద్యాల రహదారి.. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ఉన్న రహదారిలో (ఎన్‌హెచ్ 765కె) 67 కిలోమీటర్ వద్ద (కల్వకుర్తి) ప్రారంభమవుతుందని, ఎన్‌హెచ్ 167కె జాతీయ రహదారి పనులు చేపట్టినందున, హైదరాబాద్- కల్వకుర్తి వరకు ఉన్న (ఎన్‌హెచ్ 765కె) రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని కోరారు. కల్వకుర్తి-కరివెన వరకు జాతీయ రహదారి పూర్తయ్యేలోపు హైదరాబాద్-కల్వకుర్తి రహదారిని 4 వరుసలుగా విస్తరించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 62 కిమీ ఆమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని, అటవీ అనుమతులు లేక పనులు చేపట్టలేదని తెలిపారు.ఆమ్రాబాద్ ప్రాంతంలో 4 వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు.

**మంథనికి జాతీయ రహదారి ప్రకటించండి**

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు మంథని నుంచి ప్రాతినిధ్యం వహించనప్పటికీ ఇప్పటి వరకూ జాతీయ రహదారుల చిత్రంలో మంథనికి చోటు దక్కలేదని.. ఈ నేపథ్యంలో జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని గడ్కరీని సీఎం కోరారు. అలాగే.. తెలంగాణను కర్ణాటక, మహారాష్ట్రను అనుసంధానించే హైదరాబాద్-మన్నెగూడ నాలుగు వరుసల రోడ్డును జాతీయ రహదారిగా (ఎన్‌హెచ్-163) ప్రకటించడంతో భూసేకరణ పూర్తిచేశామని గడ్కరీకి సీఎం వివరించారు. టెండర్లు పిలవడం పూర్తయినా ఎన్జీటీలో కేసు వలన పనులు ప్రారంభం కాలేదని.. ఆ మార్గంలో ఉన్న మర్రి చెట్లను కేంద్ర పర్యావరణ నిబంధనల ప్రకారం ట్రాన్స్‌లోకేషన్ చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించిందని వెల్లడించారు. ఈ మార్గం పనులు ప్రారంభించాలని కోరారు.

### టెండర్లు పిలవాలన్నారు: భట్టి

రాష్ట్రానికి పెద్ద వరంగా మారబోయే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పూర్తి సమాచారాన్ని కేంద్రమంత్రి గడ్కరీకి అందజేసి.. సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు ఆయన అంగీకరించారని వెల్లడించారు. గడ్కరీతో భేటీ అనంతరం భట్టి , రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్- విజయవాడ రహదారిని 6 లేన్లుగా విస్తరించేందుకు టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించినట్లు తెలిపారు. హైదరాబాద్-కల్వకుర్తి రోడ్డు నిర్మాణానికి అంగీకరించారని చెప్పారు. కేంద్రం నుంచి గత ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి మిగతా రాష్ట్రాల కంటే అతితక్కువ నిధులు తెలంగాణకే వచ్చాయని కోమటిరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. రోడ్ల నిర్మాణానికి భూసేకరణ, నిధుల పట్ల కేసీఆర్ సర్కారు నిర్లక్ష్యం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్- విజయవాడ రహదారి నిర్మాణం కోసం జూలైలో టెండర్లు పిలిచి.. రూ.4 వేల కోట్లతో రెండేళ్లలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

### సీఎం రేవంత్ చేసిన అభ్యర్థనలు

- సేతు బంధన్ స్కీం కింద 2023-24లో రాష్ట్రప్రభుత్వం సమర్పించిన 12 ఆర్వోబీలు, ఆర్‌యూబీలను వెంటనే మంజూరు చేయాలి.
- జగిత్యాల-కాటారం (130 కి.మీ.), దిండి-నల్గొండ (100 కి.మీ.), భువనగిరి-చిట్యాల (44 కి.మీ), చౌటుప్పల్-సంగారెడ్డి (182 కి.మీ), మరికల్-రామసముద్రం (63 కి.మీ.), వనపర్తి-మంత్రాలయం (110 కి.మీ.), మన్నెగూడ-బీదర్ (134 కి.మీ.), కరీంనగర్-పిట్లం (165 కి.మీ.), ఎర్రవెల్లి క్రాస్ రోడ్-రాయచూర్ (67 కి.మీ.), కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ.), సారపాక-ఏటూరు నాగారం (93 కి.మీ.), దుద్దెడ-రాయగిరి క్రాస్ రోడ్ (63 కి.మీ.), జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కి.మీ.), సిరిసిల్ల-కోరట్ల (65 కి.మీ.), భూత్పూర్-సిరిగిరిపాడు (166 కి.మీ.), కరీంనగర్-రాయపట్నం (60 కి.మీ.) మొత్తం 1617 కి.మీ. రోడ్లను జాతీయ రహదారులను అప్‌గ్రేడ్ చేయాలి.

### మేడిగడ్డపై విచారణ కమిషన్‌కు

# అఫిడవిట్!

» అన్ని విషయాలనూ పొందుపరిచిన ఇరిగేషన్ అధికారులు

» ఎవరిపై చర్యలు ఉంటాయోనని అధికారుల్లో గుబులు!

మహదేవపూర్ రూరల్, జూన్ 26: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ అధికారుల్లో మరోమారు గుబులు మొదలైంది. ప్రాజెక్టు నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఇరిగేషన్ అధికారులు అఫిడవిట్ సమర్పించినట్లు తెలిసింది. బ్యారేజీ ఈఈ తిరుపతిరావు సోమ, మంగళవారాల్లో ఈ అఫిడవిట్‌కు దాఖలు చేసినట్లు సమాచారం. ఈ సమాచారం ఆధారంగా జూలై 7న ప్రభుత్వానికి కమిషన్ మధ్యంతర నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఏ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని బ్యారేజీ పరిధిలో పనిచేసే ఇంజనీర్లు ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాకులోని 19, 20, 21 గేట్లు కుంగుబాటుకు గురైన విషయం తెలిసిందే. కాగా, గత డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీతోపాటు లింక్-1లోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై తొలుత విజిలెన్స్ విచారణ జరిపించింది. విజిలెన్స్ రిపోర్టు ఆధారంగా అప్పటి ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ మురళీధర్‌కు పొడగించిన పదవీ కాలాన్ని రద్దు చేయడంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లును పదవి నుంచి తొలగించింది. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశించగా.. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ నేతృత్వంలోని కమిషన్.. ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ ప్రారంభించింది. మూడు బ్యారేజీల్లో పనిచేసే అధికారులను ప్రత్యేకంగా విచారించింది. అయినప్పటికీ పూర్తి వివరాలను కమిషన్‌కు తెలపడంలో అధికారులు తలో వైఖరి ప్రదర్శించినట్లు తెలిసింది. దీంతో కచ్చితమైన సమాచారాన్ని రాబట్టేందుకుగాను మూడు బ్యారేజీలకు సంబంధించిన సమాచారాన్ని అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను కమిషన్ కోరింది. దీంతో మేడిగడ్డ బ్యారేజీ ఈఈ తిరుపతిరావు అఫిడవిట్ సమర్పించినట్లు తెలిసింది. అయితే విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇద్దరు ఈఎన్సీలను తొలగించిన నేపథ్యంలో కమిషన్ ఇచ్చే రిపోర్టుతో ఏం జరుగుతుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కాగా, పీసీ ఘోష్ కమిషన్‌కు అందజేసిన అఫిడవిట్‌లో.. మేడిగడ్డ నిర్మాణానికి ముందు చేపట్టిన పరీక్షలు, నిర్మాణ తీరు, నిధుల వినియోగంపై సమగ్రంగా వివరించినట్లు తెలిసింది. బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యాక దాని రక్షణ, నిర్వహణకు చేపట్టిన వివరాలతో పాటు భూసేకరణ వంటి అంశాలను పొందుపరిచినట్టు సమాచారం. బ్యారేజీ నిర్మాణ సంస్థతోపాటు ఆ సంస్థ ఇచ్చిన సబ్ కాంట్రాక్టుల గురించి వివరించినట్లు తెలిసింది.

# టన్నెల్ పనులకు పరుగులు!

### ఎస్ఎల్‌బీసీ సొరంగం వేగవంతానికి చర్యలు.. ఇన్‌లెట్ నుంచి సత్వర తవ్వకానికి కసరత్తు

**జేపీ సబ్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం పిలుపు**

**నవంబరులో ఔట్‌లెట్ నుంచి టన్నెలింగ్**

**బేరింగ్‌తోపాటు ఇతర పరికరాలకు ఆర్డర్లు**

**ఏకకాలంలో రెండువైపులా తవ్వకం**



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం ప్రక్రియను గాడిలో పెట్టడానికి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇన్‌లెట్ (శ్రీశైలం) నుంచి టన్నెల్ తవ్వే ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో నిర్మాణ సంస్థ జేపీకి సబ్ కాంట్రాక్ట్‌గా పనిచేస్తున్న రాబిన్స్‌ను ఈ దఫా ఉన్నతస్థాయి సమావేశానికి పిలవాలని సర్కారు నిర్ణయించింది. ఇన్‌లెట్ వైపు నుంచి సీపేజీలు టన్నెల్ తవ్వకానికి ప్రధాన అవరోధంగా ఉండగా, ఔట్‌లెట్ వైపు గట్టి రాయి ఉండటం, మాటిమాటికీ బేరింగులు, బిట్లు దెబ్బతింటుండడంతో పనులు ముందుకు కదలడం లేదు. ఈ నేపథ్యంలో టన్నెల్ పురోగతిపై ఇటీవలే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. తవ్వకం పనుల్లో పురోగతి లేకుంటే చర్యలు తప్పవని అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. అంతేకాకుండా జేపీకి సబ్‌కాంట్రాక్ట్‌గా పనిచేస్తున్న రాబిన్స్ ప్రతినిధులు కూడా ఈ దఫా జరిగే సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక టన్నెల్ తవ్వకం (శ్రీశైలం వైపు నుంచి) రెండుసార్లు ప్రారంభమై.. సాంకేతిక సమస్యలతో ఆగిపోయింది. టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) ఒక దఫా 8 నిమిషాలపాటు, మరో దఫా రెండు నిమిషాలపాటు పనిచేసి ఆగింది. ఇన్‌లెట్ వైపు నుంచి సీపేజీలు వెలువడటంతో కట్టడి చేసేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) సహకారంతో ఇప్పటికే పనులు చేపట్టారు. దీంతో సీపేజీ గణనీయంగా తగ్గింది.

**కొత్త బేరింగులకు ఆర్డర్లు..**

ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి-అచ్చంపేట) వైపు ఉన్న టీబీఎంలో బేరింగులు పాడైపోవడంతో.. కొత్త బేరింగులతోపాటు ఇతర పరికరాల కోసం ఆర్డర్లు పెట్టారు. ఈ పరికరాలన్నీ ఆగస్టుకల్లా చేరితే.. వీటిని బిగించి, నవంబరులో ఔట్‌లెట్ వైపు నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను అత్యంత ప్రాధాన్య జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే. టన్నెల్ తవ్వకానికి గల అవరోధాలపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని కూడా వేశారు. ఆ కమిటీ సిఫారసులతో ఇప్పటికే రూ.50 కోట్లను వెనువెంటనే విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను రూ.3150 కోట్ల నుంచి రూ.4468 కోట్లకు సవరించాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరడంతో త్వరలోనే దీనికి ఆమోదముద్ర పడే అవకాశాలున్నాయి. ఇన్‌లెట్‌లో సత్వరం తవ్వకాలు ప్రారంభించాలని, నవంబరులో ఔట్‌లెట్ వైపు నుంచి ప్రారంభించి.. రెండువైపులా ఏకకాలంలో తవ్వకం కొనసాగించాలని నిర్ణయించారు. రెండువైపులా టన్నెల్ తవ్వకం ప్రారంభిస్తే.. నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల్లో టన్నెల్ పూర్తి చేయగలమని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి సంకేతాలిచ్చింది.

### ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థల్లో..

# దివ్యాంగులకు 5% రిజర్వేషన్లు

» మహిళా శిశు సంక్షేమ శాఖ మెమో

» వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు

» ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గురించి మెమోలో లేదంటున్న బాధితులు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యా సంస్థల్లో వారికి ఐదు శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి సిద్ధమైంది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణ మెమో జారీ చేశారు. ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు, ప్రభుత్వం నుంచి సహాయం పొందుతూ (ఎయిడెడ్) నడుస్తున్న ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లతో పాటు ఆయా విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఐదేళ్ల గరిష్ఠ వయోపరిమితి సడలింపు కూడా ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు. అయితే.. పాఠశాలల స్థాయిలో ప్రవేశాల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అలాగే.. గుర్తించిన అంగవైకల్యాల జాబితాలో శారీరక, మానసిక సమస్యలతో బాధపడేవారితో పాటు, అంధులు, చెవిటి, మూగ సహా దాదాపు 21 రకాల సమస్యలతో సతమతమయ్యేవారు ఉన్నారు. మరి ఈ 21 రకాల దివ్యాంగులకూ ప్రవేశాలు ఇస్తారా లేదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. వీరిలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు 5 లక్షల మంది దాకా ఉండగా.. చెవిటి మూగ వారు 2 లక్షల మంది ఉన్నట్టు అంచనా. ప్రస్తుతం పాఠశాలల్లో, ఉన్నత విద్యా సంస్థల్లో శారీరక వైకల్యం ఉన్నవారికి ప్రవేశాలను కల్పిస్తూ విద్యను అందిస్తున్నారు. అందులకు బ్రెయిలీ లిపిలో విద్య అందుతోంది. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు మాత్రం విద్యా సంస్థల్లో ప్రవేశాలు అందడంలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ జారీ చేసిన మెమోలో.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, పాఠశాలల విషయంలో స్పష్టతలేదని 'వికలాంగుల హక్కుల జాతీయ వేదిక' తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం దీనిపై స్పందించి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాలల స్థాయి నుంచి ఉన్నత విద్యా సంస్థల వరకు.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించగలిగే సిబ్బందిని కూడా నియమించాలని అభ్యర్థించారు.

# మహిళలకు రుణ బీమా!

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలు ఎవరైనా అనుకోని సందర్భంలో మరణిస్తే.. వారు తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు పేద కుటుంబాలు అవస్థలు పడుతుంటాయి. సదరు మహిళ కుటుంబ సభ్యులు చెల్లించలేని పరిస్థితి ఉంటే.. ఇతర గ్రూపు సభ్యులే ఆ రుణ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోంది. ఈ అవస్థలకు చెక్ పెడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణ బీమాను వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళలకు జీవిత బీమాతో పాటు వారు పొందిన రుణాలపైనా బీమా వర్తింపజేసేలా చర్యలు చేపట్టింది. ఈ విధానం అమల్లోకి వచ్చాక.. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే సంబంధిత రుణాన్ని సదరు బీమా కంపెనీ చెల్లిస్తుంది. సదరు మహిళ కుటుంబానికి 10లక్షల మేర బీమా సొమ్ము అందుతుంది. రాష్ట్రంలోని 6.1లక్షల ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని 61లక్షల మంది మహిళలకు బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎన్నికల కోడ్ ఉండడంతో బీమా ప్రీమియం చెల్లింపు ప్రక్రియ చేపట్టలేదు. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఎస్‌హెచ్‌జీ మహిళలకు జీవిత బీమాతోపాటు, వారు తీసుకున్న రుణాలకూ బీమాను వర్తింపజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం బీమా కంపెనీతో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు సంబంధిత విభాగాలు తెలిపాయి. మరణించిన మహిళ వివరాలను స్త్రీనిధి పోర్టల్ అప్‌లోడ్ చేశాక 15 రోజుల్లోగా బీమా క్లెయిమ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టనున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ వర్గాలు తెలిపాయి.

## చిరుతను తప్పించబోయి కారు బోల్తా

» భార్య మృతి.. భర్తకు తీవ్రగాయాలు



లలిత (ఫైల్)

మోపాల్, జూన్ 26: అర్ధరాత్రి హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చిన ఓ చిరుతను తప్పించబోగా కారు బోల్తా కొట్టింది.. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా.. కారు నడుపుతున్న ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన ప్రభాకర్ వ్యాపారం చేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. భార్య లలిత (30)కు కొంతకాలంగా ఆరోగ్యం బాగలేకపోవడంతో ప్రభాకర్ మంగళవారం రాత్రి యాచారం నుంచి నిజామాబాద్‌కు కారులో తీసుకెళ్లి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేయించాడు. అదే రాత్రి తిరిగి వెళ్తుండగా.. మార్గమధ్యలో మోపాల్ మండలం ఎల్లమ్మకుంట గ్రామ అటవీ ప్రాంతంలో హఠాత్తుగా రోడ్డుపై చిరుత ఎదురుగా వచ్చింది. దీంతో దాన్ని తప్పించబోయిన ప్రభాకర్.. ఎదురుగా ఉన్న బండరాయిని ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు గిరిజనులు ప్రమాదాన్ని చూసి వెంటనే వీరిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే లలిత మరణించిందని వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్ చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి కూడా విషమంగానే ఉందని సమాచారం.

## ఆరుగురికి తెలంగాణ సారస్వత పరిషత్తు అవార్డు

హైదరాబాద్ సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు ఈ ఏడాదికి గాను తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి పురస్కారాలను బుధవారం ప్రకటించింది. 'మత్తడి దునికిన కోపుల నీళ్లు' నవల (వెన్నం ఉపేందర్), 'తెలంగాణ కవి ముద్ర' విమర్శ (బండారి రాజ్‌కుమార్), 'కండిషన్స్ అప్లయ్' కథా సంపుటి (డాక్టర్ పసునూరి రవీందర్), 'అద్దం నా చిరునామా కాదు' వచన కవిత్వం (తోట నిర్మలారాణి), 'శ్రీ రామాయణోపనిషత్తు' పద్య కవిత్వం (రాచాలపల్లి బాబు దేవీదాసశర్మ), 'రచ్చబండ' నాటికల సంపుటి (రావుల పుల్లాచారి) పుస్తకాలను ఎంపిక చేసినట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' కవితా సంపుటికిగాను కవి పోలీస్ భూమేష్‌కు యువ పురస్కారం ప్రదానం చేయనున్నారు. పుస్తకాలతో నిమిత్తం లేకుండా సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న నలుగురు ప్రముఖులకు ప్రతి ఏటా తెలంగాణ సారస్వత పరిషత్ వరిష్ఠ పురస్కారాలు అందిస్తోంది. ఈ సంవత్సరం ప్రముఖ సాహితీవేత్త శ్రీరంగాచార్య, ప్రముఖ కవి మంగారి రాజేందర్ (జింబో), ప్రజాకవి జయరాజ్, కథా రచయిత బోరి మురళీధర్‌ను ఎంపిక చేసినట్లు పరిషత్తు నిర్వాహకులు వెల్లడించారు.

## ఐడీడీఎంపీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూన్26(ఆంధ్రజ్యోతి): స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలిసి నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐడీడీఎంపీ)లో ప్రవేశాలకు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ దరఖాస్తులు ఆహ్వానించింది. ఐడీడీఎంపీలో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బీటెక్, ఎంఎస్ పూర్తి చేయవచ్చు. ఇందులో మూడున్నరేళ్లు జేఎన్‌టీయూలో, ఏడాదిన్నర స్వీడన్‌లోని బీటీహెచ్ విశ్వవిద్యాలయంలో చదువుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా బీటెక్, ఎంఎస్ పూర్తి చేసేందుకు కనీసం ఆరేళ్లు పడుతుంది. ఐడీడీఎంపీ ప్రోగ్రామ్‌లో చేరాలనుకునే విద్యార్థులు జూలై 8లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డాక్టర్ జీ.కృష్ణమోహనరావు బుధవారం పేర్కొన్నారు. ఆలస్య రుసుముతో జూలై 11వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.ఐడీడీఎంపీ కోర్సు పూర్తిచేసిన వారు స్వీడన్‌లో ఉద్యోగం చేసేందుకు బీటీహెచ్ యూనివర్సిటీ ఎంఎస్ సర్టిఫికెట్ ఇస్తుంది. అలాగే, జేఎన్‌టీయూ బీటెక్‌తోపాటు ఎంటెక్ సర్టిఫికెట్లు ఇస్తుంది.

## విషం తాగుతూ వాట్సా్‌పలో ఫొటోలు !

» ఉద్యోగుల ముందు తండ్రి కొట్టాడని కుమారుడి దుశ్చర్య

» ఫొటోలు చూసి అతని బావ ఫిర్యాదు.. కాపాడిన ఖాకీలు

చేవెళ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగుల ముందు తండ్రి కొట్టాడని మనస్తాపానికి గురైన కుమారుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ యువకుడు పురుగు మందు తాగుతూ వీడియో, ఫొటోలు తీసి వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. అది చూసిన అతని బావ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆ యువకుడిని కాపాడారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వికారాబాద్ జిల్లా గిరిగేట్‌పల్లికి చెందిన విఠలయ్య కుమారుడు ఆనంద్.. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. నాలుగు రోజులుగా తండ్రి విఠలయ్య ఫోన్ చేయగా ఆనంద్ ఎత్తలేదు. దాంతో తండ్రి ఈ నెల 25న మెడికల్ కళాశాలకు వచ్చి విధుల్లో ఉన్న ఆనంద్‌ను అందరి ముందు కొట్టాడు. తోటి ఉద్యోగుల ముందు తండ్రి చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఆనంద్ బుధవారం ఉదయం పురుగు తాగుతూ వీడియో, ఫొటోలు తీసి తన ఫోన్లో వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. గమనించిన ఆనంద్ బావ జంగయ్య వెంటనే పోలీసులకు చెప్పడంతో.. ఎస్సై ప్రదీప్ కుమార్ వెంటనే ఆనంద్ సెల్‌ఫోన్ లోకేషన్‌ను ట్రేస్ చేసి చేవెళ్ల కొనగట్టు శివాలయం పక్కన ఉన్నట్లు గుర్తించారు. వెంటనే కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు నమేశ్‌లను అక్కడికి పంపించగా.. ఆనంద్‌ను వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆనంద్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## సీపీజీఈటీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తార్నాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీఎస్ సీపీజీఈటీ - 2024 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల కన్వీనర్ ప్రొ. పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఈ పరీక్షలకు జంటనగరాలతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓయూతో పాటు కాకతీయ, జేఎన్‌టీయూ, శాతవాహన, తెలంగాణ మహిళా యూనివర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూలై 6 నుంచి 15 వరకు మొత్తం సబ్జెక్టులకు ప్రవేశ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

## చిట్కుల్ చెరువులో పది టన్నుల చేపల మృత్యువాత

పటాన్‌చెరు రూరల్, జూన్ 26: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం పెద్ద చెరువులో బుధవారం భారీ మొత్తంలో చేపలు మృత్యువాత పడ్డాయి. నాలుగు రోజుల్లో పదిటన్నుల వరకు చేపలు మృతి చెందాయని పీసీబీ, మత్స్యశాఖ అధికారులకు స్థానికులు తెలిపారు. పక్కనే ఉన్న ప్రైవేటు మెడికల్ కాలేజీ వ్యర్థాలు చెరువులో కలవడం వల్లే చేపలు మృతి చెంది ఉండవచ్చునని అధికారులకు మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. కాగా, పాశమైలారం పరిశ్రమల కాలుష్య జలాలు ఇస్నాపూర్ పెద్ద చెరువు నుంచి చిట్కుల్ చెరువులోకి చేరడం వల్లే చేపలు మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మా 'జొర్రో' చాలా మంచిది

» అధికారులు తీసుకెళ్లకుండా స్టే ఇవ్వండి

» సానుకూలంగా స్పందించిన ధర్మాసనం

» హైకోర్టుకు చేరిన పెంపుడు శునకాల వివాదం

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తన పెంపుడు శునకాన్ని జీహెచ్ఎంసీ, వెటర్నరీ, పోలీసులు అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ యజమాని హైకోర్టును ఆశ్రయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సోమాజిగూడ ఆల్పైన్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ లోక్‌దీప్ శర్మ ఈ పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌దీప్‌శర్మకు చెందిన రెండేళ్ల జర్మన్ షెఫర్డ్.. 'జొర్రో' తనను గాయపరిచిందంటూ ఓ వ్యక్తి కేసుపెట్టగా కుక్కను స్వాధీనం చేసుకోవడానికి అధికారులు వచ్చారు. దీన్ని అడ్డుకోవాలని కోరుతూ లోక్‌దీప్ శర్మ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు ఐపీసీ సెక్షన్ 289 కింద కేసు నమోదు చేశారని, కాని దాని ప్రకారం పెంపుడు జంతువును స్వాధీనం చేసుకునే అధికారం వారికి లేదని తెలిపారు. జొర్రోకు నిపుణుల చేత శిక్షణ ఇప్పించారని, వ్యాక్సిన్ వేయించారని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'జొర్రో'ను తీసుకెళ్లకుండా స్టే ఉత్తర్వులు ఇచ్చింది.

# సమ్మె విరమించిన జూడాలు



మీడియా సమావేశంలో మంత్రి దామోదర, జూడాల ప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరు కానున్నారు. ఈ విషయాన్ని జూడాలు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ప్రకటించారు. దీంతో రెండు రోజులుగా జూడాలు చేస్తున్న ఆందోళనకు తెరపడింది. తెలంగాణ జూనియర్ డాక్టర్ల ఇబ్బందులను వెంటనే పరిష్కరించామని మంత్రి దామోదర వెల్లడించారు. ఆయన జూడాలతో కలిసి మీడియాతో మాట్లాడారు. జూడాలు గతంలో రెండు సార్లు స్టైపెండ్ గురించి తమ దృష్టికి తెచ్చారన్నారు. ప్రతిసారి స్టైపెండ్ సమస్య ఎదురవుతున్నట్లు చెప్పారని, గ్రీన్ చానల్ ద్వారా చెల్లించాలని, అలాగే మెడికల్ కాలేజీల్లో వసతి భవనాలు ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. వైద్యులకు రక్షణ కావాలని అభ్యర్థించారని మంత్రి చెప్పారు. వారితో జరిగిన చర్చలు ఫలించాయన్నారు. జూడాల స్టైపెండ్ కోసం రూ.406 కోట్లు విడుదల చేశామని తెలిపారు. గాంధీ, ఉస్మానియాలో హాస్టళ్లు నిర్మించాలని కోరడంతో అక్కడికి అధికారులను పంపగా.. వారు హాస్టళ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని తేల్చారని చెప్పారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టళ్లు, రోడ్డు నిర్మాణం, మరమత్తులకు రూ.121 కోట్లు కేటాయించామని వెల్లడించారు. అలాగే గాంధీ మెడికల్ కాలేజీకి రూ.79 కోట్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో రహదారుల పునరుద్ధరణకు రూ.3.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేవలం రెండు రోజుల్లోనే జూడాల సమస్యలకు సంబంధించి రూ.610 కోట్లు విడుదల చేశామన్నారు. వెంటనే స్పందించి, నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. అక్కడ కొత్త భవన నిర్మాణానికి తాము సానుకూలంగా ఉన్నామని చెప్పారు. త్వరలోనే సంచార ఆహార ప్రయోగశాల (మొబైల్ ఫుడ్ ల్యాబ్స్)ల సంఖ్యను పెంచుతామని.. ఫుడ్, డ్రగ్ ల్యాబ్‌లను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తూ, ప్రైవేటు ఆస్పత్రులను జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.. ఇక ఇదే మీడియా సమావేశంలో పాల్గొన్న జూడాల ప్రతినిధులు తాము సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తూ, గురువారం నుంచి విధులకు హాజరవుతామని చెప్పారు. అలాగే ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి దామోదరకు శాలువా కప్పి సన్మానించారు.

# ఆషాఢంలోపే విస్తరణ!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు. ఆ తర్వాతే నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించనున్నారు. జూలై 7న ఆషాఢ మాసం ప్రారంభమవుతున్నందున.. ఆలోపే మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం చేపడతారని భావిస్తున్నారు.

### రెండు మూడు పదవులు పెండింగ్‌లో..

మంత్రివర్గంలో ఆరుగురిని చేర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి నలుగురికే అవకాశం ఇవ్వొచ్చని భావిస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యంపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఎడ్మ బొజ్జును మంత్రివర్గంలోకి తీసుకోవడంపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ ఇందిరమ్మ ఇంట్లోనే నివసిస్తున్న ఎడ్మ బొజ్జుకు అవకాశం కల్పించి, ఒక సంకేతాన్ని ఇద్దామన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమైనట్లు తెలుస్తోంది. అయితే ప్రేమ్‌సాగర్‌రావు పేరును డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రతిపాదిస్తున్నారు. ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అవకాశం దక్కవచ్చని చెబుతున్నారు. ఇక పార్టీలో చేరినప్పుడు ఇచ్చిన హామీ మేరకు తనకు మంత్రి పదవి కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు. ఆయనకు కూడా అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు సమాచారం. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే బీఆర్ఎస్ నుంచి చేరికలు, ముస్లింకు ఒక బెర్తు కేటాయించాల్సి ఉండడం, హైదరాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉన్నందున.. రెండు నుంచి మూడు బెర్తులు పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.



సుదర్శన్‌రెడ్డి



వాకిటి శ్రీహరి

### నామినేటెడ్ పదవులు కూడా..

రాష్ట్రంలో నామినేటెడ్ పదవులకు 37 మందిని ఎంపిక చేసినప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో పెండింగ్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. అయితే వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇద్దరు, వరంగల్ జిల్లాలో ఒకరిపై మంత్రుల నుంచి అభ్యంతరాలు రావడంతో ఉత్తర్వుల జారీలో ఆలస్యం అవుతోంది. వీరి నియామకాలపైనా అధిష్ఠానంతో జరిపిన చర్చల్లో స్పష్టత వచ్చిందని, కొద్ది రోజుల్లోనే 37 నామినేటెడ్ పోస్టులకు సంబంధించి ఉత్తర్వులు జారీ అవుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## పీసీసీ అధ్యక్ష రేసులో నలుగురు?

ఇక పీసీసీ అధ్యక్ష పదవికి ముగ్గురు బీసీలు, ఒక మాదిగ నేత రేసులో ఉన్నట్లు తెలిసింది. బీసీ విభాగంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాదిగ వర్గానికి చెందిన సంపత్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో పలువురు నేతలు రాజధానికి చేరుకున్నారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, బల్మూరి వెంకట్, రామచంద్ర నాయక్, మధుయాష్కీ తదితరులు ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా బుధవారం ఢిల్లీ చేరుకుని సోనియాగాంధీని కలిశారు. మర్యాదపూర్వకంగా సోనియాను కలిసినట్లు చెప్పిన ఉత్తమ్.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మంచి ఫలితాలు సాధించినందుకు, ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గురుతర బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సోనియా ఆరా తీశారని చెప్పారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితరులను గురువారం కలుసుకుంటానని తెలిపారు.

## 3 వైద్య కాలేజీలకు రూ. 204 కోట్లు

» ఉస్మానియా, గాంధీలో గర్ల్స్, మెన్స్ హాస్టళ్ల నిర్మాణం

» జూడాల డిమాండ్ల నేపథ్యంలో జీవో జారీ

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ డాక్టర్ల డిమాండ్ల నేపథ్యంలో రాష్ట్రంలో మూడు పాత మెడికల్ కాలేజీలకు రూ.204 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల్లో హాస్టళ్లు, రోడ్లు, ఇతర వసతులను సమకూర్చుకొనేందుకు ఈ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ లేడీస్ హాస్టల్‌కు రూ.80 కోట్లు, మెన్స్ హాస్టల్‌కు రూ.35 కోట్లు, డెంటల్ హాస్టల్‌కు రూ.6 కోట్లు, ప్రస్తుత పాత హాస్టల్ మరమ్మతులకు రూ. 50 లక్షలు, కృష్ణవేణి లేడీస్ హాస్టల్ సీసీ రోడ్లకు రూ. 40 లక్షలు, గాంధీ మెడికల్ కాలేజీ లేడీస్ హాస్టల్‌కు రూ.42 కోట్లు, మెన్స్ హాస్టళ్లకు రూ.23 కోట్లు, సీనియర్ రెసిడెంట్‌ల హాస్టల్ బ్లాక్ నిర్మాణానికి రూ.14.50 కోట్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు రూ. 2.75 కోట్లు, జీఎస్టీ, ఇతర ఖర్చులకు రూ.70 లక్షల చొప్పున కేటాయించారు.

## పదోన్నతులు కల్పించండి

- ల్యాబ్ టెక్నీషియన్ల ఆందోళన

ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలని సెంట్రల్ అసోసియేషన్ యూనియన్ ఆందోళన చేపట్టింది. ఈమేరకు తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కోఠిలో హెల్త్ డైరెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ.. ఎల్టీ గ్రేడ్ వన్ పదోన్నతుల జాప్యంతో గత 30 ఏళ్లుగా ఎల్టీ గ్రేడ్‌గా పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు.

## మెడపై కత్తి పెట్టి.. కారు అపహరణ

» శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఆవరణలో ఘటన

» గంటల వ్యవధిలో నిందితుల అరెస్టు

» పాత నేరస్థులుగా గుర్తింపు.. రిమాండ్‌కు తరలింపు

శంషాబాద్ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల్లా కారును ఆపి.. కత్తితో డ్రైవర్‌ను బెదిరించి కారు అపహరించిన ఘటన శంషాబాద్ విమానాశ్రయం ఆవరణలో బుధవారం చోటు చేసుకుంది. అయితే బాధితుడు వెంటనే తేరుకొని పోలీసులు సమచారమివ్వగా.. గంటల వ్యవధిలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ రాజు తన యజమానిని కారులో విమానాశ్రయంలో దింపాడు. తిరిగి రాజు ఇంటికెళ్లే సమయంలో అక్కడే తిష్ఠ వేసిన నజీముల్లా, ఎండీ అబ్దుల్ ఖదీర్ ప్రయాణికుల్లా కారును ఆపారు. కారు ఆగగానే రాజు మెడపై కత్తి పెట్టి కిందికి దిగకపోతే చంపుతామని వారు బెదిరించారు. దాంతో భయపడిన రాజు కారు దిగగా.. నజీముల్లా, ఖదీర్‌లు కారుతో ఉడాయించారు. దీంతో రాజు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు.. సీసీ ఫుటేజీ ఆధారంగా కారు ఏ మార్గంలో వెళ్లిందో గుర్తించారు. బెంగళూరు హైవేపై గగన్‌పహాడ్ వద్ద కారును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. అయితే ఇద్దరు నిందితులు.. పాత నేరస్థులేనని, వారిపై రెండు హత్యలతో పాటు పలు కేసులున్నాయని ఏసీపీ శ్రీనివాస్ చెప్పారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

## నీట్ సాధనకు 'కోటా' డిజిటల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నీట్-2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' నీట్ స్టడీ మెటీరియల్, క్విక్ రివిజన్, ఎన్‌సీఈఆర్‌టీ మాక్స్, ప్రీవియస్ ఇయర్స్ మాక్స్, టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్టులకు చాప్టర్ల వారీగా (డిజిటల్) బుక్‌లెట్స్ సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం బుధవారం తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్స్‌ను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం NEET 2025 అని టైపు చేసి వాట్సాప్ నంబర్ 9849016661కు మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

## సచివాలయ సీఎస్‌వోగా గంగారం

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ముఖ్య భద్రతా అధికారి(సీఎస్‌వో)గా 3వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ టి. గంగారం నియమితులయ్యారు. ఇప్పటి వరకు సీఎస్‌వోగా వ్యవహరించిన కమాండెంట్ ఏకే మిశ్రాను ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్‌కు అటాచ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# వ్యవసాయ బడ్జెట్.. 64 వేల కోట్లు!

**ఆర్థికశాఖకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు.. పంట రుణాల మాఫీకి రూ. 31 వేల కోట్లు**

» ఒక్కో రైతు కుటుంబానికి 2 లక్షల మాఫీ

» 'రైతుభరోసా'కు రూ.23 వేల కోట్లు

» పరిమితి విధించి పథకం అమలు!

» పంటల బీమా పథకానికి 3 వేల కోట్లు

» రైతు బీమాకు రూ.1,500 కోట్లు!



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ పథకాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.64 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని వ్యవసాయశాఖ ప్రతిపాదనలు తయారు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న రుణమాఫీ పథకానికి రూ.31 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.23 వేల కోట్లు, ఉచిత పంటల బీమా పథకానికి రూ.3 వేల కోట్లు, రైతుల బీమాకు రూ.1,500 కోట్ల నిధులు అవసరసమవుతాయని అధికారులు అంచనా వేశారు. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు, ఇతర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంటు, ఉద్యోగుల వేతనాలు.. అన్నింటికీ కలిపి మరో రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని లెక్కించారు. మొత్తమ్మీద ఏడాదికి రూ.64 వేల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేసి ఆర్థికశాఖకు సమర్పించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టబోయే పథకాల్లో వ్యవసాయశాఖకు సంబంధించినవే కీలకంగా ఉండడం గమనార్హం. ప్రధానంగా రూ.2 లక్షల రుణమాఫీ పథకానికి పెద్ద ఎత్తున నిధులు సమకూర్చాల్సి వస్తోంది. ఇందుకోసం రూ.31 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఇటీవల కేబినెట్ భేటీ తర్వాత రుణమాఫీ లెక్కలు వెల్లడించారు. ఈ క్రమంలో.. వచ్చే బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.31 వేల కోట్లకు ప్రతిపాదనలు పెట్టారు.

### ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్..

ఈ ఖరీఫ్ సీజన్ నుంచే 'బోనస్' పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. సన్నరకాలు సాగుచేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం వస్తుంది? ఎంత సేకరిస్తారు? అనే దానిని బట్టి నిధులు అవసరమవుతాయి. టన్నుకు రూ.5 వేల చొప్పున.. ఎన్ని టన్నుల ధాన్యం సేకరిస్తే.. అన్ని నిధులు రాష్ట్ర ప్రభుత్వం సన్నాల రైతులకు చెల్లించాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా.. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 25న వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటు ద్వారా వచ్చే పథకాలు, నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు, రాబోయే సీజన్‌కు పిలవాల్సిన క్రాప్ ఇన్సురెన్స్ టెండర్లపై చర్చించారు. రైతు సంక్షేమ, వ్యవసాయ పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, తమ హామీలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్‌పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగానే వ్యవసాయశాఖ అధికారులు రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికశాఖకు సమర్పించారు.

### రైతు భరోసాకూ పెరుగుతున్న బడ్జెట్..

రైతుభరోసా పథకానికి కూడా బడ్జెట్ పెరుగుతోంది. గతంలో రైతుబంధు పథకంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.10 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు రైతుభరోసా పథకంలో ప్రతి సీజన్‌కు రూ.7,500 చొప్పున.. ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రైతుభరోసా ప్రారంభమవుతోంది. అయితే ఎకరానికి రూ.5 వేలు పెరుగుతున్న నేపథ్యంలో బడ్జెట్ కూడా పెరుగుతోంది. గతంలో ఏడాదికి రూ.15 వేల కోట్ల నిధులు రైతుబంధుకు పెట్టేవారు. ఈ ప్రభుత్వం రూ.23 వేల కోట్ల బడ్జెట్‌లో పెడుతున్నట్లు సమాచారం. అయితే ఈ పథకంలో ఇకపై పరిమితి విధించనున్నారు. గతంలో ఎంత భూమి ఉన్నా రైతుబంధు ఇవ్వగా.. ఇప్పుడు కటాఫ్ పెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ఏ ప్రాతిపదికన అనర్హులను తొలగించాలన్న అంశంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక రాష్ట్రంలో ఐదేళ్లుగా పంటలబీమా పథకం అమలు కావడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించి.. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన (పీఎం-ఎఫ్‌బీవై)లో చేరింది. అయితే మెరుగైన పంటల బీమా అమలుచేసేందుకు కసరత్తు చేస్తోంది. రైతులపై ప్రీమియం భారం వేయకుండా.. ఉచితంగా క్రాప్ ఇన్సురెన్స్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను రూ.3 వేల కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు సమాచారం. ఇక రైతులకు కూడా రూ.5 లక్షల బీమా పథకం గత ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతోంది. ఎల్‌ఐసీతో అనుసంధానమై రైతులకు బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. రైతుల తరఫున ప్రీమియం చెల్లించేందుకు బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు ప్రతిపాదించడం గమనార్హం. వీటితోపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రూ.500 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిసింది.

# హోంగార్డులు ఎంతమంది?

» లెక్క తేల్చే పనిలో ఉన్నతాధికారులు

» యూనిట్ల వారీగా వివరాల సేకరణ

» ట్రాఫిక్ విధులకు సర్దుబాటు

» నూతన నియామకాలకూ అవకాశం


» ఓడీ, కారుణ్య నియామకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్న హోంగార్డులు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి హోంగార్డుల్ని నియమించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. అందులో భాగంగా మొత్తం హోంగార్డుల లెక్క తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. యూనిట్ల వారీగా ఎంతమంది హోంగార్డులు ఉన్నారు, ఎంత కాలంగా పనిచేస్తున్నారు, ఆయా కార్యాలయాల్లో వారి రోజువారి పని ఏమిటి? ఇలా ప్రత్యేక ఫార్మాట్‌లో వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న హోంగార్డుల సేవల్ని సర్దుబాటు చేయడంతోపాటు కొత్తగా ఎంతమందిని నియమించాల్సి ఉంటుందనే అంశంపై నిర్ణయం తీసుకునేందుకు అధికారులు ఈ వివరాలు సేకరిస్తున్నారు. కొత్త హోంగార్డుల నియామకంపై సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్న హోంగార్డులు మరోవైపు ఇప్పటికే ఇతర విభాగాల్లో(ఓడీ) విధులు నిర్వహిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మంది హోంగార్డులు ఆయా ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అందులో సుమారు రెండు వేల మంది హోంగార్డులు ఓడీ విధుల్లో ఉన్నారు. కొత్తగా చేపట్టే నియామకాల్లో ఓడీ హోంగార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని వారికి రెగ్యులర్ డ్యూటీలు ఇవ్వాలని కోరుతున్నారు. 2015 నుంచి కారుణ్య నియామకాలు నిలిచిపోయాయని, కరోనా, అలాగే విధి నిర్వహణ సమయాల్లో వందలాది హోంగార్డులు మృతి చెందారని, ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గతంలో హోంగార్డులు రమేష్, రవీందర్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో గాంధీ ఆస్పత్రి వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హోంగార్డుల్ని రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 27 జూన్ 2024

# పీజీ, పీహెచ్‌డీ



## పెట్రో వర్సిటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. జైస్‌లోని ఆర్‌జీఐపీటీ, బెంగళూరులోని ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, శివసాగర్‌లోని అస్సాం ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

**ఎంటెక్ విభాగాలు-సీట్లు:** జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాల్లో ఒక్కోదానిలో 10 సీట్లు ఉన్నాయి. బెంగళూరు ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ 15, ఎలక్ట్రానిక్ వెహికిల్ టెక్నాలజీ 20 సీట్లు ఉన్నాయి.

### పీహెచ్‌డీ విభాగాలు-సీట్లు

- జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోకెమికల్ ఇంజనీరింగ్ 6, సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ 7, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ జియో ఇంజనీరింగ్ 3, మేథమెటికల్ సైన్సెస్ 3, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 6, మేనేజ్‌మెంట్ స్టడీస్ 2 సీట్లు ఉన్నాయి.
- ఈఐబీ సెంటర్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 6 సీట్లు ఉన్నాయి.
- ఏఈఐ సెంటర్లో కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 9 సీట్లు ఉన్నాయి.

### అర్హత వివరాలు

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- పీహెచ్‌డీలో ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా కనీసం 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ ఇన్ సైన్స్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. హ్యూమానిటీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ ఇంజనీరింగ్ లేదా మాస్టర్స్ డిగ్రీ(హ్యూమానిటీస్/సైన్సెస్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/సైన్సెస్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (మేనేజ్‌మెంట్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. అన్ని విభాగాలకు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

### ఎంపిక

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ స్కోర్ లేని అభ్యర్థులు సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. నేషనల్ లెవెల్ స్కాలర్‌షిప్‌లు సాధించినవారు, కనీసం 80 శాతానికి మించి అకడమిక్ మార్కులు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరైతే చాలు.
- ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో చేరే వారు రాత పరీక్ష రాయనవసరం లేదు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 5
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూలై 11, 12
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **తరగతులు ప్రారంభం:** జూలై 30 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

## నలంద యూనివర్సిటీ

బిహార్‌లోని నలంద యూనివర్సిటీ-మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మాస్టర్స్‌లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలకు చెందిన అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/టీఓఈఐసీ/ పీటీఈ/ ఎస్‌టీఈఏపీ అర్హత పొంది ఉండాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకొనే వీలుంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి నాలుగేళ్లు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ పీస్ స్టడీస్, ఆర్కియాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్
- **పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** వరల్డ్ లిటరేచర్, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, హిందూ స్టడీస్(సనాతన)

### అర్హత

- మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ (హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులై ఉండాలి. 250 పదాలకు మించకుండా సెల్ఫ్ ఇంట్రడక్షన్/ బయో నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్‌ఓపీ)లో భాగంగా వంద పదాలకు మించకుండా నలంద యూనివర్సిటీలో చదవాలనుకోవడానికి కారణాలు, 300 నుంచి 500 పదాలకు మించకుండా సంబంధిత ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి గల కారణాలు వివరిస్తూ ఆర్టికల్ రాయాలి.
- ఎంబీఏ (సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో చేరాలనుకొనే వారు కనీసం 70 శాతం స్కోర్‌తో క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్ అర్హత పొంది ఉండాలి. ప్రభుత్వ సంస్థలు/ప్రముఖ పీఎస్‌యూలలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్ లేదా డిగ్రీ స్థాయిలో 3/4 జీపీఏ ఉండాలి.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. సెల్ఫ్ ఇంట్రడక్షన్, రికమండేషన్/రిఫరెన్స్ లెటర్స్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రీసెర్చ్ ప్రపోజల్, ఏవైనా రెండు/మూడు పబ్లిష్డ్ లేదా నాన్ పబ్లిష్డ్ పేపర్స్ సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం ఎనిమిది నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి.

**ఎంపిక:** ప్రోగ్రామ్‌ను అనుసరించి అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంగ్లీష్ సంబంధిత టెస్ట్ స్కోర్‌లు, ఎస్‌ఓపీ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **చివరి తేదీ:** జూలై 10
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో జీఎంఈ ట్రెయినింగ్



కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధ్వర్యంలోని మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ)- గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏడాదిపాటు ప్రీ సీ ట్రెయినింగ్ ఉంటుంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌నకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) గుర్తింపు ఉంది. స్టయిపెండ్ సౌకర్యం లేదు. మొత్తం 114 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన వెంటనే ఆర్నెల్ల వ్యవధిగల షిప్‌బోర్డ్ ట్రెయినింగ్ పొందాల్సి ఉంటుంది. ఈ శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు డీజీఎస్ నిర్వహించే ఎంఈఓ క్లాస్- 4 సీఓసీ ఎగ్జామ్ రాసేందుకు అర్హత లభిస్తుంది.

**ప్రోగ్రామ్ వివరాలు:** ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డీజీఎస్, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్(ఐఎంఓ) నిబంధనల ప్రకారం క్లాస్ రూం తరగతులు, ల్యాబొరేటరీ వర్క్‌లు, వర్క్‌షాప్ ప్రాక్టీస్‌లతోపాటు సీ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులందరూ ట్రెయినింగ్ మాన్యువల్, వర్క్ డెయిరీ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. సమయానుసారం రిటెన్ టెస్ట్‌లు, ప్రాక్టికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. అడ్మిషన్ నాటికి పాస్‌పోర్ట్ పొంది ఉండాలి.

● ప్రోగ్రామ్‌నకు సంబంధించిన స్టడీ మెటీరియల్, టార్ బుక్, ట్రెయినింగ్ మాన్యువల్ అందిస్తారు. భోజన, వసతి సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులన్నీ కోర్సు ఫీజులోనే ఉంటాయి. వర్కింగ్ డ్రెస్ కింద ఒక జత సేఫ్టీ షూస్, రెండు జతల బ్లాక్ సాక్స్, ఒక సేఫ్టీ హెల్మెట్ ఇస్తారు. యూనిఫామ్ కింద అయిదు వైట్ షర్ట్‌లు, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, ఒక వైట్ ప్యాంట్, వైట్ క్యాప్, ఒక జత ఎపొలెటర్‌లు ఇస్తారు. పీటీ డ్రెస్ కింద రెండు బ్లూ షార్ట్‌లు, రెండు జతల వైట్ టీ షర్ట్‌లు, రెండు జతల వైట్ సాక్స్, ఒక స్విమ్మింగ్ ట్రంక్ ఇస్తారు. పర్సనల్ లాకర్, నాలుగు బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో, రెండు పిల్లో కవర్‌లు, రెండు టవల్స్, ఒక మ్యాట్రెస్ కవర్ కూడా ఇస్తారు.

● ఎంపికైన అభ్యర్థులు ఒక జత బ్లాక్ షూస్, ఒక జత వైట్ కాన్వాస్ పీటీ షూస్, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, మూడు బాయిలర్ సూట్‌లు(ఆరెంజ్ కలర్ ఫుల్ స్లీవ్స్ కాటన్), రెండు స్లీపింగ్ సూట్స్ (వైట్), ఒక జత స్లిప్పర్స్, షూ బ్రష్, షూ పాలిష్ (బ్లాక్, వైట్), రెయిన్ కోట్, రెండు బాత్ రోబ్స్ వెంట తెచ్చుకోవాలి. ఒక పాకెట్ క్యాలిక్యులేటర్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా తెచ్చుకోవాలి.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి (బీఈ/బీటెక్) (మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్ అండ్ ఆటోమొబైల్స్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్/ మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. పదోతరగతి/ఇంటర్/ డిప్లొమా/డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. డీజీఎస్ నిర్దేశించిన ప్రకారం మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సందర్భానుసారం సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.4,75,000
- **అడ్మిషన్ ఛార్జెస్:** రూ.10,000
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ మెయిల్ ద్వారా పంపాలి. నిర్దేశిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఇంగ్లీష్ మార్కుల ప్రూఫ్ కోసం పదోతరగతి/ ఇంటర్/ డిప్లొమా మార్కుల పత్రాలు; పాస్‌పోర్ట్; సంతకం; అభ్యర్థి ఫొటో; కుల ధ్రువీకరణ పత్రం; మెడికల్ సర్టిఫికెట్.
- **స్పీడ్ పోస్ట్/ కొరియర్ ద్వారా దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **చిరునామా:** హెచ్‌ఓడీ, మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ), విజ్ఞాన సాగర్, గిరినగర్-682020, ఎర్నాకుళం, కేరళ.
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **ఈ-మెయిల్:** metihod@cochinshipyard.in
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.in

## జాబ్ కార్నర్

### నార్త్ ఈస్టర్న్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 1104

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్- నార్త్ ఈస్టర్న్ రైల్వే... ఎన్‌ఈఆర్ పరిధిలోని కింద పేర్కొన్న యూనిట్లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**వర్క్‌షాప్/యూనిట్:** మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్‌నగర్), డీజిల్ షెడ్(ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(లఖ్‌నవూ జంక్షన్), డీజిల్ షెడ్(గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి)

**పోస్టు:** యాక్ట్ అప్రెంటిస్

**ట్రేడ్:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.

**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్ ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

**వయోపరిమితి:** 2024 జూన్ 12 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

**శిక్షణ వ్యవధి:** ఒక ఏడాది

**ఎంపిక:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా

**దరఖాస్తు రుసుము:** రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11

**వెబ్‌సైట్:** ner.indianrailways.gov.in/

### ఎన్‌హెచ్‌ఏఐలో రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఉద్యోగాలు

ఖాళీలు 38

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖకు చెందిన న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)... డీపీఆర్ విభాగంలో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రిన్సిపల్ డీపీఆర్ ఎక్స్‌పర్ట్: 5 పోస్టులు
2. సీనియర్ హైవే ఎక్స్‌పర్ట్: 5
3. రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్: 5
4. ట్రాఫిక్ ఎక్స్‌పర్ట్: 5
5. ఎన్విరాన్‌మెంట్/ఫారెస్ట్ స్పెషలిస్ట్: 5
6. ల్యాండ్ అక్విజిషన్ ఎక్స్‌పర్ట్: 5
7. జియో టెక్నికల్ ఎక్స్‌పర్ట్: 5
8. బ్రిడ్జ్ ఎక్స్‌పర్ట్: 2
9. టన్నెల్ ఎక్స్‌పర్ట్: 1

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 18

**వెబ్‌సైట్:** https://nhai.gov.in/

### ఆర్‌ఐఈలో టీచింగ్ సిబ్బంది

ఖాళీలు 20

మైసూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్‌ఐఈ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న టీచింగ్ ఖాళీల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజిక్స్, మేథ్స్, జువాలజీ, కెమిస్ట్రీ, ఇంగ్లిష్): 8 పోస్టులు
2. ప్రీప్రైమరీ నర్సరీ టీచర్: 3
3. ఒకేషనల్ టీచర్(రిటైల్, ఐటీ- ఐటీఈఎస్): 2
4. పీజీటీ(ఇంగ్లిష్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్): 2
5. వర్క్ ఎక్స్‌పీరియన్స్ టీచర్(హోమ్ సైన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్): 2
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్(బోటనీ): 1
7. కంప్యూటర్ అసిస్టెంట్(డీసీజీసీ): 1
8. కోర్సు అడ్మినిస్ట్రేటర్: 1

**అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, డీఎడ్, ఎంఈడీ, నెట్/కేసెట్/స్లెట్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

**గరిష్ఠ వయోపరిమితి:** అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 70 ఏళ్లు, ప్రీప్రైమరీ నర్సరీ టీచర్ పోస్టుకు 30 ఏళ్లు; ఒకేషనల్ టీచర్ పోస్టుకు 35 ఏళ్లు, పీజీటీ, కోర్సు అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు 40 ఏళ్లు, ల్యాబొరేటరీ/కంప్యూటర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు మించకూడదు.

**ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 1, 2, 3

**వేదిక:** రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపాల్ ఛాంబర్, మైసూరు

**వెబ్‌సైట్:** www.riemysore.ac.in/


## లిటిల్స్

### తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు

ఒక ఊరిలో వీరయ్య, రాజయ్య అనే ఇద్దరు రైతులు ఉండేవారు. వీరయ్య ఎల్లపుడూ అందరి తప్పులుసరిదిద్దుతూ., సలహాలు చెబుతూ ఉండేవాడు.రాజయ్య వీరయ్యతో ప్రతి చిన్న విషయానికి అందరినీ నొప్పించడం మంచిది కాదని చెబుతూ ఉండేవాడు. ఇలా చాలా కాలం గడిచిన తర్వాత అందరికీ వీరయ్య సలహాలు వినీవినీ విసుగు కలిగింది. అందరి ముందూ వీరయ్య తమను అవమాన పరచడం చూసి, ప్రజలకు బాధ కలిగింది. వారంతా గ్రామ పెద్దతో తమ బాధను చెప్పుకున్నారు. గ్రామ పెద్ద వీరయ్యను పిలిచి, ఆ మర్నాటి నుండి రాజయ్య పొలంలో కలుపు తీయాలని చెప్పాడు. తన తెలివినీ, పనితనాన్ని అందరూ గుర్తించారని, కాబట్టే రాజయ్య పొలం బాధ్యత కూడా తనకే అప్పగించారని ఆనందించాడువీరయ్య. కొన్ని రోజులకు వీరయ్య వచ్చి, రాజయ్య పొలంలో కలుపు ఇక తాను తీయలేననీ, రాజయ్య తన పని తానే, చేసుకునేట్లు చూడ వలసిందనీ, రాజయ్య పొలంలో కలుపు తీస్తూ ఉంటే తన సొంత పొలంలో కలుపు మొక్కలు పెరిగి పోతున్నాయి కాబట్టి, ఇక తనా పనిని చేయలేనని గామ పెద్దతో చెప్పుకున్నాడు. దానికి గ్రామ పెద్ద, 'నిజమే కదా ఎవరి పొలంలో కలుపు వారే తీసుకోవాలి. అలాగేఎవరి తప్పులు నెమ్మదిగా వారే దిద్దుకుంటారు.. నిరంతరం నువ్వు ఇతరుల తప్పులనే దిద్దుతూ ఉంటే నిన్ను నువ్వు దిద్దుకునేది ఎపుడు?' అన్నాడు. ఆ రోజు నుండి వీరయ్య ప్రతి చిన్న దానిలో అందరిలో తప్పులు వెతకడం మానుకున్నాడు.



### ఎన్ని జంతువులు ఉన్నాయి?




### 6 తేడాలు గుర్తించండి!






### దారి కనుక్కోండి



### సరైన నీడ ఏది?



### డైలీ సుడోకు - 343

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | 5 | | 2 | 1 | | | |
| 9 | | | 8 | | | | | |
| | 1 | | 7 | | | 8 | | |
| | | | | 7 | 5 | | 8 | 6 |
| | | | | | | | | |
| 7 | 5 | | 9 | 4 | | | | |
| | | 4 | | | 6 | | 7 | |
| | | | | | 7 | | | 5 |
| | | | 5 | 3 | | 2 | | 1 |

### సుడోకు - 342 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 5 | 8 | 7 | 6 | 1 | 9 | 4 | 2 |
| 2 | 4 | 1 | 3 | 9 | 8 | 5 | 6 | 7 |
| 9 | 7 | 6 | 5 | 4 | 2 | 1 | 3 | 8 |
| 4 | 2 | 3 | 9 | 7 | 5 | 6 | 8 | 1 |
| 8 | 6 | 5 | 2 | 1 | 3 | 4 | 7 | 9 |
| 1 | 9 | 7 | 6 | 8 | 4 | 2 | 5 | 3 |
| 7 | 1 | 9 | 4 | 3 | 6 | 8 | 2 | 5 |
| 6 | 3 | 2 | 8 | 5 | 9 | 7 | 1 | 4 |
| 5 | 8 | 4 | 1 | 2 | 7 | 3 | 9 | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.